పృథులగిరి.. భక్తసిరి!





గరుడ సేవకు అశేషంగా తరలివచ్చిన ప్రజలు

గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయం

మర్రిపూడి, మార్చి 24 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి గరుడసేవ ఉత్సవానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా అలంకరించిన లక్ష్మీనరసింహ ఉత్సవమూర్తులను పృథులగిరిపై ఊరేగించారు. ఎదురుకోల ఉత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. రాత్రికి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించలేదు. వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదానం చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల వారు తాగునీరు, మజ్జిగ సరఫరా చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కుప్పం కొండలరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఈవో శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. గర్నెపూడి విష్ణుప్రియ బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.



మెట్లు ఎక్కి వెళుతున్న భక్తులు



మేమింతే..!

ఎన్నికలకు దూరంగా ఉండాలన్న ఈసీ ఆదేశాన్ని వలంటీర్లు, మరికొందరు ప్రభుత్వ ఉద్యోగులు బేఖాతరు చేస్తున్నారు. వైసీపీకీ అనుకూలంగా ప్రచారం కొనసాగిస్తూనే ఉన్నారు. వీరిపై చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో వంద మందికిపైగా వలంటీర్లు ఇప్పటి వరకూ ఈసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తెలుస్తుండగా వారిలో కేవలం పది మందిని మాత్రమే విధుల నుంచి తొలగించారు. వారి సమాచారం మాత్రమే జిల్లా కేంద్రానికి పంపారు. మరికొందరిపై చర్యలు తీసుకున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ ఎక్కడికక్కడ వైసీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. అదేసమయంలో ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ ఉపాధి హామీ పథకం, వివిధ శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు కూడా వైసీపీ సేవలో తరిస్తున్నారు. తర్లుపాడు మండలం కలుజువ్వలపాడుకు చెందిన ఓ హోంగార్డు అయితే ఏకంగా రాజకీయ నాయకుడి అవతారం ఎత్తాడు. అయినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మారని వలంటీర్ల తీరు

వైసీపీ సేవలో మరికొందరు ఉద్యోగులు

ఈసీ హెచ్చరికలు బేఖాతరు

అధికార పార్టీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం

అరకొర చర్యలకే పరిమితమవుతున్న యంత్రాంగం

ఇప్పటి వరకూ 10 మంది వలంటీర్లను మాత్రమే తొలగించినట్లు జిల్లా కేంద్రానికి సమాచారం

మరికొందరిపై చర్యలు తీసుకున్నట్లు ప్రకటన

నేతల ఒత్తిళ్లతో వెనకడుగు

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 24 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులతో కలిసి వలంటీర్లు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. నిత్యం అందుకు సంబంధించిన ఫొటోలు, ఆధారాలతో సహా బహిర్గతమవుతున్నా అధికారులు మిన్నకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత అన్ని నియోజకవర్గాల్లో సుమారు వంద మందికిపైగా వలంటీర్లు వైసీపీ ఎమ్మెల్యేలు, ఆపార్టీకి చెందిన ఇతర ముఖ్యనాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం పది మందిని మాత్రమే విధుల నుంచి తొలగించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవోలు పత్రికా ప్రకటనలు విడుదల చేస్తున్నప్పటికీ జిల్లా కేంద్రానికి మాత్రం ఆ వివరాలు అందడం లేదు. జిల్లావ్యాప్తంగా వలంటీర్ల తొలగింపులపై ఏరోజుకారోజు మండల స్థాయి నుంచి జిల్లాస్థాయిలోని గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయానికి వస్తే వాటిని పరిశీలించి ప్రభుత్వానికి ఎంత మందిని తొలగించింది వివరాలు పంపుతారు. కానీ మండల స్థాయి నుంచే జిల్లా కార్యాలయానికి ఆ వివరాలు అందడం లేదు. దీంతో అధికారులు ముందుగా తొలగించినట్లు ప్రకటించి ఆతర్వాత పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకున్నట్లు ప్రకటనలకే పరిమితం

విభజిత జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ప్రతి నియోజకవర్గంలో మండల, గ్రామస్థాయి ముఖ్యనాయకుల ఆదేశాల మేరకు వలంటీర్లను నియమించారు. ప్రస్తుతం తొలగించిన వలంటీర్ల వివరాలను ఆ నాయకుల ఒత్తిళ్లతో పంపడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కేవలం మొక్కుబడిగా అక్కడక్కడా ఒకరిద్దరిని తొలగిస్తున్నారు. ఆయా మండలాల నుంచి తొలగించినట్లు ఇప్పటి వరకు 10 మంది పేర్లు మాత్రమే జిల్లా కేంద్రానికి వచ్చాయి. వారిలో సింగరాయకొండ, పొదిలి, తాళ్లూరు, దొనకొండ, త్రిపురాంతకం, తర్లుబాడు మండలాల వలంటీర్లు మాత్రమే ఉన్నారు. మిగిలిన వారిని తొలగిస్తున్నట్లు మండలస్థాయిలో ప్రకటించినా ఆచరణలో అమలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కాపురం, కనిగిరిల్లో కొందరు వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు ప్రకటించారు. కానీ వారి వివరాలు కూడా జిల్లా కేంద్రానికి అందలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొంటున్న వలంటీర్లపై సత్వర చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాల నాయకులు కోరుతున్నారు.



మాజీ ఎమ్మెల్యే కొండారెడ్డి ఇంట్లో వైసీపీ లోక్‌సభ అభ్యర్థి భాస్కర్ రెడ్డితో కొండారెడ్డి(ఫైల్)



మార్కాపురం వైసీపీ అభ్యర్థి రాంబాబు వేదికపై హోంగార్డు కొండారెడ్డి(ఫైల్)

పగలు ఖాకీ.. రాత్రికి ఖద్దరు... వైసీపీ నేతగా హోంగార్డు

మార్కాపురం, మార్చి 24 : పై ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మందా కొండారెడ్డి. పోలీస్‌శాఖలో ఆయన హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే విధులు ముగిసిన తర్వాత ఆయన పొలిటీషియన్‌గా మారిపోతారు. మార్కాపురం సబ్‌డివిజన్ పరిధిలోని త్రిపురాంతకం క్షేత్రంలో కొండారెడ్డి హోంగార్డుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం తన స్వగ్రామమైన తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులో అధికార వైసీపీకి అన్నీ తానై వ్యవహారాలు చక్కబెట్టేస్తున్నాడు. ఇటీవల వైసీపీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మార్కాపురం వచ్చినప్పుడు పరిచయ కార్యక్రమంలో, మార్కాపురం అసెంబ్లీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు తర్లుపాడులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో సభావేదికపై ఆశీనుడయ్యాడు. ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలని ప్రచారం చేస్తున్న జిల్లా పోలీసు అధికారులు మందా కొండారెడ్డిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వైసీపీ ప్రచారంలో ఒప్పంద ఉద్యోగి

గిద్దలూరు టౌన్, మార్చి 24 : వైసీపీ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ఒప్పంద ఉద్యోగి పాల్గొన్నారు. ఆదివారం మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు వైసీపీ అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్‌లో ఒప్పంద వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బిజ్జం రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అంతేకాకుండా ఆప్రాంతానికి వచ్చిన నాయకులను, కార్యకర్తలను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి ఆయనే పరిచయం చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రచారం చేశారు. ఇదిలావుండగా ఇటీవల శివరాత్రి వేడుకల సందర్భంగా పట్టణంలోని పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్యాలను ఆపేందుకు వెళ్లిన పోలీసులపై రాంభూపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ దశలో 'ఎస్పీ మావాడే, ఏమి కేసు పెట్టుకుంటారో పెట్టుకోండి' అని పోలీసులతో ఆవేశంగా మాట్లాడారు. దీంతో విధులకు ఆటంకం కలిగించారని ఆయనపై నాడు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.




వైసీపీ ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి బిజ్జం రాంభూపాల్‌రెడ్డి

బాబు పర్యటన ఖరారు

31న జిల్లాలో ప్రజాగళం సభలు

మూడు నియోజకవర్గాల్లో కార్యక్రమాలు



ఒంగోలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన ఖరారైంది. ఈనెల 31న ఆయన ఇక్కడికి వస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాగళం సభల పేరుతో ఎన్నికల ప్రచారానికి సిద్ధమైన చంద్రబాబు ఈనెల 27నుంచి పర్యటనలు ప్రారంభిస్తున్నారు. అందులో భాగంగా జిల్లాకు వస్తున్నారు. పార్టీ వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. ఈనెల 31న మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాల్లో ఆయన పర్యటిస్తారు. ఆరోజు ఉదయం నెల్లూరు జిల్లా కావలిలో జరిగే కార్యక్రమంలో పాల్గొనే చంద్రబాబు హెలికాప్టర్‌లో మధ్యాహ్నం మార్కాపురం చేరుకుంటారు. అక్కడ వివిధ వర్గాల మేధావులతో జరిగే సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి సాయంత్రం సంతనూతలపాడు నియోజకవర్గంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రసంగించి రాత్రికి ఒంగోలులో రోడ్ షో నిర్వహించనున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ సభ చీమకుర్తిలో నిర్వహించే అవకాశం ఉంది. చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై పార్టీ అధిష్ఠానం తరపున ప్రతినిధులు ఆదివారం జిల్లాకు వచ్చి మూడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో మాట్లాడినట్లు సమాచారం. అయితే ఎక్కడెక్కడ ఏయే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి, ఇతరత్రా అంశాలపై ఒకట్రెండురోజుల్లో స్పష్టత రానుంది.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

యాదవుల ఆత్మీయ సమావేశంలో పార్టీ అభ్యర్థి జనార్దన్



ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 24 : బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాధాన్యం టీడీపీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ అన్నారు. నగరంలోని గోపాలనగరంలో ఆదివారం నిర్వహించిన యాదవుల ఆత్మీయ సమావేశంలో దామచర్ల పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం టీడీపీ ఆవిర్భవించిందన్నారు. వారికి చట్టసభల్లో సమన్యాయం కల్పించిందన్నారు. రాజకీయం, సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం యాదవ సామాజికవర్గం కృషి చేయాలన్నారు. తనను మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేను చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంపై దామచర్ల, రియాజ్, రాచగర్ల వెంకట్రావులను గోపాలనగరంలో ఊరేగించి, గజమాలతో సత్కరించారు. ఈ ఆత్మీయ సమావేశంలో స్థానికులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆస్తులున్నా.. అమ్ముకోలేరు!

నిషేధిత జాబితాలో 30.71 ఎకరాలు

ఎనిమిదేళ్లుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్‌లు

కరుణించిన దేవదాయశాఖ

స్పందించని రెవెన్యూ అధికారులు

300 కుటుంబాలకు అవస్థలు

పామూరు, మార్చి 24 : పామూరులోని 300 కుటుంబాల వారికి ఆస్తులున్నా ఉపయోగం లేకుండా పోయింది. పిల్లల వివాహాలు, చదువులు, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమైనా ఉన్న భూమిని అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. మొత్తం 30.71 ఎకరాల భూమిని దేవదాయశాఖ అధికారులు తమ భూమిగా నమోదు చేసి నిషేధిత జాబితాలో చేర్చడంతో ఎనిమిదేళ్లుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.



దేవస్థాన కల్యాణ మండపం

ఎట్టకేలకు మూడునెలల క్రితం వారు కరుణించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో నేటికీ లావాదేవీలు జరగడం లేదు. వివరాల్లోకి వెళితే.. పామూరులోని సర్వే నెంబర్ 200లో ఎఫ్‌ఎంబీ ప్రకారం 30.71 ఎకరాలు, ఎఫ్‌ఎల్‌ఆర్ ప్రకారం 28.51 ఎకరాలు ఉంది. అయితే భూమిపై మాత్రం ఎఫ్‌ఎంబీ ప్రకారం మొత్తం విస్తీర్ణం ఉంది. గతంలో గ్రామానికి చెందిన 13 మంది వ్యక్తులపై పట్టాలు ఉండగా కాలక్రమేణా చేతులు మారాయి. ఆ భూమిలో ప్రస్తుతం 300 మంది స్థిరనివాసాలు ఏర్పరచుకొని ఉన్నారు. ఇదే సర్వే నెంబర్‌లో మదనవేణుగోపాలస్వామి, శ్రీవల్లి భుజంగేశ్వర, శ్రీ వరదరాజులు, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలు 1.40 ఎకరాల్లో ఉన్నాయి. మదనవేణుగోపాలస్వామి కల్యాణ మండపం దేవస్థానానికి ఎదురుగా వాసవీమాత ఆలయం వద్ద 4 సెంట్లలో నిర్మితమైంది. 200 సర్వే నెంబర్‌లో ఉన్న మొత్తం భూమి తదనంతరం గ్రామకంఠంగా రికార్డుల్లో నమోదైంది. ఆతర్వాత దేవదాయ శాఖ తన పరిధిలోకి తీసుకుంది. దీంతో హక్కుదారులకు సమస్య ఉత్పన్నమైంది. రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడంతో క్రయవిక్రయాలు ఆగిపోయాయి. ఎనిమిదేళ్లుగా ఆ సర్వేనెంబర్‌లో ఉన్న స్థలాన్ని అత్యవసరమైనా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. కొత్తగా గృహాలు నిర్మించుకోవాలనుకున్న వారు బ్యాంకు రుణం కోసం వెళ్తే వారు ఎండోమెంట్ భూములైనందున రుణం ఇవ్వలేమని కరాఖండిగా చెప్తున్నారు. పిల్లల వివాహాలు, చదువులు, ఇతర ఆర్థిక అవసరాలున్నా భూమిని అమ్మలేని పరిస్థితి నెలకొంది.

మూడు నెలల క్రితం గ్రీన్‌సిగ్నల్.. పట్టించుకోని అధికారులు

రెవెన్యూ అధికారులు 200 సర్వేనెంబర్‌లో ఉన్న మొత్తం విస్తీర్ణాన్ని రెండు సబ్ డివిజన్‌లుగా చేశారు. ఈ రెండు సబ్ డివిజన్లలోని భూమిని ఆన్‌లైన్ చేయాల్సిందిగా దేవదాయ శాఖ ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ నుంచి గత ఏడాది డిసెంబర్ 29న పామూరు తహసీల్దార్ కార్యాలయానికి ఆదేశాలు అందాయి. అదే రోజు పామూరుకు చెందిన రాచూరి మన్మథరావు కలెక్టర్‌ను కలిసి ఏసీ ఆదేశాలను అమలు చేయాల్సిందిగా కోరారు. కలెక్టర్ స్పందించి కనిగిరి ఆర్డీవోకు విషయాన్ని తెలిపి త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అయితే తహసీల్దార్ కార్యాలయంలో ఆ ఫైల్ అలాగే ఉంది. సర్వే నెంబర్ 200/1,2,3 నిషేధిత జాబితాలో ఉండగా, 200 సర్వే నెంబర్‌కు సంబంధించి అమ్మకాలు కొనుగోలు జరగక, రిజిస్ట్రేషన్‌లు కాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ స్థాయిలో గండి పడుతోంది. పాలకులకు బాధితులు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే లేరని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరిస్తే మూడు వందలకు పైగా కుటుంబాలకు విముక్తి లభించి, తమ ఆస్తుల క్రయవిక్రయాలకు అవకాశం ఏర్పడుతుందని బాధిత ప్రజలు కోరుతున్నారు.

సీ విజిల్‌తో చెక్

ఎన్నికల్లో అక్రమాలు, కోడ్ ఉల్లంఘనల అడ్డుకట్టే లక్ష్యం

యాప్‌ను ప్రవేశపెట్టిన ఎన్నికల సంఘం

ప్రజలను భాగస్వామ్యం చేస్తూ నిర్ణయం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24 : సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఈనెల 16 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన విషయం విదితమే. ఈ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. అందులో ప్రజలను కూడా భాగస్వామ్యం చేస్తోంది. సీ విజిల్ యాప్ ద్వారా ఉల్లంఘనలను అడ్డుకునేలా చర్యలు తీసుకుంది.

రిజిస్టర్ చేసుకోవడం ఇలా...

ముందుగా గుగూల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారి సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ నెంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకుంటే ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేస్తే సీ విజిల్ యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా ఎన్నికల్లో అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎలా అప్‌లోడ్ చేయాలంటే

యాప్‌ను తెరవగానే తెరపై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు వస్తాయి. ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఆ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఎక్కడి నుంచి పంపుతున్నారో అక్కడి లోకేషన్ నమోదవుతుంది. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. వీడియో, ఆడియో కూడా అదే విధంగా చేయాలి.

సాక్ష్యాలతో ఈ యాప్‌లో పొందుపర్చవచ్చు

సీ విజిల్ యాప్‌లో ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా పొందుపర్చవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదుచేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి వంద నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. పార్టీలకతీతంగా ఎవరు ఉల్లంఘనలకు పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

అప్‌లోడ్ చేసిన వెంటనే రంగంలోకి అధికారులు

యాప్‌లో ఫొటో, వీడియో, ఆడియోలను పొందుపర్చిన వెంటనే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. అక్కడ విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఎన్నికల అధికారి దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా వంద నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదుపై స్టేటస్‌ను తెలుసుకునే వెసులుబాటును కూడా ఎన్నికల సంఘం కల్పించింది.



ఎలాంటివి చేయవచ్చు అంటే..

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉంటే ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం వంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో, ఆడియో ద్వారా రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయాలి.

ఈ యాప్ ద్వారా అరాచకానికి చరమగీతం

తాయిలాలు పంచి, అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమగీతం పాడేందుకు అవకాశం కలిగింది. యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకొని ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘనలు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒంగోలులో హైకోర్టు న్యాయమూర్తి

• మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్


జస్టిస్ శ్రీనివాసరెడ్డికి మొక్కను ఇస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24 : హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒంగోలు వచ్చారు. స్థానిక పోలీసు అతిథిగృహంలో ఉన్న ఆయన్ను కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం జిల్లా కోర్టులో నిర్వహించిన జ్యుడీషియల్ సమీక్షలో జస్టిస్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గ్రంధి వెంకటేశ్వరరావు జయంతి

• జీవీఆర్ ఫ్యాక్టరీలో రక్తదాన శిబిరం


వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీఎం శ్రీనివాస్, సిబ్బంది

సింగరాయకొండ, మార్చి 24 : జీవీఆర్ సంస్థల వ్యవస్థాపకుడు దివంగత గ్రంధి వెంకటేశ్వరరావు 84వ జయంతి వేడుకలను మండలంలోని పాతసింగరాయకొండ పరిధిలోని జీవీఆర్ ఫ్యాక్టరీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిబ్బంది, కార్మికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ బీబీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల ఉపాధి కల్పనకు కృషిచేసిన మహోన్నత వ్యక్తి వెంకటేశ్వరరావు అని కొనియాడారు. అనంతరం జీవీఆర్ సంస్థల ఎండీ గ్రంధి చల్లారావు నేతృత్వంలో రిమ్స్ వైద్యురాలు వెన్నెల, వారి బృందం పర్యవేక్షణలో రక్తదానశిబిరం నిర్వహించారు. 105 మంది రక్తదానం చేశారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ ఆరితోటి బాబురావు, ప్రొడక్షన్ మేనేజర్ శంకర్, చల్లాదొరై, బాలాజీ, టీడీపీ నేత కూనపరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణ మహోత్సవం


పూజల్లో పాల్గొన్న విజయ్‌కుమార్ తదితరులు

చీమకుర్తి, మార్చి 24 : చీమకుర్తి పట్టణంలోని దిన్నేపురంలో శ్రీలక్ష్మితిరుపతమ్మ అమ్మవారి కల్యాణమహోత్సవం ఆదివారం కనులపండవగా జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మట్టలాదివారం


ఉప్పుగుండూరులో మట్టలాదివారం వేడుకలు

నాగులుప్పలపాడు మార్చి 24 : పరిధిలోని పలు గ్రామాలలో క్రైస్తవులు ఆదివారం మట్టలా దివారం వేడుకలను ఉత్సాహంగా జరుపు కొన్నారు. మండల సంఘ కాపరుల ఆధ్వర్యంలో చిన్నారులు ఈతమట్టలు పట్టుకొని క్రైస్తవగీతాలను ఆలపించారు. అనంతరం చర్చిలలో బైబిల్ సందేశాలను, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

క్షయ నివారణపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న అధికారులు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 24 : ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా క్షయ నివారణశాఖ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ నుంచి మొదలైన ర్యాలీని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. క్షయను ప్రారంభదశలోనే గుర్తించడం ద్వారా నయం చేసుకోవచ్చని డాక్టర్ ఎండీ జహంగీర్‌సుల్తాన్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ఎం.సృజన పేర్కొన్నారు. అనంతరం క్షయ బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చికిత్స కాలంలో పోషకాహార నిమిత్తం ప్రతి నెలా రూ.500 నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా జమ చేస్తామని తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్లతో అవినీతి రాజకీయం


సదస్సులో మాట్లాడుతున్న ప్రసాద్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24: కేంద్రప్రభుత్వం తెచ్చిన ఎలక్టోరల్ బాండ్ల వల్ల అవినీతి పెరిగిపోయిందని రిటైర్డ్ లెక్చరర్ సీఎస్ఆర్.ప్రసాద్ ఆరోపించారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం ఆసరా ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ఆసరా అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ల చట్టం 2017లో ఎన్‌డీపీ ప్రభుత్వం చేసిందని, ఆ విధానం రాజకీయ వ్యతిరేకమన్నారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ రూ.69వేల కోట్లకు పైగా నిధులను సమీకరించుకుందన్నారు. వామపక్షాలు మినహా జాతీయ, ప్రాంతీయ పార్టీలు వ్యతిరేకించినప్పటికీ మోదీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చిందని ఆరోపించారు. అప్పుడే సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనాల వాజ్యం వేసినా దానిపై తీర్పు చెప్పేందుకు ఏడుసంవత్సరాలు పట్టిందని వ్యాఖ్యానించారు. బాండ్లు తీసుకున్న రాజకీయ పార్టీలు వాటిని నగదు కింద మార్చుకుని బాండ్లను తిరిగి ఇచ్చిన వారికే ఇవ్వమని తీర్పు చెప్పడం ఆశ్చర్యకరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంసీ వెంకటేశ్వర్లు, పీవీ ఆర్.చౌదరి, సుబ్రహ్మణ్యం, కరవది సుబ్బారావు, వి.హనుమారెడ్డి, వీరారెడ్డి, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బండలాగుడు పోటీలు

గిద్దలూరు, మార్చి 24 : మండలంలోని నరవ గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 26, 27వ తేదీలలో రాష్ట్రస్థాయిలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతిగా రూ.లక్ష ఇవ్వనున్నట్లు తెలిపారు. 27న ఉదయం ఆరు పండ్ల విభాగంలో బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. పోటీలో పాల్గొనే వారు 9866432566 నెంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ముస్లింల సంక్షేమం కోసం కృషి

• ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల



ప్రార్థనలో పాల్గొన్న దామచర్ల జనార్దన్, ఇఫ్తార్ విందును వడ్డిస్తున్న దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 24 : ముస్లింల సంక్షేమం కోసం టీడీపీ కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని గోపాలకృష్ణ కళ్యాణమండపలో టీడీపీ నాయకురాలు షేక్ ఆరాఫా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో దామచర్ల హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో ముస్లింల అభివృద్ధి కోసం తాను పని చేశానని తెలిపారు. నగరంలోని షాదీఖానా అభివృద్ధి, ఖబరస్థాన్‌లు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇఫ్తార్ ప్రార్థనలో పాల్గొని ముస్లింలకు విందు వడ్డించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ కపిల్ బాషా, మత ప్రవక్తలు, ముస్లింలు పాల్గొన్నారు.

వైసీపీ వీడి పలువురు టీడీపీలో చేరిక

ఒంగోలు నగరంలోని 9వ డివిజన్ నుంచి పలువురు వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. కావూరి భాస్కర్‌రెడ్డి, రామలింగం కృష్ణారెడ్డి, దేవరంపాటి నాగేశ్వరరావు, కోట సురేష్, మేడికొండ కృష్ణతోపాటు మరో ఇరవై మంది దామచర్ల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అలాగే ముస్లిం నాయకులు ఎంబీ.షరీఫ్, ఎండీ.అజముస్తారీ, లాల్‌బాబు, అబ్దుల్ ఖాదర్, వసీం సోను, దామచర్లను కలిసి టీడీపీలో చేరారు. నగరంలోని 1వ డివిజన్‌కు చెందిన వైసీపీ యువత దరిసిముక్కల సందీప్, మల్లెల అనీల్, బొంతా ఆకాష్, దరిసిముక్కల నిఖిల్, కోటపూడి రాకేష్ మరో యాభై మంది తెలుగుదేశం పార్టీలో చేరగా దామచర్ల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ఎస్ఎన్‌పాడు టీడీపీ అభ్యర్థి బీఎన్ • వైసీపీ నుంచి టీడీపీలోకి పెరుగుతున్న వలసలు • సాదరంగా ఆహ్వానించిన విజయ్‌కుమార్



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో విజయ్‌కుమార్, మైనంపాడు కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీఎన్

సంతనూతలపాడు, మార్చి 24 : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో పేర్నమిట్ట పరిధిలోని 41వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు నూకతోటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 10 కుటుంబాలు ఆదివారం విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా సంతనూతలపాడుకు చెందిన న్యాయవాది మంగళపూడి ఆదిత్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలుగ్రామాలకు చెందిన 20 కుటుంబాలు వైసీపీని టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికి బీఎన్ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో జరుగుతున్న దౌర్జన్యాలు ప్రజలందరా గమనించాలని, కూటమి అభ్యర్థిగా నిలబడిన తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ పాలనలో మళ్లీ బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర కులాలకు సమన్యాయంగా పథకాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, బొమ్మాజి అనిల్, నాయకులు ఎం.శ్రీను, ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటేశ్వర్లు, బి.శ్రీను, అనీల్, గోపి, రంజీవి తదితరులు పాల్గొన్నారు.

మైనంపాడులో..

మైనంపాడులో ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో నాడు ఉన్న అభివృద్ధి నేడు కనబడటంలేదన్నారు. వైసీపీ పాలకులు లక్షలకోట్లు అప్పులు ఎందుకు తెచ్చారో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు అన్ని రంగాలను సమప్రాదికన అభివృద్ధి చేశారని, నేడు జగన్ మాత్రం కనీసం ఒక్క రంగంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశానని చెప్పగలరా అని ప్రశ్నించారు. టీడీపీలో నాయకుని దగ్గర నుంచి కార్యకర్త వరకు సమప్రాధాన్యత ఇచ్చే వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి మద్దతు పలకాలని బీఎన్ కోరారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొమ్మాజి అనిల్, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వామి మాతృమూర్తికి నివాళులు

కొండపి నియోజకవర్గంతోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, టీడీపీ అభ్యర్థుల రాక • డోలా కుటుంబ సభ్యులను పరామర్శించిన శ్రేణులు



సుబ్బమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న పోతుల రామారావు, అంత్యక్రియలకు హాజరైన దామచర్ల జనార్దన్, సత్య, పక్కన ఎమ్మెల్యే స్వామి తదితరులు

తూర్పునాయుడుపాలెం(టంగుటూరు), మార్చి 24 : వయోభారం, తీవ్ర అనారోగ్యం కారణంగా ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాతృమూర్తి సుబ్బమ్మ(83) శనివారం రాత్రి మృతి చెందారు. ఆమె కొంతకాలంగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు అక్కడ్నుంచి తూర్పునాయుడుపాలెం తీసుకొస్తుండగా మార్గమధ్యలో రాత్రి 8గంటల తరువాత కన్నుమూశారు.అర్ధరాత్రి 2.30గంటల సమయంలో సుబ్బమ్మ పార్థివదేహం తూర్పునాయుడుపాలెంలోని స్వగృహానికి తీసుకొచ్చారు. విషయం ముందుగా తెలియడంతో నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్యే ఆగమేఘాల మీద తూర్పునాయుడుపాలెం చేరుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఎమ్మెల్యే ఇంటికి తాకిడి నెలకొంది. పలువురు ప్రజాప్రతినిధులు, పలు నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలంతా సుబ్బమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో పర్చూరు, అద్దంకి ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు, సంతనూతలపాడు, కందుకూరు టీడీపీ అభ్యర్థులు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి పార్టీ ఇన్‌చార్జి సురేష్, నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, సత్య, పోతుల రామారావు, దివి శివరాం, పారిశ్రామిక వేత్త బెల్లం కోటయ్య ఉన్నారు.

అశ్రునయనాలతో అంతిమయాత్ర

ఆదివారం సాయంత్రం సుబ్బమ్మ అంతిమయాత్ర జరిగింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రునయనాల నడుమ, మేళతాళాలతో నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గరుండి ఆమె మృతదేహాన్ని ఖననం చేయించారు. దామచర్ల పూర్ణచంద్రరావుతోపాటు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, నియోజకవర్గంలోని అనుచరులు పాల్గొన్నారు.

పలువురి నివాళులు

కొండపి: ఎమ్మెల్యే స్వామి మాతృమూర్తి సుబ్బమ్మ భౌతికకాయాన్ని ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని స్వగృహంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, పార్టీ కొండపి మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడు, నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి, దామా మురళి, కొర్రపాటి వసంతరాయుడు, గుండపనేని రామ్మూర్తినాయుడు, జరుగుమల్లి మండల టీడీపీ అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, పోటు శ్రీనివాసమురళి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, సుబ్బారెడ్డి, నరాల సోమయ్య, కొమ్మాలపాటి కృష్ణ, చదలవాడ బ్రహ్మేంద్రం, పాతూరి కోటేశ్వరరావు, పొన్నలూరు మండల పార్టీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు మండవ మురళి, కర్నా కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, తెలుగు యువత నాయకుడు అనుమోలు సుధాకర్ తదితరులు నివాళులర్పించారు.

బీసీల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య • చెంచుపాలెంలో 40 బీసీ కుటుంబాలు తెలుగుదేశంలో చేరిక


టీడీపీలో చేరిన వారితో దామచర్ల సత్య

పొన్నలూరు(కొండపి), మార్చి 24 : బీసీల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భావం నుంచి పనిచేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య చెప్పారు. ఆదివారం రాత్రి మండలంలోని మాలెపాడు గ్రామ పంచాయతీ చెంచుపాలేనికి చెందిన 40 బీసీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు అధ్యక్షతన గ్రామంలో జరిగిన సమావేశంలో సత్య మాట్లాడుతూ బీసీల రక్షణకు చంద్రబాబు ప్రత్యేక చట్టం చేస్తామని మేనిఫెస్టోలో హామీనిచ్చారన్నారు. బీసీలకు ఆదరణ పథకం ద్వారా వారికి పనిముట్లు అందజేసి వారి జీవనోపాధుల పెంపునకు టీడీపీ కృషి చేసిందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు వారి కులవృత్తులు చేసుకునేందుకు అధునాతన యంత్ర పరికరాలు అందించడంతోపాటు, వారికి ప్రత్యేకమైన శిక్షణ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కర్నా కోటిరెడ్డి, మండవ ప్రసాద్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్, టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కుర్రా మాల్యాద్రి, నాయకులు గంగిరెడ్డి బ్రహ్మారెడ్డి, మండవ మురళి, మోరబోయిన మాల్యాద్రి, గెట్టిబోయిన మల్లికార్జున, రామనబోయిన తిరుపాలు, ముచ్చు ఆదియ్య, డబ్బుకొట్టు మధు, గమ్మం సింహాద్రి, మేకనబోయిన మల్లికార్జున, గుమ్మా మహేష్, గుమ్మా సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


పూజలలో పాల్గొన్న భక్తులు

సంతనూతలపాడు, మార్చి 24: సంతనూతలపాడులో శ్రీదేవి, భూదేవి సమేత, శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 27వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివార్లకు సమక్షంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

నేడు శ్రీవీరాంజనేయస్వామి తిరుణాళ్ల


విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం

నాగులుప్పలపాడు మార్చి 24: ఉప్పుగుండూరు గ్రామంలోని ఊరచెరువులో ఉన్న శ్రీవీరాంజనేయ స్వామి 38వ వార్షిక తిరుణాళ్ల సోమవారం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పొంగళ్లు, సాయంత్రం స్వామి వారి దర్శనం, కోలాటం, హరిశ్చంద్ర నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొరు. తిరుణాళ్ల సందర్భంగా స్వామివారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

చేపల మార్కెట్‌పై రాజకీయం సిగ్గుచేటు

• ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24 : ఒంగోలులోని చేపల మార్కెట్‌పై మాజీ శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రాజకీయం చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఆదివారం నగరంలోని చేపల మార్కెట్‌ను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ చేపల మార్కెట్ ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో అందరికీ తెలుసన్నారు. ఎన్నికల సమయం టీడీపీ నాయకులు రాజకీయం చేసేందుకు కుట్ర పన్నడం దుర్మార్గంగా ఉందన్నారు. షాపుల అద్దె విషయంలో ఎన్నికల ముగిసిన తర్వాత చేపల విక్రయదారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కఠారి రామచంద్రరావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, కఠారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ఒంగోలు(కల్చరల్), మార్చి 24 : సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మజీద్ ఏ కౌశర్‌కి (మసీదు) మరమ్మతులకు రూ.17వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ట్రస్టు సెక్రటరీ షేక్ సర్దార్ బాషా ఆధ్వర్యంలో ప్రవాస భారతీయుడు ఈదర సురేష్ ఆర్థిక సహకారంతో ఆదివారం స్థానిక ట్రస్టు కార్యాలయంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, ట్రస్టు చైర్‌పర్సన్ షహనాజ్‌ల ద్వారా మసీదు పెద్ద అమీర్ సాహెబ్‌కు అందజేశారు.

30న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన పౌరసత్వం సవరణ చట్టం(సీఏఏ)కు వ్యతిరేకంగా ఈనెల 30న ఒంగోలులో జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని వామపక్ష లౌకిక పార్టీలు, ముస్లిం ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఆదివారం స్థానిక ఇస్లాంపేటలోని ముస్లిం కమ్యూనిటీ హాలులో ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సయ్యద్‌సర్దార్, మాట్లాడుతూ ఈ ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు షేక్ కరీముల్లా, సయ్యద్‌ఇస్మాయిల్, పఠాన్ కరీముల్లా ఖాన్, షేక్ కపిల్‌బాషా, సయ్యద్ హుస్సేన్, షేక్ సలార్, అబ్దుల్‌రావుఫ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24 : త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో భారత చైతన్య యువజన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని స్థానాల్లో అభ్యర్థులను పోటీలో నిలబెట్టి తమ సత్తా చాటుతుందని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయ సారధి మిరియం శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత రాజకీయలకు దీటుగా పోటీలో ఉండి ఓటింగ్ శాతాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. బహుజనుల ఆత్మగౌరవం కోసం ఏర్పడిన పార్టీ బీసీవై అని ఆయన పేర్కొన్నారు.

31న భగత్‌సింగ్‌పై సదస్సు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24 : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్థంతి సందర్భంగా విప్లవకారునిగా, నాస్తికునిగా భగత్‌సింగ్ అనే అంశంపై ఈనెల 31వతేదీన స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభలో అంబటినాగయ్య, శాస్త్రీయ ఆలోచన విధానం అంశంపై డాక్టర్ జయకుమార్‌లు ఉపన్యసిస్తారన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కరువు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24 : సిబిల్ స్కోర్ పేరుతో ఉపాధి అవకాశాల్లో యువతకు అన్యాయం జరుగుతుందని విద్యార్థి, యువజన సంఘాల ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి రాయపాటి జగదీష్ ఆరోపించారు. ఒంగోలులో ఆదివారం విద్యార్థి, యువకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, ప్రైవేటు బ్యాంకులు, ప్రైవేటు ఫై-నాన్స్ సిబిల్ స్కోర్‌ను పారిశ్రామికవేత్తల చేతుల్లో పెట్టి ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీల్లో వెనుకబడిన వర్గాల యువతకు ఉపాధి అవకాశాలను దూరం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కుమార్, పుష్పరాజ్, శ్రీకృష్ణ, కరుణాకర్, సూర్య, కార్తీక్, అశోక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మయ్యకు నివాళి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24: దళిత విప్లవకారుడు నాదెండ్ల బ్రహ్మయయ్య సంస్మరణ సభ ఆదివారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జరిగింది. దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు అంబేడ్కర్ వాది వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ నాయకులు పి.ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై బ్రహ్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అడ్వకేట్ సురేష్, నాయకులు చావలి సుధాకర్, ఎస్.మోహన్‌కుమార్ ధర్మా, సుబ్బారావు, కొంగర నరసింహం, కరవది సుబ్బారావు, వై.సాంబశివరావు, నరసింహరావు, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దళిత బహుజనులు రాజ్యాధికారం సాధించాలి

సంతనూతలపాడు, మార్చి 24: దళిత బహుజనులకు రాజ్యాధికారం ద్వారానే సాంఘిక సమానత్వం అందుతుందని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం పేర్కొన్నారు. మంగమూరు గ్రామంలో ఆదివారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు, జగన్ పవన్‌కళ్యాణ్‌లు మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుండగా, మోదీ రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలను చేపడుతున్నట్లు ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో తమ పార్టీ తరుపున పోటీ చేస్తామని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంగీతరావు, ఏసు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'


మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

ఒంగోలు(కల్చరల్), మార్చి 24: ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వారం గ్రంథాలయంలో జరిగే చదవడం మాకిష్టం కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో రావాలన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు జులాది మోహన్ నీతి కథలను బోధించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ ఐనంపూడి నరసింహారావు, సామాజిక కార్యకర్త నున్నా ఆంజనేయులు, కె.సంపూర్ణ, డి.సందీప్ పాల్గొన్నారు.

టీడీపీ నేత చంద్రమౌళి మృతి


చంద్రమౌళి(ఫైల్)


టంగుటూరు, మార్చి 24 : టంగుటూరు అంబేడ్కర్ నగర్ టీడీపీ నాయకుడు దేవరపల్లి చంద్రమౌళి(65) శనివారం రాత్రి మృతి చెందారు. ఇటీవల గుండెపోటుకు గురై దెబ్బతిన్న నాలుగు వాల్వులు వేయించుకొని ఇంటి వద్ద చికిత్స పొందుతున్న చంద్రమౌళిని ఉన్నట్టుండి మృత్యువు కబళించింది. ఆయనకు భార్య ఐదుగురు కుమార్తెలున్నారు. అంబేడ్కర్‌నగర్‌లోని స్వగృహంలో ఉన్న చంద్రమౌళి మృతదేహాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జక్కుల శ్రీనివాసరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత భగత్‌సింగ్

నాగులుప్పలపాడు మార్చి 24 : స్ఫూర్తి ప్రదాత భగత్‌సింగ్ అని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మాబు పేర్కొన్నారు. కార్మికసంఘాల ఆధ్వర్యంలో ఉప్పుగుండూరులో ఆదివారం భగత్‌సింగ్ వర్థంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తూబాటి శ్రీకాంత్, ఎస్.రామారావు, కాకాని సుబ్బారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం శింగరకొండ

నేడు ప్రధాన తిరునాళ్ల , సాయంత్రం రథోత్సవం



శింగరకొండ ఆలయం వ్యూ(ఇన్‌సెట్లో) బాలాలయంలో ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, మార్చి 24: శింగరకొండ క్షేత్రం భక్తుల కొంగు బంగారంగా ఖ్యాతికెక్కింది. ఒకప్పుడు ఇక్కడ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ఆ దేవాలయాలతో పాటు భక్తాంజనేయస్వామి దేవాలయం, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, కోదండరామ స్వామి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, అయ్యప్పస్వామి దేవాలయం, శ్రీకృష్ణుని దేవాలయం, 99 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయాలు, ఇంకా పలు చిన్న దేవాలయాలు ఉన్నాయి. కొండపై ఉన్న లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి మెట్ల మార్గం ఉంది. మూడు దశాబ్దాల క్రితం కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం చేశారు. రెండు తెలుగు రా ష్ట్రాలలో దక్షిణ ముఖంగా ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం శింగరకొండ లో మాత్రమే ఉంది. 1916 లో భవనాసి చెరువు నిర్మాణం పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలలో పనులు పూర్తి చేశారు. ఆ సమయంలో ఆంజనేయస్వామి దేవాలయం కొద్దిమేర అభివృద్ధి చేశారు. తొలుత మంగళ, శని వారాలలో మా త్రమే భక్తులు శింగరకొండ కు వచ్చేవారు. 1960 నుచి దేవాలయం దేవదాయశాఖ పరిధిలోకి చేరింది. అనంతరం భక్తులు, దాతల సహకారంతో దేవాలయం అభివృద్ధి చెందింది. 1984లో ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. దక్షిణ రాజగోపురాన్ని దేవాలయం నిధులతో నిర్మించగా, మిగిలిన మూడు రాజగోపురాలను దాతల సహకారంతో నిర్మించారు. దేవస్థానం ముఖ మండపం పునర్నిర్మాణానికి టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. మరో రూ.3 కోట్లు దాతల నుంచి సేకరిస్తూ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో పక్కనే బాలాలయంలో ప్రత్యేకంగా మొద్దుతో స్వామి వారి విగ్రహం తయారు చేయించి ప్రతిష్ఠించారు. ప్రస్తుతం కూడా అక్కడే స్వామి వారి దర్శనం కొనసాగుతుంది. ప్రధాన ఆలయం పనులు పూర్తయ్యేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది.

దాతల సహకారంతో మారిన రూపురేఖలు

శింగరకొండలో ఇటీవల కాలంలో దాతల సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరగటంతో రూపురేఖలు మారిపోయాయి. శింగరకొండలో టీటీడీ, రా ష్ట్ర ప్రభుత్వం, దాతల సహకారంతో సుమారు రూ.7 కోట్లతో రాతి ముఖ మండపం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దాతల సహకారంతో పొంగలిశాల, భక్తుల విశ్రాంతిశాల, నిత్యాన్నదాన భవనం, షాపింగ్ కాంప్లెక్స్, పరిపాలన భవనం, కేశఖండన శాల, పోలవరపు యాగశాల, గోశాల నిర్మాణం చేశారు. దామచర్ల అతిథి గృహం ఆధునికీకరణ పనులు చేపట్టారు.

మూడురోజుల పాటు తిరునాళ్ల

ప్రతి ఏటా పాల్గుణ శుద్ధ త్రయోదశి నుండి పౌర్ణమి వరకు మూడు రోజుల పాటు తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతాయి. మూడోరోజు ప్రధాన తిరునాళ్ల జరుగుతుంది. ఈఏడాది మార్చి 23 నుంచి 25 వరకు 69వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతునున్నాయి. ప్రధాన తిరుణాళ్ల సోమవారం జరగనుంది.

తొలిసారి ఒకే ఒక్క విద్యుత్ ప్రభ

తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభమై 69 సంవత్సరాలు కాగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఒకే ఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటు జరుగుతుంది. రాజకీయ పార్టీ ల నేతల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభల ఏర్పాటు జరుగుతుంటుంది. ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీల జెండాలు ఏర్పాటు కు అనుమతి లేకపోవటం, డ్యాన్స్ లకు పోలీస్ అధికారులు అనుమతులు ఇవ్వకపోవటం తో విద్యుత్ ప్రభల ఏర్పాటుకు వెనుకడుగు పడింది. అద్దంకి మున్సిపాలిటీ లోని వైసీపీ కౌన్సిలర్ ల ఆధ్వర్యంలో మాత్రమే ఒకే ఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులు ఒకింత నిరుత్సాహంకు గురవుతున్నారు. అదే సమయంలో ప్రధాన ఆలయం రాతి మండపం నిర్మాణ పనులు జరుగుతుండగా బాలాలయం లో ఆంజనేయ స్వామి దర్శనం చేసుకోవాల్సి రావటం కూడా భక్తులలో నిరాసక్తతను మరింత పెంచింది. దీంతో గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు ఈ ఏడాది శింగరకొండ వార్షిక తిరునాళ్లకు ఏర్పడ్డాయని భక్తులు అభి ప్రాయ పడుతున్నారు.

వైభవంగా అభిషేకాలు

అద్దంకి, మార్చి 24: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షికోత్సవ తిరునాళ్ల ఉత్సవాలు రెండోరోజు ఆదివారం వైభవంగా సాగాయి. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఉదయం సుప్రభాత సేవ, బిందె తీర్థం నిర్వహించారు. అనంతరం విశేష అభిషేకం నిర్వహించారు. రుత్వికులచే మహాన్యాస పూర్వక ఏకాదశ మన్యుసూక్త వారాభిషేకం, సందరాకాండ పారాయణ, సూర్య నమస్కారాలు, సప్తశతి పారాయణ, పంచామృతాలు, దశ ద్రవ్యాలచే విశేష అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన భజన, శ్రీసాయి నాట్య కళా సమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన దేవనర్తకి పూర్తి నాటకం, కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామి వారికి ఉష్ట్ర వాహన సేవ నిర్వహించారు.ప్రధాన తిరునాళ్ల సందర్భగా సోమవారం ఉదయం సుప్రభాత సేవ, బిందె తీర్థం, ప్రాతఃకాలార్చన నిర్వహించనున్నారు. ఉదయం 5.30 నుంచి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్విరామంగా స్వామి వారి దివ్య దర్శనం ఉంటుంది. సోమవారం ఉదయం 10 గంటలకు భజన, రాత్రి 7 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన, సాం స్కృతిక కార్య క్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు రథోత్సవం కన్నుల పండుగగా సాగనుంది. లక్ష్మీనరసింహస్వామి దేవాలయం లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. రెండు దేవాలయాల వద్ద విద్యుత్ దీపాల వెలుగులతో దేదీప్యమానంగా మారింది. సోమవారం కొండపైకి దాతల సహకారంతో ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా అద్దంకి డిపో నుంచి 30 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. ఒంగోలు, పొదిలి, వినుకొండ, నర్సరావుపేట డిపోల నుంచి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. సుమారు ఆరువందల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నామ్ రోడ్డులో ట్రాఫిక్‌ను మేదరమెట్ల, సంతమాగులూరు అడ్డరోడ్డుల వద్ద నుంచి చిలకలూరిపేట, నర్సరావుపేట ల మీదుగా మరల్చనున్నారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారికి విశేష అభిషేకం నిర్వహిస్తున్న పూజారులు



మాట్లాడుతూ రాష్ట్ర ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

పాఠశాలల విలీన ప్రక్రియ సరైనది కాదు

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

కనిగిరి, మార్చి 24: జాతీయ నూతన విద్యా విధానం అమలులో భాగంగా పాఠశాలల విలీన ప్రక్రియ విధానం సరైనది కాదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. కనిగిరిలో ఎస్టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యా వ్యవస్థకు నష్టం కల్గించే విలీన ప్రక్రియపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ఎస్టీయూ ప్రధాన భూమిక పోషించిందన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం ని రంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం ఆవిర్భవించిందే ఎస్టీయూ అన్నారు. ఎన్నో చారిత్రాత్మక ఉద్యమాలను ముందుండి నడిపిన సంఘమన్నా రు. నేడు ఉపాధ్యాయులు పొందుతున్న సౌలభ్యాల సాధనలో ఎస్టీయూ చేసిన కృషి ఎంతో ఉందన్నారు. రీ గ్రూపింగ్ పేస్కేల్స్, ఇంక్రిమెం ట్లు, డీఏ, హెచ్ఆర్ఏ, ఏఎస్, ఉద్యోగోన్నతుల సాధన ఎస్టీయూ పోరాటాల ఫలితమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీరమణారెడ్డి, బీ వెంగళరెడ్డి మాట్లాడుతూ వీణా విజయరామరాజు, కత్తి నరసింహారెడ్డి లాంటి పోరాట యోధులు పనిచేసిన సంఘం ఎస్టీయూ అన్నారు. గత ప్రభుత్వాలలో చర్చలు, పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలకు వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచేలా వ్యవహరించటం అన్యాయమన్నారు. సుదీర్ఘ కాలం పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ విశేష సేవ లందించిన ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం ఎంతైనా అవసరమన్నారు. నిబద్ధతతో పనిచేసే వారు ఎస్టీయూలో సభ్యులుగా చేరి సమస్యల సాధనలో పాలపంచుకోవాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ఎర్రయ్య, రాష్ట్రకార్యవర్గసభ్యులు శ్రీనివాసులు, జిల్లా ప్రధానకార్యదర్శి జీ నరసింహారెడ్డి, కనిగిరి అధ్యక్షుడు తుమ్మా వెంకటేశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి జీ ప్రసన్నాంజనేయులు, జిల్లాఅసోసియేట్ అధ్యక్షుడు దొడ్డా తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నేతలు

జగన్‌కు బుద్ధి చెప్తాం

● బీసీ సంఘ నాయకుడు మాలకొండలరావు

కనిగిరి, మార్చి 24: బీసీల ప్రాణాలను బలిగొంటున్న జగన్ రెడ్డికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని బీసీ సంఘాల నాయకులు పల్లా మాలకొండలరావు అన్నారు. కడప ప్రాంతంలో వైసీపీ నాయకుల భూకబ్జాకు గురై ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబానికి కళ్లకు గంతలు కట్టుకుని ఆదివారం కొవ్వొత్తులు వెలిగించి వారి చిత్రపటాలకు నివాళలర్పిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో బలహీన, బడుగు వర్గాలకు చెందిన భూములు కబ్జాకు గురయ్యాయన్నారు. ఏ అండలేని బీసీ కుటుంబాలు తమ భూములను కబ్జా చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకున్న దాఖలాలే లేవన్నారు. దీంతో చేసేది లేక బీసీ వర్గాలకు చెందిన కుటుంబాలు బలవన్మరణాలకు పాల్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా కడప ప్రాంతంలోని రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన మరో చేనేత కుటుంబం బలవన్మరణానికి పాల్పడడం బాధాకరమన్నారు. ఇది ముమ్మాటికి వైసీపీ హత్యే అన్నారు. దీనికి జగన్‌రెడ్డి సమాధానం చెప్పి తీరాలన్నారు. సామాజిక న్యాయం అంటూనే బడుగుల కుటుంబాలను పొట్టన పెట్టుకుంటున్నారన్నారు. జగన్‌రెడ్డి సొంత జిల్లాలోనే పేదల భూముల లాగేసుకున్నారంటే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో భూములు ఏస్థాయిలో కబ్జా చేశారో అర్థమవుతుందన్నారు. అన్ని వ్యవస్థలనూ తమ చెప్పుచేతల్లోకి తీసుకుని ప్రభుత్వ యంత్రాంగాన్ని కనుసన్నల్లో నడిపి భూరికార్డులను తారుమారు చేసి ఎంతోమంది పేదల భూములను వైసీపీ నేతలు మింగేస్తున్నా జగన్ రాక్షసానందం పొందుతున్నారన్నారు. గతంలో జగన్ సొంత జిల్లాలోని పద్మశాలీ నేతను అత్యంత దారుణంగా చంపేశారని గుర్తు చేశారు. నేటికీ నిందితులపై చర్యలు తీసుకోలేదన్నారు. దీనినిబట్టి బీసీలపై జగన్‌రెడ్డి కక్ష తేటతెల్లమవుతుందన్నారు. టీడీపీతోనే బీసీలకు అండ, ధైర్యం అన్నారు. బీసీలంతా ఐక్యంగా రాష్ట్రం కోసం, బీసీ పిల్లల భవిష్యత్ కోసం చంద్రబాబును గెలిపించుకోవడం అనివార్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను చిత్తుగా ఓడిస్తేనే వారి ఆత్మలకు నిజమైన శాంతి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, బీసీ సంఘాల నాయకులు తిరుపాలు, సిద్ధాంతి బారాయిమాం, షేక్ ఫిరోజ్, బాలబాబు, నంబలు వెంకటేశ్వర్లు, సైకం మాలకొండారెడ్డి, తిరుపతయ్య, చిలకపాటి లక్ష్మయ్య, షేక్ నజీముద్దీన్, పాలూరి సత్యం, జానీ, వెంకటేశ్వర్లు, పెన్నా వెంకటేశ్వర్లు, కేవీఎస్‌గౌడ్, నాగూర్, మారుతి, మోజెస్, విజయ్, రిజ్వాన్, ఫారూక్, మణికంఠ, తెలుగుమహిళలు స్వప్న, సుధారాణి, అమ్ములు పాల్గొన్నారు.

వైసీపీ కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, మార్చి 24: అధికారం కోసం జగన్ కుయుక్తులు, కుట్రలు, దౌర్జన్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం పర్చూరు, కుంకలమర్రు గ్రామాలకు చెందిన వంద కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఏలూరి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా ఏకమై తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలవాలన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రానికి స్వర్ణయుగం వస్తుందని చెప్పారు. భూ హక్కు చట్టంపేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కొనేందుకు జగన్ రెడ్డి కుట్రపన్నారన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం, కొత్త మాధవరంలో బీసీ చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన మూడు ఎకరాల భూమి వైసీపీకి చెందిన నాయకులు లాక్కోవటంతో మొత్తం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులు ఏవిధంగా అన్యాక్రాంతం అవుతున్నాయో చెప్పటానికి ఇది ఒక ఉదాహరణ అని అన్నారు. జగన్ రెడ్డి తెచ్చిన కొత్త చట్టం భూకబ్జాదారులకు వరంగా మారిందన్నారు.

పర్చూరుకు చెందిన వైసీపీ నాయకుడు ఆకుల మధుబాబు ఆధ్వర్యంలో పలు కుంటుంబాలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీ సీనియర్ నాయకుడు ఇమిడిశెట్టి పెద్దబ్బాయి, శీలం శ్రీనివాసరావు, ఇందిరా కాలనీ, అంబేద్కర్ కాలనీకి చెందినవారు ఉన్నారు.



టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

కారంచేడు మండలం కుంకలమర్రుకు చెందిన వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పందరబోయిన ప్రసాద్, నక్కల వాసు, బండారు కిరణ్, బత్తుల అఖిల్, మురిపిడి గోపి, చల్లా రాఘవరావు, పులగం రామ సుబ్బారావు మణికంఠ, కమ్మిల సురేష్, షేక్ మస్తాన్‌వలి, పులి జగదీష్, మురిపి వెంకటేష్, ఉప్పు బసవయ్య, బోయిన బుజ్జి, కొమ్మనబోయిన సాయి, నర్రా గోపీనాథ్, గంజి అర్జులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగారు బాబు, కడియం మణికంఠ, కడియం రాంబాబు, రావల సూర్యన్నారాయణ, ఏమవరపు నాగశంకర్రావు, కరిచేటి రాజేష్, గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబం ఆత్మహత్య బాధాకరం

చీరాల, మార్చి 24: సీఎం జగన్‌రెడ్డి పాలనలో బడుగుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయి. తాజాగా కడపలో చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకోవటం అందుకు నిదర్శనమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు, ఆయన భార్య పద్మావతి, కుమార్తె వినయ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారికి శ్రద్ధాంజలి ఘటించారు.

రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకిటౌన్, మార్చి 24: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినికి ఆదివారం రక్తదానం చేశారు. వెంపరాలకు చెందిన విద్యార్థిని రక్తహీనతతో బాధపడుతుండడంతో డాక్టర్ రక్తం అవసర మని చెప్పారు. దీంతో మాధవస్వామి గుడి అర్చకులు భాగవతుల వెంకటాచా ర్యులు కుమారుడు సూర్యమాల కొండమాచార్యులు రక్తదానం చేశారు. కార్యక్ర మంలో రోటరీ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, సందిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఏలూరి

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 24: యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో ఇటీవల విగ్రహ ప్రతిష్ఠ జరిగిన ఆంజనేయస్వామిని ఆది వారం సాయంత్రం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కనపర్తి నాగేశ్వరరావు, నల్లపనేని రంగయ్య చౌదరి, గుదే తారక రామారావు, రావిపాటి సీతయ్య, తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు అత్తులూరి మృతి

అద్దంకి, మార్చి 24: అద్దంకి మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు అత్తులూరి హనుమం తరావు(55) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం ఉద యం గుంటూరు వైద్యశాలలో మృతి చెందాడు. హనుమంత రావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పలువురు ఆర్యవైశ్యులు హనుమంతరావు మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బైకిస్టుకు పాము కాటు

బల్లికురవ, మార్చి 24: మండలంలోని సోమవరప్పాడుకు చెందిన కొండవర్ధు పిచ్చయ్య పాముకాటుకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. ఆదివారం సోమవరప్పాడు గ్రామం నుంచి ఆయన బైకుపై మల్లాయపాలెంకు వస్తున్నాడు. మార్గమధ్యంలోకి వచ్చేసరికి అప్పటికే బైక ఇంజన్‌పైన ఉన్న పాము బయటకు వచ్చి పిచ్చయ్య కాలిపై కాటువేసి రోడ్డు పక్కన ఉన్న గుట్టలలోకి వెళ్లింది. వెంటనే మల్లాయపాలెంలో బంధువుల సహకారంతో వైద్యశాలకు తరలివెళ్లారు.

మహిళపై దాడి

బల్లికురవ, మార్చి 24: మండలంలోని కొప్పెరపాలెంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ వివాహితపై అదే గ్రామానికి వల్లెపు నాగేశ్వరరావు దాడిచేయడంతో గాయపడ్డారు. తాను ఇంట్లో ఒంటరిగా ఉండటంతో నాగేశ్వరరావు అనే వ్యక్తి వచ్చి అత్యాచారయత్నానికి పాల్పడి కత్తితో దాడి చేశాడని బాధితురాలు పేర్కొంది. గాయపడిన ఆమెను బంధువులు 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈమేరకు వైద్యశాలలో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వలసల నివారణకు కృషి చేస్తా

- ఓట్లేసి ఆదరించండి
- టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- పుణెలో కనిగిరి ప్రాంత ప్రజలతో ఆత్మీయసమావేశం
- అభిమాన నేతకు అపూర్వ స్వాగతం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కనిగిరి ప్రాంత వలస వాసులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, మార్చి 24: తనను ఆదరించి గెలిపిస్తే వలసల సమస్యను పూర్తిగా నిర్మూలిస్తానని టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పుణెలో ఆదివారం కనిగిరి ప్రాంతప్రజల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా డాక్టర్ ఉగ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో ఎంతో సహజ సంపదతో పాటు అన్ని రకాలు సౌకర్యాలు కల్పించుకునే అవకాశం ఉందన్నారు. కనిగిరి ప్రాంతంలోని ప్రజలు పరాయి ప్రాం తాల్లో నివసించినంత కాలం కనిగిరి అభివృద్ధి జరగదన్నారు. మీరంతా ఐక్యంగా కలసి వచ్చి కనిగిరి ప్రాంతాభివృద్ధికి తాను చేసుకున్న సంకల్పానికి బాసటగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. తనను ఆదరించి గెలిపిస్తే వలసన నిర్మూలనతో పాటు ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తానన్నారు. వారందరికి పక్కా స్థలాలతో పాటు గృహాలు నిర్మించే ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కనిగిరిలో నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించడంతోపాటు వెలుగొండ జలాలు కనిగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు రప్పించి మీ భూ ములన్నీ సస్యశ్యామలం చేస్తానని హామీ ఇస్తున్నానని ఉగ్ర ఉద్వేగంగా మాట్లాడారు. చంద్రబాబుతోనే రాష్ట్రంతోపాటు, కనిగిరి అభివృద్ధి, పిల్లల భవిష్యత్ సాధ్యమన్నారు. తాను సంకల్పించిన ఇంటింటికీ తాగునీటి కొళాయి. సమ్మర్‌స్టోరేజి ట్యాంక్, ట్రిపుల్ ఐఐటీ, నిమ్జ్, వెలిగొండ, నడికుడి శ్రీకాళహస్తి రైల్వేలైన్ ఏర్పాటుకు చంద్రబాబు హామీ ఇచ్చారని డాక్టర్ ఉగ్ర తెలిపారు. మీరంతా ఉద్యోగాలు చేసుకోవాలంటే నిమ్జ్ చాలా అవసరమన్నారు. తాగు, సాగు నీరు పుష్కలంగా ఉంటే నిమ్జ్‌ను సాధించుకోవడం పెద్ద పనేమీ కాదన్నారు. నిమ్జ్‌తో కనిగిరి ప్రాంతానికి చెందిన ప్రతి కుటుంబానికీ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. నిమ్జ్ కనిగిరి ప్రాంతంలో ఏర్పాటుకు చంద్రబాబు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. పార్టీలు, కులాలు, మతాలు చూడవద్దని కనిగిరి ప్రాంతానికి సేవ చేసే భాగ్యాన్ని తనకు కల్పించమంటున్నానని వారిని అభ్యర్థించారు. ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో కలసి కట్టుగా తన గెలుపునకు సహకరించాలని కోరారు.

తొలుత కనిగిరి ప్రాంతానికి చెందిన ప్రజలు బాణసంచాలతో, పూలు, డీజే సౌండ్స్‌తో ఉగ్రకు అపూ ర్వ స్వాగత పలికారు. ఆయన వెంట ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు శ్యామల కాశిరెడ్డి, సీఎస్‌పురం మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, కనిగిరి ప్రాంతానికి చెందిన ముఖ్యులు పాల్గొన్నారు.

మార్టూరు ప్రభుత్వ వైద్యశాలలో హైడ్రామా!

● చికిత్స పొందుతున్న వ్యక్తిని స్టేషన్‌కు తరలించేందుకు

● బల్లికురవ పోలీసుల అత్యుత్సాహం

మార్టూరు, మార్చి 24: మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిన్నెటి నాగరాజు అనే వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు బల్లికురవ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బాధితుడు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు కావడంతో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు బల్లికురవ పోలీసులు హైడ్రామాకు తెరతీశారని సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే, మీడియా ప్రతినిధులు ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరడంతో పోలీసులు తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఈ సంఘటన ఆదివారం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది.

బల్లికురవ మండలం వేమవరం కూడలిలో శనివారం మద్యం తాగుతున్న క్రమంలో పిన్నిటి నాగరా జు, కొండవర్ధు గోపిరాజు గొడవపడ్డారు. ఈక్రమంలో పిన్నెటి నాగరాజు తలకు గాయం కావడంతో చి కిత్స నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం రాత్రి చేరారు. వైద్యులు అతని తలకు కుట్లు వేసి వైద్యం చేశారు. ఈ గొడవకు సంబంధించి ఒకరిపై మరొకరు చేసిన ఫిర్యాదులు బల్లికురవ స్టేషన్‌కు చేరాయి. ఈనేపథ్యంలో అధికార పార్టీ నాయకుల ప్రభావమో, ఇతరత్రా కారణాలో గాని బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు పోలీసులను పంపించి నాగరాజును స్టేషన్‌కు తీసుకురావాలని ఆదేశించారు.

ప్రభుత్వ వైద్యులు నాగరాజును ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే, నాగరాజుకు ఇంకా ఇబ్బందిగా ఉందని, పూర్తిగా కోలుకోలేదని కుటుంబ సభ్యులు పోలీసులను, వైద్యులను విన్న వించుకున్నారు. ఈక్రమంలో నాగరాజును స్టేషన్‌కు తీసుకెళ్లడానికి పోలీసులు ప్రయత్నాలు చేసే సమయంలో మీడియా రంగప్రవేశం చేయడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. కొన్ని పరీక్షలను చేయించుకోవాలని నాగరాజు ప్రభుత్వ ఆస్పత్రి లోనే ఉన్నారు.

ఇదిలాఉండగా కొన్నిరోజుల క్రితం బల్లికురవలో మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన వృద్ధుడిపై ఎస్ఐ చేయి చేసుకున్నాడు. ఈ సంఘటనపై డీఎస్పీ స్థాయిలో విచారణ జరుగుతున్నది. ఈసమయంలో ఈ సంఘటన చోటుచేసుకోవడంతో ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అతని చర్యలు వివాదాస్పదంగా ఉన్నాయని మండలంలో చర్చ నీయాంశమైంది.

వైసీపీ పతనం ప్రారంభం

● గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి

● సైకిలెక్కిన పలు సామాజిక వర్గాల నేతలు



టీడీపీలో చేరిన విశ్వబ్రాహ్మణులు

గిద్దలూరు టౌన్, మార్చి 24 : రాష్ట్రంలో అరాచక వైసీపీ పాలన పతనం ప్రారంభమైందని, ఇక వచ్చే రోజులన్నీ మంచి రోజులేనని టీడీపీ గిద్దలూరు నియోజకవర్గ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికీ అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కొమరోలు మండలం సూరవారిపల్లె ఎంపీటీసీ సభ్యుడు యరదేవి పాండు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మొట్టుపల్లెకు చెందిన పలువురు కార్యకర్తలు టీడీపీలో చేరడంతో వారికి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పిసాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు సూపర్‌సిక్స్ పథకాలను అమలుజేస్తుందన్నారు. వెలుగొండ ప్రాజెక్టు టీడీపీ హయాంలోనే వినియోగంలోనికి వస్తుందన్నారు. ప్రాజెక్టు ద్వారా తాగు, సాగు నీరు అందిస్తామన్నారు. తాను స్థానికుడినని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని గుర్తు చేశారు. పార్టీలో చేరిన వారిలో యరదేశి రంగయ్య, దమ్ము తిరుపాలు, యరదేశి వెంకటేశ్వర్లు, యరదేశి వెంకటరంగయ్య, డి.తిరుపాలు, యరదేశి వెంకటరంగయ్య, కొమరోలు బాబు, కొమరోలు ఆంజనేయులు, మేరుపల్లి కేశవ్, దమ్ము తిరుపాలు, దమ్ము అల్లూరయ్య, బోయిళ్లపల్లి సుబ్బయ్య, తదితరులు చేరగా టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు పంకు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ లేదని గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాజంపేట గ్రామంలో చేనేత కుటుంబం బలవన్మరణంతో మరోసారి రుజువైందన్నారు. జగన్‌రెడ్డి భూ ఆక్రమణలకు బీసీ చేనేత కుటుంబం బలవన్మరణం చెందడం బాధ కలిగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో చేనేత కుటుంబం ఆత్మహత్యకు జగన్‌రెడ్డిదే బాధ్యత అన్నారు. వైసీపీ నేతల భూకబ్జాలకు నిండు కుటుంబం బలైందన్నారు. ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు, భార్య పద్మావతి, చిన్నకుమార్తె వినయలు బలవన్మారణానికి పాల్పడడం దురదుష్టకరమన్నారు. వ్యవస్థలను చేతిలోకి తీసుకొని రికార్డులను తారుమారు చేసి వైసీపీ నేతల వేధింపులను ఆ కుటుంబం తట్టుకోలేక బాలసుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. బడుగు, బలహీనన వర్గాలంటే జగన్‌రెడ్డికి చిన్నచూపు అని విమర్శించారు. జగన్‌రెడ్డి చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల జగన్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కేసుల్లో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.



మొట్టుపల్లెకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

టీడీపీలో 25 మైనారిటీ కుటుంబాల చేరిక

కంభం పట్టణానికి చెందిన 25 ముస్లిం మైనారిటీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ తోఫా రద్దు చేసి పేద ముస్లింలను జగన్‌రెడ్డి ఇబ్బందులకు గురి చేశారన్నారు. టీడీపీ హయాంలోనే ముస్లిం మైనారిటీలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరిన వారిలో పి.హరిక్రిష్ణ, సయ్యద్ హుస్సేన్, షేక్ పండు, షేక్ అమీర్, షేక్ కలందర్, టి.దస్తగిరి, ఎ.రాకేష్, డి.నాయబ్‌రసూల్, సీహెచ్ అనీల్‌కుమార్, షేక్ అర్షద్, షేక్ మస్తాన్ చేరగా టీడీపీ నాయకులు కేతం శ్రీనివాసులు, తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

35 విశ్వబ్రాహ్మణుల కుటుంబాలు చేరిక

కంభం పట్టణానికి చెందిన 35 విశ్వబ్రాహ్మణ కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. గిద్దలూరులో పార్టీ కార్యాలయంలో ఆదివారం వీరికి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు యద్దనపూడి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శులు నల్లగట్ల వీరబ్రహ్మం, చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం, కోటగిరి వీరభాస్కరాచారి, మోడిగారి ప్రసాద్, జూపాటి వెంకటేశ్వర్లు, బి.వెంకటరమణచారి, మేడూరి భాస్కర్, మానేపల్లి నాగక్రిష్ణచారి, బోగోలు వెంకటరమణచారి, వడ్లమాని సిద్ధు తదితరులు ఉన్నారు. టీడీపీకి చేదోడుగా ఉన్నామని, రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న రాజులయ్య

పెద్ద దోర్నాల, మార్చి 24: వేగం అదుపు తప్పి మోటార్ సైకిల్ కిందపడిన ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని గంటవానిపల్లె వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పెద్దారవీడు మండలం కర్రోల గ్రామానికి చెందిన రాజులయ్యకు కుడి కాలికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం రాజులయ్య పెద్దమంతనాల అమ్మవారి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకొంది. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని వాహనంలో దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమచికిత్సలు నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు.

పోలీసుల ఆధ్వర్యంలో కవాతు



అర్ధవీడులో సీఐ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్

కంభం, మార్చి 24 : రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రలను కాపాడేందుకు అర్ధవీడు మండలంలో సీఐ రామకోటయ్య ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయుధ దళాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిం చారు. ప్రజలు వారి ఓటుహక్కును ప్రశాంతంగా సద్వినియోగం చేసుకోవాలని, శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అర్ధవీడు ఎస్సై ఎం.అనిత, పోలీసులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



మార్కాపురం వన్‌టౌన్, మార్చి 24: మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో 3వ ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పూల మాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



హాజరైన భక్తులు

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల



చౌడేశ్వరి అమ్మవారు

కొనకనమిట్ల, మార్చి 24 : మండలంలోని మునగపాడు చౌడేశ్వరి అమ్మవారి తిరుణాళ్ళ అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. అమ్మవారి దేవాలయాన్ని తిరుణాళ్ళ సందర్భంగా అత్యంత రమణీయంగా రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఎన్నికల కోడ్ ఉండటంతో తిరుణాళ్ళలో ప్రత్యేక కార్యక్రమాలకు వివిధ పార్టీల నాయకులు సుముఖత చూపక పోవడంతో భక్తులు నిరశపడ్డారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తుల కోసం ప్రత్యేక అన్నదాన కార్యక్రమాలు ఆలయ కమిటీ వారు చేశారు. సోమవారం తెల్లవారు ఝామున అమ్మవారి ఆలయం నుండి జ్యోతులతో ఊరేగింపుతో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన మాట ఏమాయే..?



మాట్లాడుతున్న సుబ్బారావు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 24: రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చి న మాట ఏమైందని, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు ప్రశ్నించా రు. మార్కాపురంలో సీఐటీయూ జిల్లా శిక్షణా తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్తు కార్మికుల హక్కులను హరిస్తుందన్నారు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం ధరలను తగ్గించడంలో విఫలమైందన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల గొంతు నొక్కే చర్యలకు పూనుకున్నదన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ, పట్టణ కార్యదర్శి రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మతల్లికి నారాయణరెడ్డి పూజలు



పూజలు చేస్తున్న కందుల నారాయణరెడ్డి

పొదిలి, మార్చి 24 : మండలంలోని కంభాలపాడు గ్రామంలో వెలసిన శ్రీ అంకాల పరమేశ్వరి దేవి ఆలయంలో మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. నియోజకవర్గ ప్రజలు ఎప్పుడు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు.

నన్ను ఆదరించండి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం టీడీపీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నన్నానని ప్రజలు తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. కంభాలపాడు అంకాలపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నా, లేకున్నా నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రజలకు, పొదిలి మండల అభివృద్ధికి ఎనలేని కృషి చేసినట్లు తెలిపారు. పార్టీలతో తారతమ్యం లేకుండా అందరికీ, ఏదోవిధంగా సాయపడినట్లు తెలిపార. ఒక్కసారి తనకు అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 2024లో విజయఢంకా మోగించనుందన్నారు. అందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు గెలుపునకు సహకరిం చాలన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎన్నికల రోజున ఓటర్లను కలిసి సైకిల్ గుర్తుపై ఓటు వేసే విధంగా చెప్పాలన్నారు. కార్యక్రమంలో కొనకనమిట్ల, పొదిలి మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో తాగునీటికి ఇబ్బంది

మార్కాపురం వన్‌టౌన్ : వైసీపీ పాలనలో పట్టణాలు, గ్రామాలలో తాగునీటి కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విమర్శించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం మిత్రపక్షమైన బీజేపీ నాయకులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో టీడీ పీ-జన సేన-బీజే పీల ఆధ్వ ర్యంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడనుందన్నారు. మిత్రపక్షాల విజయం ఖాయమన్నారు. అన్ని రకాల ధరలు పెంచి సాగునీరు కూడా అందించలేని అసమర్థ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమం లో బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, మద్దెల లక్ష్మీ, టీడీపీ నాయకులు టి.సత్యనారాయణ, షేక్ మౌలాలి, ఇబ్రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన సుందరయ్య కాలనీవాసులు

టీడీపీలో 50 కుటుంబాలు చేరిక

మార్కాపురం రూరల్ : పట్టణంలోని సుందరయ్య కాలనీలో 50 వైసీపీ కుటుంబాలు టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో ఆదివారం రాత్రి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. కందుల నారాయణరెడ్డితోనే మార్కాపురం ప్రత్యేక జిల్లా సాధ్యమన్నారు. అందుకే టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సుందరయ్య కాలనీ తనకి సొంత ఊరు లాంటిదన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు..ఆంధ్రా అభివృద్ధికి మలుపు



సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, మార్చి 24:రాష్ట్రంలో టీడీపీ గెలుపే అభివృద్ధికి మలుపు అని వై.పాలెం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆదివారం హైదారాబాద్‌లోని కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఐటీ ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి లేక ఐటి కంపెనీలు లేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వలస వెళ్లవలసి వస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోనే ఉపాధి కల్పించి యువతకు మంచి అవకాశాలు కల్పిస్తామన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రాన్ని రాజధాని లేని అనాథగా చేశారన్నారు. విశాఖను రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌కు రాజధాని చేసిందని ఏద్దేవా చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆంధ్రకు వచ్చి టీడీపీకి సహకరించాలని కోరారు. ఎర్రగొండపాలేనికి చెందిన సూమారు 2500 మంది ఉద్యోగులు ఆయనకు మద్దతుగా సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జీవీరెడ్డి, జనసేన అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, జనసేన నియోజకవర్గ ఇంచార్జీ గౌతంరాజ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు

పెద్ద దోర్నాల, మార్చి 24: మండలంలోని మోట్ల మల్లికార్జునపురంలోని మోడల్‌స్కూల్‌లో ఇంటర్మీడియట్‌లో మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎన్ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి, ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ప్రవేశం కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 28లోపు అందేలా చూడాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెద్ద దోర్నాల, మార్చి 24: స్థానిక ఎంఈవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. మండల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అసంపూర్తిగా జలజీవన్ మిషన్ పనులు

నిరుపయోగంగా మారుతున్న పైపులైన్లు



దరిమడుగులో నిరుపయోగంగా ఉన్న పైపులైన్, కొళాయి, అరకొరగానే నీరిస్తున్న ట్యాంకు

మార్కాపురం రూరల్, మార్చి 24: గ్రామాలలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మండలంలోని దరిమడుగు, బోడపాడు గ్రామాలలో పైపులైన్ల నిర్మాణం జరిగినా నిరుపయోగంగా తయారయ్యాయి. దరిమడుగు గ్రామానికి రూ.19.38 లక్షలతో జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరయ్యాయి. ఈ గ్రామంలో ఎస్సీ కాలనీలో పైపులైన్లు నిరుపయోగంగా తయారయ్యాయి. నీటి కోసం ఆ ప్రాంత ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. మార్కాపురం మండలంలో జలజీవన్ మిషన్ పథకం కింద 22 గ్రామ పంచాయతీలకు రూ.415.90లక్షల నిధులు మంజూరయ్యాయి. బోడుపాడు గ్రామానికి రూ.27.43లక్షల మంజూరయ్యాయి. పనులు పూర్తికాకపోవడంతో పైపులైన్లు నిరుపయోగంగా మారాయి. ప్రతిరోజు జలజీవన్ మిషన్ ద్వారా పైపుల ద్వారా కుళాయిలకు నీటి సరఫరా చేస్తారనుకుంటే పంచాయతీ పాలకులు చేయడం లేదని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఇదే గ్రామంలో కొన్ని ప్రాంతాలలో నీటి సరఫరా లేని పైపులు, కుళాయి కనెక్షన్లు అవసరం లేదని కొందరు తీసివేసుకున్నారు. బోడపాడు గ్రామంలో కూడా కొన్ని వీధులలో పైప్‌లైను నిరుపయోగంగా తయారయ్యాయని కుళాయిలను పీకేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇంటింటికి నీటి సరఫరా చేయాలన్న ఉద్దేశం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నీరుగారి పోతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. బోడపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ కింద ఒక్క కొత్త బోర్లు కూడా వేయకుండా పాత బోర్ల ద్వారానే గతంలో ఉన్న పైపులైన్ల కనెక్షన్లు తొలగించి జలజీవన్ మిషన్‌లో వేసిన పైపులైన్లకు కనెక్షన్లను ఇచ్చారు. దీంతో పాత పైపులైన్ కనెక్షన్లు ఉన్న కుళాయిలకు నీరు రాకపోగా, నూతనంగా వేసిన పైపులు కూడా నీరు రావడం లేదు. ఇటీవల గ్రామానికి వచ్చిన అధికార పార్టీ నాయకుల దృష్టికి స్థానికులు ఈ విషయాన్ని తెలియజేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. వేసవి ప్రారంభం కావడంతో ఆ గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. అధికారులు తగిన చర్యలు చేపట్టి జల జీవన్ మిషన్ ద్వారా వేసిన పైపులైన్లకు నీటి సరఫరా అందించాలని కోరుతున్నారు.

అవీ..ఇవీ..

రేపటి నుంచి ఎడ్లబలప్రదర్శన పోటీలు

గిద్దలూరు, మార్చి 24 : మండలంలోని నరవ గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 26, 27 తేదీలలో రాష్ట్రస్థాయిలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు ఒక ప్రకటనలో తెలిపారు. 26న మంగళవారం సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.లక్ష, 2వ విజేతకు రూ.70వేలు, 3వ బహుమతి రూ.50వేలు, 4వ బహుమతి రూ.30వేలు, 5, 6,7 స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరసగా, రూ.20వేలు, రూ.10వేలు, రూ.7వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 27న బుధవారం ఉదయం ఆరు పండ్ల విభాగంలో బండలాగుడు పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన మొదటి ఏడు జతల ఎడ్ల యజమానులకు వరసగా, రూ.35వేలు, రూ.25వేలు, రూ.18వేలు, రూ.12వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనేవారు 9866432566 నెంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

గిద్దలూరు, మార్చి 24 : పట్టణంలోని కళాశాల వీధిలోని శ్రీసత్యసాయి బస్ షెల్టర్‌లో చలివేంద్రాన్ని సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు ఏర్పాటు చేశారు. మహిళ సేవాదళ్ సమ న్వయకర్త ఎ.శశికళ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి పూర్తయ్యే వరకు కూలింగ్ మినరల్‌వాటర్ అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, సేవాదళ్ కన్వీనర్ శింగిరి ప్రసాదరావు, యూత్ కన్వీనర్ నరేష్, అమ్మవారిశాల మాజీ అధ్యక్షులు వాడకట్టు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ



పేదలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన సరుకులు

కంభం, మార్చి 24 : పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా కంభం పట్టణంలో పేదలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేసినట్లు జమాయతే ఇస్లామి హింద్ అధ్యక్షు లు రఫీ తెలిపారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ అందరి జీవితాలలో వెలుగులు నింపడానికి దైవం పేరు మీద ప్రతి సంవత్సరం నిత్యవసర సరుకులు అందచేస్తామన్నారు. ఆదివారం రోజు 110 మంది పేదలకు వెయ్యి రూపాయల విలువైన నిత్యవసర సరుకులు, కొంత నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షులు గౌస్‌ఖాన్, ముస్తియాసిన్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు ఉత్తమసేవ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవికుమార్

పొదిలి, మార్చి 24 : పొదిలి టీబీ యూనిట్ పరిధిలో ల్యాబ్ టెక్నిషియన్‌గా పనిచేస్తున్న రావినూతల రవి కుమార్‌కు ఉత్తమసేవ అవార్డు లభించింది. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో డాక్టర్ జాన్‌రిచాడ్ చేతులమీదుగా ఈ అవార్డును ప్రధానం చేశారు. అవార్డు అందుకున్న రవికుమార్‌ను సిబ్బంది అభినందించారు.

క్షయ వ్యాధిని నయం చేయవచ్చు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి



ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

మార్కాపురం వన్ టౌన్, మార్చి 24: ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న మందులతో క్షయవ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. కె.పద్మావతి అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్ కుమార్, వెంకటేశ్వర్లునాయక్, ఐ.హర్షవర్ధన్ రెడ్డి, టీబీ యూనిట్ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

పెద్ద దోర్నాల : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటరులో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆరోగ్య సామాజిక కేంద్రం సూపరింటెండెంట్ నాగమహేశ్వరీ మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి అని, గాలి ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. మద్యం, గుట్కా, బీడీ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. పది రోజులకు మించి గళ్లతో కూడిన దగ్గు వస్తుంటే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలన్నారు. ప్రభుత్వం పరీక్షలు చేసి ఉచితంగా మందులు, న్యూట్రిషన్, నగదు రూ.500లు అందజేస్తుందన్నారు. క్షయ వ్యాధిని కచ్చితంగా ఆరు నెలల్లో తగ్గుతుందన్నారు. అనంతరం రోగులకు మందులు, న్యూట్రిషియన్ అందజేశారు. కార్యక్రమంలో టీబీ మండల కో-ఆర్డినేటర్ వెంకటరమణ, వైద్యాధికారులు వైద్యసంజీవ్, లావణ్య, సంధ్య, ఆరోగ్య మిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న చిన్నారులు

మార్కాపురం వన్ టౌన్, మార్చి 24: ఈస్టర్ ముందుగా వచ్చే మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చ్ వద్ద సండే స్కూల్ చిన్నారులు మట్టలు పట్టుకుని పాటలు పాడుతూ వీధులలో తిరిగారు. నజరేయుడైన ఏసుక్రీస్తుకు జయహో అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్స్, చర్చి పెద్దలు పాల్గొన్నారు. స్థానిక ఆర్సీఎం చర్చిలో చర్చి ఫాదర్ జాన్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు.



మట్టలతో ప్రదర్శిస్తున్న విద్యార్థులు

త్రిపురాంతకం, మార్చి 24: మట్టల ఆదివారం పండుగను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీ తెలుగు బాప్టిస్టు చర్చి, ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చి(ఏఈఎల్‌సీ), రాజుపాలెంలోని బాప్టిస్టు చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం సందర్భంగా చిన్నారులు అన్ని ప్రధాన వీధుల వెంట పూలతో అలంకరించిన ఈత మట్టలను పట్టుకొని ర్యాలీ నిర్వహిస్తూ ఏసుక్రీస్తు బోధనలను చదివి వినిపించారు. కార్యక్రమంలో పాస్టర్లు రత్నరాజు, నానిజాన్, క్రీస్తు సంఘం చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

గంగమ్మకు మొక్కులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తాళ్లూరు, మార్చి 24 : తూర్పుగంగ వరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కాపాడాలని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో భక్తులతో సందడి గా మారింది. పలువురు వాహన పూజలు చే యించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి విరాళాలను సమర్పించారు. బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కార్తీక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం పాల్గొన్నారు.

నిద్రపోతున్న నిఘా నేత్రం..!

- పట్టించుకోని అధికారులు
- ఎన్నికల వేళైనా వినియోగంలోకి తేవాలి
- ప్రజల విజ్ఞప్తి


గడియారస్తంభం సెంటర్‌లో ఏళ్ల తరబడి పని చేయని సీసీ కెమెరాలు

దర్శి, మార్చి 24 : శాంతి భద్రతల పరిరక్షణకు కీలక సమాచారం కనిపెట్టేందుకు ఉపయోగపడే నిఘా నేత్రాలు ఏళ్ల తరబడి మూలనపడ్డాయి. అధికారులు సీసీ కెమేరాలను వినియోగం గూర్చి పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మిగిలాయి. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అప్పటి రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు దర్శి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో రక్షణ శాఖ అధికారులు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా, కొత్త వ్యక్తులను కనిపెట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు పనిచేసినంత కాలం ప్రధాన సెంటర్లల్లో గొడవలు జరిగినా కొత్త వ్యక్తులు సంచరించినా, షాపుల్లో దొంగతనాలకు పాల్పడిన కేసులను సీసీ కెమెరాల సాయంతో తేలిగ్గా పట్టుకోగలిగారు. అదేవిధంగా ఒక చిన్నారిని మహిళ ఆటోలో ఎక్కించుకొని ఉడాయించగా సీసీ ఫుటేజీ ఆధారంగా ఆ మహిళను వెంబడించి రెండు గంటల్లోనే పట్టుకున్నారు. ఈ విధంగా నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడ్డాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీసీల నిర్వహణను పట్టించుకోలేదు. అవి మరమ్మతులకు గురికావడంతో బాగుచేయించక అలాగే నిరుపయోగంగా మారాయి. త్వరలో ఎన్నికలు జరుగనుండడంతో సీసీ కెమెరాలను వినియోగంలోకి తెస్తే ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, అల్లర్లకు పాల్పడిన వారిని గుర్తించేందుకు ఉపకరిస్తాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా పని చేయని సీసీ కెమెరాలను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.


ముస్తాబైన దుర్గమ్మ గుడి

నేడు దొనకొండలో కనకదుర్గమ్మ తిరునాళ్ల

దొనకొండ, మార్చి 24 : మండల కేంద్రమైన దొనకొండలోని కనకదుర్గమ్మ దేవాలయంలో తిరునాళ్ల సోమవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ధర్మకర్త ధనవేలు తెలిపారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కనక దుర్గమ్మ అమ్మవారిగా ప్రజల్లో గొప్ప నమ్మకంతో దేవాలయం దిన దినాభివృద్ధి చెందుతుంది. ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, అర్చన హారతి కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 9 గంటల నుంచి సామూహిక కుంకుమ పూజలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నదాన కార్యక్రమం, ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రసాద వినియోగము తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అర్చకులు నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు, దీవెనలు పొందాలని ధర్మకర్త కోరారు. వేడుకలు సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కల్గకుండా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. దేవాలయంను సర్వాంగసుందరంగా ప్రత్యేక అలంకరణలతో ముస్తాబు చేస్తున్నారు.

ఘనంగా ముగిసిన గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పామూరు, (సీఎస్‌పురం) మార్చి 24 : సీఎస్‌పురం లోని డీజీపేట రోడ్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ గంగమ్మతల్లి ఆలయంలో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి అమ్మవారికి వేద మంత్రాలతో ప్రత్యేక హోమాలు, పూజలు, గ్రామోత్సవం, బొల్లిఆవుల ఊరేగింపు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రైల్వే ఏఎస్‌ఐకి సన్మానం


క్రాంతికుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

దొనకొండ, మార్చి 24 : రైల్వే రక్షక దళం కార్యాలయంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న క్రాంతికుమార్ రైల్వే స్టేషన్, రైళ్లల్లో రైలు ప్రయాణికులకు అందిస్తున్న సేవలు, సహా య సహకారాలు అభినందనీయమని పలువురు కొనియాడారు. దొనకొండ రైల్వే రక్షక దళం కార్యాలయంలో రెండేళ్లుగా ఏఎస్సైగా పని చేస్తూ ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొంది రామగుండం రైల్వేస్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న క్రాంతికుమార్‌ను స్థానిక ఆర్పీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన వీడ్కోలు సభలో పలువురు మాట్లాడుతూ దొనకొండలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైల్వే ఆస్తులను కాపాడేందుకు, రైళ్లల్లో దొంగతనాలను అరికట్టడంలో తనవంతు బాధ్యతగా వ్యవహరించి అనేకసార్లు పెద్ద మొత్తంలో సొత్తును కాపాడిన కాంత్రికుమార్ ఉన్నతాధికారుల మన్ననలు అందుకున్నారని గుర్తు చేశారు. పలువురు రైల్వే ఉద్యోగులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు, వ్యాపారులు క్రాంతికుమార్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రైల్వే రక్షకదళం సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలకు జగన్ స్టిక్కర్లు

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన .. సీజ్ చేస్తామన్న డీటీసీ

ఒంగోలు క్రైం, మార్చి 24: ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనదారులు ఎలాంటి అనుమతులు లేకుండా రాజకీయ నాయకుల ఫొటోలను అంటించకూడదు. యథేచ్ఛగా ప్రైవేటు వాహనదారులు సైతం జగన్‌రెడ్డి స్టిక్కర్లు వేసి చక్కర్లు కొడుతున్నారు. దీంతో రవాణా శాఖ ఇప్పటికే తనిఖీలు చేపట్టి వాహనాలను సీజ్ చేయడం ప్రారంభించినా అనేక వాహనాలపై జగన్ స్టిక్కర్లు ఇంకా కన్పిస్తున్నాయి. ఆటోలు, కార్లు, బైక్‌లు రాజకీయ నాయకుల స్టిక్కర్లతో జోరుగా తిరుగుతున్నాయి. వాహనదారులు ఏదైనా రాజకీయ పార్టీల కోసం తిరిగేందుకు జెండా కట్టాలన్నా, వాహనాలపై రాజకీయ నాయకుల స్టిక్కర్ల వేసుకోవాలన్నా అనుమతి తప్పనిసరి. ఈ ఆదేశాలను వైసీపీ శ్రేణులు పట్టించుకోవడం లేదు. అసలు మా వాహనాలను అడ్డుకునేదెవరన్నట్లు తిరుగుతున్నారు. ఈ విషయంపై రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ వాహనదారులు కోడ్ ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.


కళ్లకు గంతలు కట్టుకొని నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నేతలు

బీసీలను బలి తీసుకుంటున్న జగన్‌కు బుద్ధి చెప్తాం

- సంఘ నాయకుడు మాలకొండలరావు

కనిగిరి, మార్చి 24: బీసీల ప్రాణాలను బలిగొంటున్న జగన్ రెడ్డికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని బీసీ సంఘాల నాయకులు పల్లా మాలకొండలరావు అన్నారు. కడప ప్రాంతంలో వైసీపీ నాయకుల భూకబ్జాకు గురై ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబానికి కళ్లకు గంతలు కట్టుకుని ఆదివారం కొవ్వొత్తులు వెలిగించి వారి చిత్రపటాలకు నివాళలర్పిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో బలహీన, బడుగు వర్గాలకు చెందిన భూములు కబ్జాకు గురయ్యాయన్నారు. ఏ అండలేని బీసీ కుటుంబాలు తమ భూములను కబ్జా చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకున్న దాఖలాలే లేవన్నారు. దీంతో చేసేది లేక బీసీ వర్గాలకు చెందిన కుటుంబాలు బలవణ్మరణాలకు పాల్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా కడప ప్రాంతంలోని రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన మరో చేనేత కుటుంబం బలవణ్మరణానికి పాల్పడడం బాధాకరమన్నారు. ఇది ముమ్మాటికి వైసీపీ హత్యే అన్నారు. దీనికి జగన్‌రెడ్డి సమాధానం చెప్పి తీరాలన్నారు. సామాజిక న్యాయం అంటూనే బడుగుల కుటుంబాలను పొట్టన పెట్టుకుంటున్నారన్నారు. జగన్‌రెడ్డి సొంత జిల్లాలోనే పేదల భూముల లాగేసుకున్నారంటే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో భూములు ఏస్థాయిలో కబ్జా చేశారో అర్థమవుతుందన్నారు. అన్ని వ్యవస్థలనూ తమ చెప్పుచేతల్లోకి తీసుకుని ప్రభుత్వ యంత్రాంగాన్ని కనుసన్నల్లో నడిపి భూ రికార్డులను తారుమారు చేసి ఎంతోమంది పేదల భూములను వైసీపీ నేతలు మింగేస్తున్నా జగన్ రాక్షసానందం పొందుతున్నారన్నారు. గతంలో జగన్ సొంత జిల్లాలోని పద్మశాలీ నేతను అత్యంత దారుణంగా చంపేశారని గుర్తు చేశారు. నేటికీ నిందితులపై చర్యలు తీసుకోలేదన్నారు. దీనినిబట్టి బీసీలపై జగన్‌రెడ్డి కక్ష తేటతెల్లమవుతుందన్నారు. టీడీపీతోనే బీసీలకు అండ, ధైర్యం అన్నారు. బీసీలంతా ఐక్యంగా రాష్ట్రం కోసం, బీసీ పిల్లల భవిష్యత్ కోసం చంద్రబాబును గెలిపించుకోవడం అనివార్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను చిత్తుగా ఓడిస్తేనే వారి ఆత్మలకు నిజమైన శాంతి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులు రెడ్డి, బీసీ సంఘాల నాయకులు తిరుపాలు, సిద్ధాంతి బారాయిమాం, షేక్ ఫిరోజ్, బాలబాబు, నంబలు వెంకటేశ్వర్లు, సైకం మాలకొండారెడ్డి, తిరుపతయ్య, చిలకపాటి లక్ష్మయ్య, షేక్ నజిముద్దీన్, పాలూరి సత్యం, జానీ, వెంకటేశ్వర్లు, పెన్నా వెంకటేశ్వర్లు, కేవీఎస్‌గౌడ్, నాగూర్, మారుతి, మోజెస్, విజయ్, రిజ్వాన్, ఫారూక్, మణికంఠ, తెలుగుమహిళలు స్వప్న, సుధారాణి, అమ్ములు పాల్గొన్నారు.

వలసల నివారణకు కృషి చేస్తా

- ఓట్లేసి ఆదరించండి
- టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- పుణెలో కనిగిరి ప్రాంత ప్రజల ఆత్మీయసమావేశం
- అభిమాననేతకు అపూర్వ స్వాగతం


ఆత్మీయ సమావేశంలో కనిగిరి ప్రాంతవాసులతో (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, మార్చి 24: తనను ఆదరించి గెలిపిస్తే వలసల సమస్యను పూర్తిగా నిర్మూలిస్తానని టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పుణెలో ఆదివారం కనిగిరి ప్రాంతప్రజల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా డాక్టర్ ఉగ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో ఎంతో సహజ సంపదతో పాటు అన్ని రకాలు సౌకర్యాలు కల్పించుకునే అవకాశం ఉందన్నారు. కనిగిరి ప్రాంతంలోని ప్రజలు పరాయి ప్రాంతాల్లో నివసించినంత కాలం కనిగిరి అభివృద్ధి జరగదన్నారు. మీరంతా ఐక్యంగా కలసి వచ్చి కనిగిరి ప్రాంతాభివృద్ధికి తాను చేసుకున్న సంకల్పానికి బాసటగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. తనను ఆదరించి గెలిపిస్తే వలసన నిర్మూలనతో పాటు ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తానన్నారు. వారందరికి పక్కా స్థలాలతో పాటు గృహాలు నిర్మించే ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కనిగిరిలో నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించడంతోపాటు వెలుగొండ జలాలు కనిగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు రప్పించి మీ భూములన్నీ సస్యశ్యామలం చేస్తానని హామీ ఇస్తున్నానని ఉగ్ర ఉద్వేగంగా మాట్లాడారు. చంద్రబాబుతోనే రాష్ట్రంతోపాటు, కనిగిరి అభివృద్ధి, పిల్లల భవిష్యత్ సాధ్యమన్నారు. తాను సంకల్పించిన ఇంటింటికీ తాగునీటి కొళాయి. సమ్మర్‌స్టోరేజి ట్యాంక్, ట్రిపుల్ ఐఐటీ, నిమ్జ్, వెలిగొండ, నడికుడి శ్రీకాళహస్తి రైల్వేలైన్ ఏర్పాటుకు చంద్రబాబు హామీ ఇచ్చారని డాక్టర్ ఉగ్ర తెలిపారు. మీరంతా ఉద్యోగాలు చేసుకోవాలంటే నిమ్జ్ చాలా అవసరమన్నారు. తాగు, సాగు నీరు పుష్కలంగా ఉంటే నిమ్జ్‌ను సాధించుకోవడం పెద్ద పనేమీ కాదన్నారు. నిమ్జ్‌తో కనిగిరి ప్రాంతానికి చెందిన ప్రతి కుటుంబానికీ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. నిమ్జ్ కనిగిరి ప్రాంతంలో ఏర్పాటుకు చంద్రబాబు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. పార్టీలు, కులాలు, మతాలు చూడవద్దని కనిగిరి ప్రాంతానికి సేవ చేసే భాగ్యాన్ని తనకు కల్పించమంటున్నానని వారిని అభ్యర్థించారు. ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో కలసి కట్టుగా తన గెలుపునకు సహకరించాలని కోరారు. తొలుత కనిగిరి ప్రాంతానికి చెందిన ప్రజ లు బాణసంచాలతో, పూలు, డీజే సౌండ్స్‌తో ఉగ్రకు అపూర్వ స్వాగత పలికారు. ఆయన వెంట ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు శ్యామల కాశిరెడ్డి, సీఎస్‌పురం మండలపార్టీ అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, కనిగిరి ప్రాంతానికి చెం దిన ముఖ్యులు పాల్గొన్నారు.

తాగునీరు, నిమ్జ్ ఉగ్రతోనే సాధ్యం


తక్కెళ్లపాడులో మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల, 17వ వార్డులో శ్రేణుల ఇంటింటి ప్రచారం, టీడీపీలో చేరిన హెచ్‌ఎంపాడు సర్పంచ్ తిరుపతయ్యను ఆహ్వానిస్తున్న నేతలు

- సైకిల్‌కు ఓటెయ్యాలని విజ్ఞప్తి
- కనిగిరి, హెచ్‌ఎంపాడు మండలాల్లో ఇంటింటి ప్రచారం

కనిగిరి, మార్చి 24: కనిగిరి ప్రాంతంలోని ప్రతి గడపకు తాగునీరు, నిమ్జ్ ఏర్పాటు కావాలంటే టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితోనే సాధ్యమౌతుందని టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై, డాక్టర్ ఉగ్ర 5 ప్రణాళికల హామీలపై ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గడచిన ఐదేళ్లలో వైసీపీ పాలకులు అభివృద్ధిని విస్మరించారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబును, కనిగిరిలో డాక్టర్ ఉగ్రను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కనిగిరిలో ఐదేళ్లలో భూ ఆక్రమణలు, కబ్జాలే తప్ప అభివృద్ధి జరిగిందే లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రతి మహిళలకు ఏడాదికి రూ.15వేలు, ప్రతి ఇంటిలో చదువుకునే ప్రతి ఒక్కరికీ రూ.15వేలు ఏడాదికి అందచేస్తాకరన్నారు. జగన్ పాలనలో బటన్ నొక్కి పథకాలు చూపిస్తూ ప్రజల కళ్లుగప్పి ధరలు పెంచి నడ్డివిరిచారన్నారు. పన్నులు కూడా ఎడాపెంచి పేద, మధ్య తరగతి వర్గాలపై ఆ ర్థిక భారాలు మోపారన్నారు. పెంపుచేసి రాష్ట్రప్రజల్ని దోచుకున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్‌లు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కనిగిరి పట్టణంలో

టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని 17వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో డాక్టర్ ఉగ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. డాక్టర్ ఉగ్రతోనే కనిగిరికి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుతోనే పన్నుల ధరల నియంత్రణ, విద్యుత్ బిల్లుల ధరల నియంత్రణలోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి) పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, బుల్లా బాలబాబు, గుడిపాటి ఖాదర్, ఏనుగు శ్రీనివాసులురెడ్డి, కాసులు శ్రీరాంయాదవ్, తెలుగు మహిళలు కరణం అరుణ, షేక్ వాజిదాబేగం, స్వప్న, తులసి, నారాయణమ్మ, అమ్ములమ్మ, ధనలక్ష్మీ, టీడీపీ నాయకులు కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడులో

మండలంలోని వేములపాడు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే ఎమ్మెల్యేగా ప్రజా సేవకుడైన డాక్టర్ ఉగ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వేములపాడు గ్రామ సర్పంచ్ జట్టుబోయిన తిరుపతయ్య వైసీపీని వీడి సొంత పార్టీ టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి మురహరి నరసయ్య, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, బ్రహ్మంగౌడ్, కోటపాటి శేషయ్య, తాతపూడి బుజ్జి (స్టాలిన్), దేవిరెడ్డి రాజారామిరెడ్డి, ఎర్రయ్య శ్రీరాములురెడ్డి, శివకుమారి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం..!

- స్కూల్‌కు అని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాని వైనం
- పీఎస్‌లో ఫిర్యాదు, దర్యాప్తు చేస్తున్న పోలీసులు



కనిగిరి, మార్చి 24 : పదిహేనేళ్ల బాలుడు అదృశ్యమైన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన ఉప్పు పెదవెంగయ్య కుమారుడు ఉప్పు వెంగళరాయుడు మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. రోజులాగే స్కూ ల్‌కు వెళ్తున్నానని చెప్పి శనివారం ఇంటి నుంచి వె ళ్లాడు. అయితే పదవ తరగతి పరీక్షలు జరుగుతుండడంతో మధ్యాహ్నం నుంచి ఒంటిపూట బడులు సాగుతున్నాయి. బాలుడు తండ్రి ప్రతిరోజూ ఉదయాన్నే గొర్రెలు మేపుకునేందుకు వెళ్తుంటాడు. ఆ క్రమంలోనే శనివారం బాలుడు వెంగళరాయుడు తన తండ్రికి క్యారియర్ సిద్ధం చేసి ఇచ్చాడు. బాలుడి తల్లి కడప ప్రాంతంలోని అక్కమ్మ దేవాలయం సందర్శనకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బాలుడు స్కూల్‌కు అని చెప్పి శనివారం ఇంటి నుంచి వెళ్లాడు. బాలుడు తండ్రి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి కుమారుడు లేడు. పుస్తకాల బ్యాగు ఇంట్లోనే ఉంది. దీంతో పలుచోట్ల వెతికారు. స్కూల్ టీచర్లను విచారించగా బాలుడు వెంగళరావు స్కూలుకు రాలేదని చెప్పారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో తండ్రి వెంగయ్య ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ త్యాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా బాలుడు వెంగళరావు స్నేహితుడు కనిగిరి ప్రభుత్వ హైస్కూల్‌లోని 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం కనిగిరి ఆర్టీసీ డిపో వద్ద కనిపడినట్లు పోలీసులకు తెలిసింది. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త మాటున చోరీలు

బెంబేలెత్తుతున్న ప్రజలు


దొంగలు కంప్రెషర్‌ను ఎత్తుకెళ్తున్నట్లు ఉన్న సీసీ ఫుటేజీలో

పామూరు, మార్చి 24 గుర్తు తెలియని కందరు కొత్త తరహా చోరీలకు పాల్పడుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సాధారణంగా దొంగలు బయట ఉండే వస్తువులను ఎత్తుకెళ్తుంటారు. ఇటీవల పట్టణంలోని సీఎస్‌పురంరోడ్‌లో మారుతీ జనరల్ స్టోర్‌కు చెందిన బొంతల సత్యం ఇంటి బయట ఉన్న ఏసీ మెషీన్‌కు చెందిన కంప్రెషర్‌ను రెండురోజుల కిందట చెత్తను ఏరుకునేందుకు వచ్చిన ఇద్దరు (ఆడ, మగ) వ్యక్తులు గేటు వద్దకు వచ్చి కంప్రెషర్ మిషన్‌ను భుజంపై ఎత్తుకెళ్లి సంఘటన జరిగింది. ఈ చోరీ అంతా సీసీ కెమెరాలో రికార్డు అయింది. దాంతో ఏసీలు ఉన్నవాళ్లు, బయట సామగ్రి ఉంచేవాళ్లు భయపడుతున్నారు. మరికొన్ని చోట్ల ఇంటిబయట ఉంచిన ద్వి చక్రవాహనాల్లో నుంచి పెట్రోల్‌ను దొంగిలిస్తున్నారు. ఉదయం లేచి బైకు తీసేవాళ్లు పెట్రోలు లేకపోవడం చూసి లబోదిబోమంటున్నారు. రాత్రి పెట్రోల్ కొట్టిస్తే తెల్లారేసరికి చోరీ చేస్తున్నారని పలువురు బాధితులు అంటున్నారు. పోలీసులు రాత్రి వేళ గస్తీని ముమ్మరం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మండల కన్వీనర్‌తో సహా పలువురు గైర్హాజరు

ముండ్లమూరు, మార్చి 24 : ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి మండలంలోని ఉమా మహేశ్వర అగ్రహారం గ్రామంలో నిర్వహించిన సమావేశానికి వైసీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు గోపనబోయిన పిలిప్, పలు గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులెవరూ హాజరు కాలేదు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ వర్గానికి చెందిన నాయకులు సైతం ఎక్కువ మంది హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది.

పాఠశాలల విలీన ప్రక్రియ సరైంది కాదు

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి




మాట్లాడుతూ రాష్ట్ర ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

కనిగిరి, మార్చి 24: జాతీయ నూతన విద్యా విధానం అమలులో భాగంగా పాఠశాలల విలీన ప్రక్రియ విధానం సరైనది కాదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. కనిగిరిలో ఎస్టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యా వ్యవస్థకు నష్టం కల్గించే విలీన ప్రక్రియపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ఎస్టీయూ ప్రధాన భూమిక పోషించిందన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం ఆవిర్భవించిందే ఎస్టీయూ అన్నారు. ఎన్నో చారిత్రాత్మక ఉద్యమాలను ముందుండి నడిపిన సంఘమన్నారు. నేడు ఉపాధ్యాయులు పొందుతున్న సౌలభ్యాల సాధనలో ఎస్టీయూ చేసిన కృషి ఎంతో ఉందన్నారు. రీ గ్రూపింగ్ పేస్కేల్స్, ఇంక్రిమెంట్లు, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఏఎస్, ఉద్యోగోన్నతుల సాధన ఎస్టీయూ పోరాటాల ఫలితమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీరమణారెడ్డి, బీ వెంగళరెడ్డి మాట్లాడుతూ వీణా విజయరామరాజు, కత్తి నరసింహారెడ్డి లాంటి పోరాట యోధులు పని చేసిన సంఘం ఎస్టీయూ అన్నారు. గత ప్రభుత్వాలలో చర్చలు, పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలకు వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచేలా వ్యవహరించటం అన్యాయమన్నారు. సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ విశేష సేవలందించిన ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం ఎంతైనా అవసరమన్నారు. నిబద్ధతతో పని చేసే వారు ఎస్టీయూలో సభ్యులుగా చేరి సమస్యల సాధనలో పాలపంచుకోవాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ఎర్రయ్య, రాష్ట్రకార్యవర్గసభ్యులు శ్రీనివాసులు, జిల్లా ప్రధానకార్యదర్శి జీ నరసింహారెడ్డి, కనిగిరి అధ్యక్షుడు తుమ్మా వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి జీ ప్రసన్నాంజనేయులు, జిల్లాఅసోసియేట్ అధ్యక్షుడు దొడ్డా తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.





ప్రతిష్ఠాత్మకంగా 2024 ఎన్నికలు..



టి.కృష్ణప్రసాద్

2024 ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకు న్నాయి. భావపురిపై జెండా ఎగుర వేసేందుకు అటు వైసీపీ. ఇటు టీడీపీ కూటమి నేతలు సమాయత్తమవుతున్నారు. సార్వ త్రిక సమరానికి సంబంధించి టీడీపీ, వైసీపీ ఇప్పటికే అభ్యర్థులపై స్పష్టత ఇచ్చాయి. 2019లో వైసీపీ నుంచి పోటీ చేసి గెలు పొందిన నందిగం సురేష్ రెండో సారి అదృ ష్టాన్ని పరీక్షించుకోనున్నారు. టీడీపీ తర పున ఐపీఎస్‌గా ఉమ్మడి రాష్ట్రంలో సేవలం దించిన టి.కృష్ణప్రసాద్ బరిలో ఉన్నారు. ఇరు పార్టీల శ్రేణులు ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నాయి.

ఉద్దండుల ఖిల్లాగా బాపట్ల..

బాపట్ల స్థానం నుంచి లోక్‌సభకు ప్రాతినిథ్యం వహించిన వారంతా ఉద్దండులే. ఆది నుంచి ఈ స్థానం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ ప్రభ తగ్గిపోయి వైసీపీ బరిలోకి వచ్చింది. బాపట్ల లోక్‌సభ పరిధిలోని కారంచేడు సినీ నిర్మాత రామానాయుడు స్వస్థలం కావడంతో బాపట్ల నుంచి ఎంపీగా గెలుపొందిన ఆయన అభివృద్ధి విషయంలో తనదైన మార్కు చూపారు. ఎంపీ నిధులే కాకుండా సొంత ధనంతో అనేక కార్యక్రమాలను చేశారు. ఎన్టీఆర్ కుమార్తె, భారతీయ జనతా పార్టీ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షురాలైన పురందేశ్వరి ఈ జిల్లా కోడలే. దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో పాటు సతీమణి పురందేశ్వరి కూడా ఇదే స్థానం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలోనే విద్య అభ్యసించిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఇదే స్థానం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి సైతం ఇక్కడ నుంచి లోక్‌సభలోకి అడుగుపెట్టారు. కాంగ్రెస్ తరపున గెలుపొందిన పనబాకలక్ష్మి కేంద్ర మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. సలగల బెంజిమెన్, మాల్యాద్రి శ్రీరాం కూడా బాపట్ల అభివృద్ధిలో తమదైన మార్కు చూపెట్టారు. ఉపరాష్ట్రపతిగా అత్యున్నత పదవి అధిరోహించిన వెంకయ్య నాయుడు సైతం బీజేపీ నుంచి 1989లో బాపట్ల లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగి పరాజయం పాలయ్యారు.



● మాల్యాద్రి



● పనబాక లక్ష్మి



● పురందేశ్వరి



● రామానాయుడు

భావపురి.. చైతన్య దీపిక

బాపట్ల ప్రత్యేకతలు ఇవి..

ఐదో శతాబ్దం నాటి భావనారాయణస్వామి ఆలయంతో ఈ ప్రాంతానికి భావపురిగా ఘనత వహించింది. కాలాంతరాన భావపురి బాపట్లగా మారింది. చారిత్రక నేపథ్యం ఉన్న బాపట్ల.. స్వాతంత్ర్య సమరంలో ఎన్నో కీలక ఘట్టాలకు వేదికగా నిలిచింది. దాదాపు 70 కిలో మీటర్ల మేర ఉన్న తీర ప్రాంతం బాపట్ల సొంతం. కార్తీకమాసంలో సూర్యలంక సముద్ర తీరానికి లక్షల సంఖ్యలో భక్తులు స్నానానికి పోటెత్తుతారు. దక్షిణ భారతదేశంలో తొలిగా వ్యవసాయ కళాశాల బాపట్లలో 1945 జూలై 11న మొదలైంది. ఇక్కడే బీపీటీ- 5204 సాంబా మసూరి వరి వంగడాన్ని ప్రముఖ శాస్త్రవేత్త ఎంవీ రెడ్డి ఆవిష్కరించారు. బాపట్ల జీడి మామిడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తయారు చేసిన బీపీపీ-8 వంగడం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇక్కడ వ్యవసాయ విద్యనభ్యసించిన విద్యార్థులు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా వివిధ రంగాల్లో కీర్తి గడించారు. ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీకి అనుబంధంగా జీడిమామిడి పరిశోధనా కేంద్రం, నూతన వంగడాల పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు తన వంతుగా సేవలందించడంలో బాపట్ల విరాజిల్లుతోంది. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీలో భాగమై ఉన్న కళాశాలలు బాపట్లను విద్యల కాణాచిగా మార్చాయి. రాష్ట్రంలో పొడవైన సముద్ర తీరప్రాంతం కలిగిన జిల్లా. ఆక్వా రంగానికి కేంద్రంగా బాపట్ల ఉంది. ఏటా రూ.1200 కోట్ల విలువైన రొయ్యల పిల్లలు, చేపలను ఎగుమతి జరుగుతుంది. బాపట్ల లోక్‌సభ పరిధిలోని చీరాల వస్త్ర పరిశ్రమకు ప్రధాన కేంద్రం. మార్టూరు గ్రానైట్ పరిశ్రమల కేంద్రంగా గుర్తింపు ఉంది.

2024 సార్వత్రిక ఎన్నికల సమరం సమీపిస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖారారయ్యారు. ఆయా పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఈ సారి షెడ్యూల్‌కు పోలింగ్‌కు మధ్య వ్యవధి 65 రోజులు వచ్చింది. అంటే సుమారు రెండు నెలలకు పైగా ప్రచారాలు నిర్వహిం చుకునే అవకాశం అభ్యర్థులకు వచ్చింది. అయితే ప్రచార ఖర్చులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. వచ్చిన అవకాశాన్ని సద్విని యోగం చేసుకునేందుకు అభ్యర్థులు, రాజకీయ పక్షాలు ప్రణాళికలు రూపొం దించుకుంటున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాను గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజించారు. దీంతో ఈ మూడు జిల్లాల పరిధిలో మూడు లోక్‌సభ, 20 అసెంబ్లీ నియోజకవర్గాలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గాల వారీగా చరిత్రను పాఠకులకు అందించే ప్రయత్నమిది...



● ప్రసాద్‌రావు



● చిమటా సాంబు



● బెంజిమెన్



● వెంకటేశ్వరరావు



● నేదురుమల్లి



● ఉమ్మారెడ్డి



సురేష్

14,96,873 మొత్తం ఓట్లు

7,66,153 మహిళలు

7,30,642 పురుషులు

78 ఇతరులు

బాపట్ల లోక్‌సభ పూర్వపరాలు..

బాపట్ల లోక్‌సభ స్థానంగా ఏర్పడక ముందు తెనాలి లోక్‌సభ పరిధిలో ఉండేది. లోక్‌సభ స్థానాల పునర్విభజనలో భాగంగా బాపట్ల లోక్‌సభ స్థానంగా 1977లో ఆవిర్భవించింది. 2004 వరకు జనరల్ స్థానంగా ఉండగా 2009 నుంచి ఎస్సీ రిజర్వ్‌గా మార్చారు. 2009లో చేపట్టిన అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పొన్నూరు స్థానం గుంటూరు లోక్‌సభలోకి వెళ్లగా ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు బాపట్ల లోక్‌సభ పరిధిలో చేరింది. గతంలో ఈ స్థానం ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉండేది. ఉమ్మడి గుంటూరు పరిధిలోని వేమూరు, బాపట్ల, రేపల్లెతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని సంతనూతలపాడు, పర్చూరు, అద్దంకి, చీరాల ఉండేవి. బాపట్ల జిల్లాగా ఆవిర్భవించాక ఒక్క సంతనూతలపాడు మినహాయిస్తే మిగిలిన ఆరుస్థానాలు ఈ జిల్లా పరిధిలోకి వచ్చాయి. జిల్లాగా ఏర్పడ్డాక తొలిసారి బాపట్ల లోక్‌సభకు ఎన్నిక జరగబోతోంది. ప్రస్తుతం బాపట్ల జిల్లాలోని ఆరుస్థానాలతో పాటు ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు బాపట్ల లోక్‌సభ పరిధిలో ఉన్నాయి.

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
● 1977	అంకినీడు ప్రసాద్‌రావు	కాంగ్రెస్	జె. చంద్రమౌళి	బీఎల్‌డీ	42,946
● 1980	అంకినీడు ప్రసాద్‌రావు	కాంగ్రెస్	పి.సాంబయ్య	జనతా	1,51,741
● 1984	చిమటా సాంబు	టీడీపీ	ఎం. రాజేశ్వరరావు	కాంగ్రెస్	34,420
● 1989	సలగల బెంజిమెన్	కాంగ్రెస్	ఎం. వెంకయ్యనాయుడు	బీజేపీ	43,620
● 1991	దగ్గుబాటి వెంకటేశ్వరరావు	టీడీపీ	సలగల బెంజిమెన్	కాంగ్రెస్	1097
● 1996	ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు	టీడీపీ	విజయ ప్రసాద్ ఆర్య	కాంగ్రెస్	8,262
● 1998	నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి	కాంగ్రెస్	ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు	టీడీపీ	40,488
● 1999	డి. రామానాయుడు	టీడీపీ	జేడీ శీలం	కాంగ్రెస్	92,457
● 2004	దగ్గుబాటి పురంధేశ్వరి	కాంగ్రెస్	రామానాయుడు	టీడీపీ	94,082
● 2009	పనబాక లక్ష్మీ	కాంగ్రెస్	మాల్యాద్రి శ్రీరామ్	టీడీపీ	69,338
● 2014	మాల్యాద్రి శ్రీరాం	టీడీపీ	వరికూటి అమృతపాణి	వైసీపీ	32,754
● 2019	నందిగం సురేష్	వైసీపీ	మాల్యాద్రి శ్రీరాం	టీడీపీ	16,065

బాపట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చారి త్రక నేపథ్యం.. స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర.. సుందరమైన సముద్రతీరం.. విద్యలకు కాణాచి.. ఉద్యమాల గడ్డ.. ఆధ్యాత్మిక కేంద్రం.. పర్యాటక ప్రాంతం బాపట్ల సొంతం. అనేక ఉద్య మాలకు ఊపిరులూదిన గడ్డగా బాపట్ల చరిత్ర కెక్కింది. భారతీయ వాయుసేన కేంద్రం, దక్షిణ భారతదేశపు తొలి వ్యవసాయ విద్యాలయం, ఐదో శతాబ్దం నాటి భావ నారాయణ స్వామి ఆలయం, భట్టిప్రోలు స్తూపం, సూర్య లంక సముద్రతీరం, చీరాల దగ్గర ఓడరేవు బాపట్ల సొంతం. 1794లోనే బాపట్ల తాలూకా ఏర్పడింది. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న భావనకు బాపట్ల టౌన్ హాలులో 1913 మే 26, 27న నిర్వహించిన ప్రథమాంధ్ర మహాసభలలో బీజంపడింది. స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో 1919లో నిర్వహించిన చీరాల-పేరాల ఉద్యమం జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత సంతరించు కుంది. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న బాపట్ల నుంచి గెలిచి లోక్‌సభలోకి అడుగు పెట్టిన వారిలో మహామహులు ఉన్నారు. 1977లో బాపట్ల లోక్‌సభ నియోజకవర్గంగా ఆవిర్భ వించింది. ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వచ్చిన వారంతా ఖ్యాతిని ఆర్జించిన వారే. గత చరి త్ర కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నా ప్రతి పక్షాలనూ ఆదరించిన ఘనత ఈ స్థానం సొంతం. ఇప్పటి వరకు 12 సార్లు ఎన్నికలు జరగ్గా ఆరు సార్లు కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేయగా, ఐదు సార్లు టీడీపీ, ఒకసారి వైసీపీ గెలుపు తీరాలకు చేరాయి. పురుషుల కంటే 36 వేల మంది ఎక్కువగా మహిళా ఓటర్లు ఉన్నారు. దీంతో ఇక్కడ బరిలో నిలిచే అభ్యర్థుల గెలుపు ఓటముల్లో మహిళా ఓటర్లదే కీలకపాత్ర.

- మహామహుల ప్రాతినిథ్యం బాపట్ల సొంతం
- 1977లో లోక్‌సభ స్థానంగా బాపట్ల ఆవిర్భావం
- 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు
- గెలుపోటముల్లో మహిళల ఓట్లే కీలకం



జిల్లాగా ఆవిర్భావం.. మౌలిక వసతుల కొరత

2022 ఏప్రిల్ 4న జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా బాపట్ల జిల్లాగా ఆవిర్భవించింది. లోక్‌సభ స్థానాలను జిల్లాలుగా చేయాలనే ప్రభుత్వ పాలసీ ప్రకారం భావపురి జిల్లా కేంద్రమైంది. గుంటూరు జిల్లా నుంచి వేమూరు, రేపల్లె, బాపట్ల, ప్రకాశం జిల్లా నుంచి చీరాల, పర్చూరు, అద్దంకిలతో బాపట్ల నూతన జిల్లాగా ఏర్పాటైంది. జిల్లాలోని ఆరు స్థానాలు బాపట్ల లోక్‌సభ నియోజక వర్గ గొడుగు కిందకు రాగా ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు మాత్రమే బాపట్ల లోక్‌సభ స్థానం పరిధిలో ఉంది. జిల్లాగా ఏర్పడినా బాపట్లలో అనేక మౌలిక వసతులు లేవు. పాలకులు కొం చెం ఊతమిస్తే అటు పర్యాట కంగా.. ఇటు వ్యాపార, విద్య, వాణిజ్య కేంద్రంగా బాపట్ల అభి వృద్ధి చెందుతుంది. బాపట్ల –చీరాల జంట నగరాలుగా బాసిల్లే అవకాశం ఉంది.

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు	
◆ ఎస్సీ(మాల)	-1,97,000
◆ ఎస్సీ(మాదిగ)	-1,49,000
◆ రెడి	-1,20,027
◆ కమ్మ	-1,84,470
◆ కాపు	-1,36,000
◆ ముస్లిం	-80,000
◆ ఎస్టీ	-35,000
◆ యాదవ	-1,17,000
◆ చేనేతలు	-63,000
◆ మత్స్యకార	-35,000
◆ గౌడ	-64,000
◆ వైశ్య	-60,000
◆ ఇతరులు	-2 లక్షలకు పైగా

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(సోమవారం)
సహారీ (ఉదయం) 4.52 (మంగళవారం)



పనులు చేసినా.. పస్తులే!

- రెండు నెలలుగా ఎదురుచూపులు
- అందని ఉపాధి వేతన బిల్లులు
- కూలీ రూ.38.77 కోట్ల బకాయిలు
- మెటీరియల్ బిల్లుల బకాయి రూ.58.93 కోట్లు

ఉపాధి.. ఉత్తిత్తిగా మారింది. కూలీలు పనులు చేస్తున్నారు.. అయితే వారికి వారం కాదు కదా నెలకు కూడా కూలి చెల్లిం చడం లేదు. జనవరి నుంచి ఇప్పటివరకు పనులు చేసిన కూలీ లకు ఉపాధి సొమ్ములు చెల్లించలేదంటే పరిస్థితి అర్థం చేసుకో వచ్చు. వలసలు నివారించడం, వ్యవసాయ కార్మికులు, కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో లోపాలు చోటు చేసుకుంటున్నాయి. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కార్మికునికి కూలీ సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉంది. ఈ చెల్లింపుల్లో తీవ్రజాప్యం జరుగుతోంది. నెలలు గడుస్తున్నా కష్టపడి చేసిన పని కూలీ సకాలంలో రాక పోతుండటంతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చేసిన పనికి వేతనం అందక ఉపాధి వేతనదారులు రెండు నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు రూ.38.77 కోట్లు బకాయిలు ఉండటంతో కష్టాలు తప్పడంలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేదని కష్టజీవులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాస్ పుస్తకాలు చేతపట్టు కొని బ్యాంకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఖా తాలు ఖాళీగా కనిపించడంతో నిరాశకు లోనవుతున్నారు. పనులకు సంబంధించిన సామాగ్రి బిల్లుల బకాయి రూ.58.93 కోట్లు ఉన్నాయి. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది మండల కార్యాలయానికి వివరాలు పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రెండు రోజులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయాలి. ఇదంతా జరుగుతున్నా రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించట్లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. జనవరి 29నుంచి వేతనాలు అందకపోవడంతో మొత్తం రూ.38.77 కోట్ల బకాయిలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి వ్యక్తికి 100రోజుల పని దినాలను కూలీలకు కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. చేసిన పనికి కూలీ రాకపోతుండటంతో ఈ పనుల పట్ల కార్మికులు ఆసక్తి కనబరచడంలేదు. దీంతో ఉపాధి పథకం లక్ష్యాలు నెరవేరడం లేదు.



యంత్రాంగం అలసత్వం..

ప్రభుత్వం కార్మికుని సగటు వేతనం రూ.272గా నిర్ణయించింది. ఈ మేరకు ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు సగటు వేతనం లభించడంలేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా తమకు సగటు వేతనం అమలు చేయాలని కూలీలు కోరుతున్నారు. ఈ దిశగా ఉపాధి యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉంది. వ్యక్తిగత పని దినాలు కల్పించడంలో కొంత యంత్రాంగం అలసత్వంగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా జాబ్ కార్డులు నమోదు చేశారు. ఈ జిల్లాలో 5.37 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేయబడ్డాయి. అలాగే గుంటూరు జిల్లాలో 2.03 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.52 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. నమోదు చేసుకున్నవారందరూ పనులు హాజరు కావడంలేదు. పల్నాడులో 4.36 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. బాపట్లలో 3.68 లక్షలు, గుంటూరులో 1.48 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీరు మాత్రమే ఉపాధి పనులకు హాజరౌతున్నారు. పేరు నమోదు చేసుకోని పనులకు హాజరు కాని కార్మికుల సంఖ్యలో లక్షల్లో ఉండటం గమనార్హం. వీరికి కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఉపాధి పనుల్లో కార్మికుల పనిదినాలను ముందుగానే అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పని దినాలు కల్పించడంలో అధికారులు విఫమవుతున్నట్టు లెక్కలు తెలియజేస్తున్నాయి. చేసిన పనికి రెండు నెలలుగా ఒక్క రూపాయి కూడా కూలీ చెల్లించకపోవడంతో వారు తీవ్ర అందోళన చెందుతున్నారు. కోట్లల్లో కార్మికుల వేతన బకాయిలు ఉన్నాయి. చేసిన కష్టానికి వేతనం చెల్లింపులో ఆలస్యం అవుతుండటం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీ చెల్లించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

వేసవి భత్యాలు రద్దు

గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20 శాతం. మార్చిలో 25 ఏప్రిల్లో 30 శాతం అదనపు వేతనం ఇచ్చేవారు. మజ్జిగ కూడా సరఫరా చేసేవారు. తాగునీటికి రూ.5, గునపానికి రూ.10, తట్టకి రూ.13 చెల్లించేవారు. ప్రస్తుతం వీటినీ రద్దు చేశారు. దీంతో వేతనదారులపై ఆర్థికభారం పడుతోంది.

మెటీరియల్ బిల్లుల బకాయి రూ.58.93 కోట్లు

కార్మికుల వేతనాలతో పాటు చేసిన పనుల మెటీరియల్ బిల్లులు నిలిచిపోయాయని బాధితులు చెబుతున్నారు. మూడు జిల్లాల్లో రూ 58.93 కోట్ల బకాయి ఉన్నట్టు సదరు శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. గుంటూరు జిల్లాల్లో రూ.16.39 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.22.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.20.05 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెటీరియల్ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రానైట్ ఆదాయానికి గండి


- అధికార పార్టీ అండతో బరితెగించి రవాణా
- ప్రభుత్వానికి రోజుకు రూ.50 లక్షల ఎగనామం
- ఎస్కార్ట్ ముఠాలకు, అధికారులకు కాసుల పంట
- తెలంగాణ సరిహద్దులో తనిఖీలతో అక్రమాలు బహిర్గతం



అద్దంకి/బల్లికురవ/మార్టూరు, మార్చి 24: గ్రానైట్ అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఎస్కార్ట్ ముఠాలకు, అధికారులకు కాసుల పంటగా మారింది. దీంతో అక్రమ రవాణాను మరింత బరితెగించి నిర్వహిస్తున్నారు. బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లోని గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి నిత్యం వందకుపైగా లారీల గ్రానైట్ ఇతర ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుంది. ఒక్కో లారీలో సరాసరిన 4 వేల అడుగుల గ్రానైట్ స్లాబులు తరలిస్తుంటారు. ఈ ప్రకారం ఒక్కో లారీకి సరాసరి రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు మైనింగ్ సెస్, జీఎస్టీ కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అయితే, అంతమేర చెల్లించకుండా ఉండేందుకు రూ.30 వేల నుంచి రూ.35 వేలతో ఎస్కార్ట్ ముఠాలతో ఒప్పందం చేసుకుంటున్నారు. ఆయా లారీలను ఆంధ్ర సరిహద్దు దాటించే బాధ్యతను ఎస్కార్ట్ ముఠా యువకులు తీసుకున్నారు. స్థానిక సీనరేజ్ వసూలు టెండర్ దక్కించుకున్న సంస్థకు రూ.10 వేలు, మరికొంత మొత్తాన్ని సరిహద్దు నియోజక వర్గంలోని అధికార పార్టీ కీలక ప్రజాప్రతినిధికి, స్థానిక అధికారు లకు ముట్ట జెప్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన రూ.10 వేలు ఎస్కార్ట్ ముఠాలోని వారు పంచుకుంటున్నారు. ఇలా రోజుకు 60 నుంచి 70 లారీలు ఎలాంటి బిల్లులు చెల్లించకుండా రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రోజుకు సరాసరి రూ.50 లక్షలు ఎగనామం పడుతున్నట్లు తెలుస్తుంది. ఎస్కార్ట్ ముఠా సభ్యులకు అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో రవాణాను అడ్డుకునే వారే లేకుండా పోయారు. నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన ఆయా శాఖల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నరన్న విమర్శలున్నాయి. అయితే, తెలంగాణ సరిహద్దులో ఆ రాష్ట్ర అధికారులు శుక్ర, శనివారాల్లో చేపట్టిన తనిఖీలలో అక్రమ రవాణా బాగోతం మరోసారి బయటపడింది. జీఎస్టీ నుంచి పక్కదారి పట్టించేందుకు నకిలీ బిల్లులు పెడుతున్నట్లు కూడా సమాచారం. యథేచ్ఛగా గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు అడ్డుకోకపోవడం మరింత విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనిఖీలు ముమ్మరం చేసి గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చంద్రబాబు పర్యటన ఖరారు

- 31న జిల్లాలో ప్రజాగళం సభలు
- మూడు నియోజకవర్గాల్లో కార్యక్రమాలు



ఒంగోలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్ర బాబు నాయుడు జిల్లా పర్యటన ఖరారైంది. ఈనెల 31న ఆయన ఇక్కడికి వస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాగళం సభల పేరుతో ఎన్నికల ప్రచారానికి సిద్ధమైన చంద్రబాబు ఈనెల 27నుంచి పర్యటనలు ప్రారంభిస్తున్నారు. అందులో భాగంగా జిల్లాకు వస్తున్నారు. పార్టీ వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. ఈనెల 31న మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాల్లో ఆయన పర్యటిస్తారు. ఆరోజు ఉదయం నెల్లూరు జిల్లా కావలిలో జరిగే కార్యక్రమంలో పాల్గొనే చంద్రబాబు హెలికాప్టర్‌లో మధ్యాహ్నం మార్కాపురం చేరుకుంటారు. అక్కడ వివిధ వర్గాల మేధావులతో జరిగే సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి సాయంత్రం సంతనూతలపాడు నియోజకవర్గంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రసంగించి రాత్రికి ఒంగోలులో రోడ్ షో నిర్వహించనున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ సభ చీమకుర్తిలో నిర్వహించే అవకాశం ఉంది. చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై పార్టీ అధిష్ఠానం తరపున ప్రతినిధులు ఆదివారం జిల్లాకు వచ్చి మూడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో మాట్లాడినట్లు సమాచారం. అయితే ఎక్కడెక్కడ ఏయే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి, ఇతరత్రా అంశాలపై ఒకట్రెండురోజుల్లో స్పష్టత రానుంది.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డికి పూలమొక్క ఇస్తున్న కలెక్టర్

ఒంగోలులో హైకోర్టు న్యాయమూర్తి

మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయాధికారి, ఎస్పీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24 : హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒంగోలు వచ్చారు. స్థానిక పోలీసు అతిథిగృహంలో ఉన్న ఆయన్ను కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం జిల్లా కోర్టులో నిర్వహించిన జ్యుడీషియల్ సమీక్షలో జస్టిస్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.




లక్ష్మీ నర్సింహుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

పృథులగిరి.. భక్తసిరి!

- గరుడ సేవకు అశేషంగా తరలివచ్చిన ప్రజలు
- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయం

మద్రిపూడి, మార్చి 24 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి గరుడసేవ ఉత్సవానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా అలంకరించిన లక్ష్మీనరసింహ ఉత్సవమూర్తులను పృథులగిరిపై ఊరేగించారు. ఎదురుకోల ఉత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. రాత్రికి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించలేదు. పలు కులసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదానం చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల వారు తాగునీరు, మజ్జిగ సరఫరా చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కుప్పం కొండలరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఈవో శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. గర్నెపూడి విష్ణుప్రియ బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.



యాదవుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతునన్న దామచర్ల జనార్దన్

టీడీపీతోనే బీసీల సంక్షేమం

యాదవుల ఆత్మీయ సమావేశంలో పార్టీ ఒంగోలు అభ్యర్థి దామచర్ల

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 24 : బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాధాన్యం టీడీపీతో సాధ్యమని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ అన్నారు. నగరంలోని గోపాల్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన యాదవుల ఆత్మీయ సమావేశంలో దామచర్ల పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం టీడీపీ ఆవిర్భవించిందన్నారు. వారికి చట్టసభల్లో సమన్యాయం కల్పించిందన్నారు. రాజకీయం, సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం యాదవ సామాజికవర్గం కృషి చేయాలన్నారు. తనను మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేను చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంపై దామచర్ల, రియాజ్, రాచగర్ల వెంకట్రావులను గోపాలనగరంలో ఊరేగించి, గజమాలతో సత్కరించారు. ఈ ఆత్మీయ సమావేశంలో స్థానికులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సుబ్బమ్మకు నివాళులు

కొండపి, మార్చి 24 : కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాతృమూర్తి సుబ్బమ్మ భౌతికకాయాన్ని ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని స్వగృహంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, పార్టీ కొండపి మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడు, నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి, దామా మురళి, కొర్రపాటి వసంతరాయుడు, గుండపనేని రామ్మూర్తినాయుడు, జరుగుమల్లి మండల టీడీపీ అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, పార్టీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, మండల నాయకులు సుబ్బారెడ్డి, నరాల సోమయ్య, కొమ్మాలపాటి కృష్ణ, చదలవాడ బ్రహ్మేంద్రం, పాతూరి కోటేశ్వరరావు, పొన్నలూరు మండల పార్టీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు మండవ మురళి, కర్రా కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, తెలుగు యువత నాయకులు నివాళులర్పించారు.

మేమింతే..!

మారని వలంటీర్ల తీరు

వైసీపీ సేవలో మరికొందరు ఉద్యోగులు
ఈసీ హెచ్చరికలు బేఖాతరు
అధికార పార్టీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం
అరకొర చర్యలకే పరిమితమవుతున్న యంత్రాంగం
ఇప్పటి వరకూ 10 మందిని మాత్రమే తొలగించినట్లు జిల్లా కేంద్రానికి సమాచారం
మరికొందరిపై చర్యలు తీసుకున్నట్లు ప్రకటన
వైసీపీ నేతల ఒత్తిళ్లతో వెనకడుగు



మార్కాపురం వైసీపీ అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు ఆత్మీయ సమ్మేళనం వేదికపై ఆశీనుడైన హోం గార్డు మందా కొండారెడ్డి(ఫైల్)

ఎన్నికలకు దూరంగా ఉండాలన్న ఈసీ ఆదేశాన్ని వలంటీర్లు, మరికొందరు ప్రభుత్వ ఉద్యోగులు బేఖాతరు చేస్తున్నారు. వైసీపీకి అనుకూలంగా ప్రచారం కొనసాగిస్తూనే ఉన్నారు. వీరిపై చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో వంద మందికిపైగా వలంటీర్లు ఇప్పటి వరకూ ఈసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తెలుస్తుండగా వారిలో కేవలం పది మందిని మాత్రమే విధుల నుంచి తొలగించారు. వారి సమాచారం మాత్రమే జిల్లా కేంద్రానికి పంపారు. మరికొందరిపై చర్యలు తీసుకున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ ఎక్కడికక్కడ వైసీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. అదేసమయంలో ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ ఉపాధి హామీ పథకం, వివిధ శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు కూడా వైసీపీ సేవలో తరిస్తున్నారు. తర్లుపాడు మండలం కలుజువ్వలపాడుకు చెందిన ఓ హోంగార్డు అయితే ఏకంగా రాజకీయ నాయకుడి అవతారం ఎత్తాడు. అయినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 24 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులతో కలిసి వలంటీర్లు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. నిత్యం అందుకు సంబంధించిన ఫొటోలు, ఆధారాలతో సహా బహిర్గతమవుతున్నా అధికారులు మిన్నకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత అన్ని నియోజకవర్గాల్లో సుమారు వంద మందికిపైగా వలంటీర్లు వైసీపీ ఎమ్మెల్యేలు, ఆపార్టీకి చెందిన ఇతర ముఖ్యనాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం పది మందిని మాత్రమే విధుల నుంచి తొలగించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవోలు పత్రికా ప్రకటనలు విడుదల చేస్తున్నప్పటికీ జిల్లా కేంద్రానికి మాత్రం ఆ వివరాలు అందడం లేదు. జిల్లావ్యాప్తంగా వలంటీర్ల తొలగింపులపై ఏరోజుకారోజు మండల స్థాయి నుంచి జిల్లాస్థాయిలోని గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయానికి వస్తే వాటిని పరిశీలించి ప్రభుత్వానికి ఎంత మందిని తొలగించింది వివరాలు పంపుతారు. కానీ మండల స్థాయి నుంచే జిల్లా కార్యాలయానికి ఆ వివరాలు అందడం లేదు. దీంతో అధికారులు ముందుగా తొలగించినట్లు ప్రకటించి ఆతర్వాత పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకున్నట్లు ప్రకటనలకే పరిమితం

విభజిత జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ప్రతి నియోజకవర్గంలో మండల, గ్రామస్థాయి ముఖ్యనాయకుల ఆదేశాల మేరకు వలంటీర్లను నియమించారు. ప్రస్తుతం తొలగించిన వలంటీర్ల వివరాలను ఆ నాయకుల ఒత్తిళ్లతో పంపడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కేవలం మొక్కుబడిగా అక్కడక్కడా ఒకరిద్దరిని తొలగిస్తున్నారు. ఆయా మండలాల నుంచి తొలగించినట్లు ఇప్పటి వరకు 10 మంది పేర్లు మాత్రమే జిల్లా కేంద్రానికి వచ్చాయి. వారిలో సింగరాయకొండ, పొదిలి, తాళ్లూరు, దొనకొండ, త్రిపురాంతకం, తర్లుబాడు మండలాల వలంటీర్లు మాత్రమే ఉన్నారు. మిగిలిన వారిని తొలగిస్తున్నట్లు మండలస్థాయిలో ప్రకటించినా ఆచరణలో అమలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కాపురం, కనిగిరిల్లో కొందరు వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు ప్రకటించారు. కానీ వారి వివరాలు కూడా జిల్లా కేంద్రానికి అందలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొంటున్న వలంటీర్లపై సత్వర చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాల నాయకులు కోరుతున్నారు.



వైసీపీ ప్రచార కార్యక్రమంలో బిజ్జం రాంభూపాల్‌రెడ్డి

పగలు ఖాకీ.. రాత్రికి ఖద్దరు

వైసీపీ నేతగా హోంగార్డు

మార్కాపురం : ఈ ఫొటోలలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మందా కొండారెడ్డి. పోలీస్‌శాఖలో ఆయన హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే విధులు ముగిసిన తర్వాత ఆయన పొలిటీషియన్‌గా మారిపోతారు. మార్కాపురం సబ్‌డివిజన్ పరిధిలోని త్రిపురాంతకం క్షేత్రంలో కొండారెడ్డి హోంగార్డుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం తన స్వగ్రామమైన తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులో అధికార వైసీపీకి అన్నీ తానై వ్యవహారాలు చక్కబెట్టేస్తున్నాడు. ఇటీవల వైసీపీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మార్కాపురం వచ్చినప్పుడు పరిచయ కార్యక్రమంలో, మార్కాపురం అసెంబ్లీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు తర్లుపాడులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో సభావేదికపై ఆశీనుడయ్యాడు. ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలని ప్రచారం చేస్తున్న జిల్లా పోలీసు అధికారులు మందా కొండారెడ్డిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వైసీపీ ప్రచారంలో ఒప్పంద ఉద్యోగి

గిద్దలూరు టౌన్ : వైసీపీ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ఒప్పంద ఉద్యోగి పాల్గొన్నారు. ఆదివారం మార్కాపురం ఎమ్మెల్యే గిద్దలూరు వైసీపీ అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్‌లో ఒప్పంద వర్క్ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బిజ్జం రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అంతేకాకుండా ఆప్రాంతానికి వచ్చిన నాయకులను, కార్యకర్తలను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి ఆయనే పరిచయం చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రచారం చేశారు. ఇదిలావుండగా ఇటీవల శివరాత్రి వేడుకల సందర్భంగా పట్టణంలోని పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్యాలను ఆపేందుకు వెళ్లిన పోలీసులపై రాంభూపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ దశలో ఎస్పీ మావాడే, ఏమి కేసు పెట్టుకుంటారో పెట్టుకోండి అని పోలీసులతో ఆవేశంగా మాట్లాడారు. దీంతో విధులకు ఆటంకం కలిగించారని ఆయనపై నాడు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

సీ విజల్‌తో చెక్



ఎన్నికల్లో అక్రమాలు, కోడ్ ఉల్లంఘనల అడ్డుకట్టే లక్ష్యం
యాప్‌ను ప్రవేశపెట్టిన ఎన్నికల సంఘం
ప్రజలను భాగస్వామ్య చేస్తూ నిర్ణయం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24 : సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఈనెల 16 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. అందులో ప్రజలను కూడా భాగస్వామ్యం చేస్తోంది. సీ విజిల్ యాప్ ద్వారా ఉల్లంఘనలు అడ్డుకునేలా చర్యలు తీసుకుంది.

సాక్ష్యాలతో ఈ యాప్‌లో పొందుపర్చవచ్చు

సీ విజిల్ యాప్‌లో ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపర్చవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదుచేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలో దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి వంద నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

రిజిస్టర్ చేసుకోవడం ఇలా...

ముందుగా గుగూల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారి సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ నెంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకుంటే ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేస్తే సీ విజిల్ యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎలాంటివి చేయవచ్చు అంటే..

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉంటే ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతులు అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం వంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో, ఆడియో ద్వారా రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయాలి.

ఎలా అప్‌లోడ్ చేయాలంటే

యాప్‌ను తెరవగానే తెరపై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు వస్తాయి. ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఆ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఎక్కడి నుంచి పంపుతున్నారో అక్కడి లోకేషన్ నమోదవుతుంది. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. వీడియో, ఆడియో కూడా అదే విధంగా చేయాలి.

అప్‌లోడ్ చేసిన వెంటనే రంగంలోకి అధికారులు

యాప్‌లో ఫొటో, వీడియో, ఆడియోలను పొందుపర్చిన వెంటనే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దానిని ఫీల్డ్ యూనియన్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. అక్కడ విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఎన్నికల అధికారి దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా వంద నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదుపై స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటును కూడా ఎన్నికల సంఘం కల్పించింది.

ఈయాప్‌తో అరాచకానికి చరమగీతం

తాయిలాలు పంచి, అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చమరగీతం పాడేందుకు అవకాశం కలిగింది. యాప్‌ను ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకొని ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘనలు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆస్తులున్నా.. అమ్ముకోలేరు!

నిషేధిత జాబితాలో 30.71 ఎకరాలు
ఎనిమిదేళ్లుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్‌లు
మూడునెలల క్రితం కరుణించిన దేవదాయశాఖ
స్పందించని రెవెన్యూ అధికారులు
300 కుటుంబాల అవస్థలు

పామూరు, మార్చి 24 : పామూరులోని 300 కుటుంబాల వారు ఆస్తులున్నా పేదలుగానే జీవించాల్సిన దుస్థితి నెలకొంది. పిల్లల వివాహాలు, చదువులు, ఇతరత్రా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమైనా ఉన్న భూమిని అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. మొత్తం 30.71 ఎకరాల భూమిని దేవదాయశాఖ అధికారులు తమ భూమిగా నమోదు చేసి నిషేధిత జాబితాలో చేర్చడంతో ఎనిమిదేళ్లుగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఎట్టకేలకు 3 నెలల క్రితం వారు కరుణించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో నేటికీ లావాదేవీలు జరక్క ఆయా కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. పామూరులోని సర్వే నెంబర్ లోని 200లో ఎఫ్ఎంబీ ప్రకారం 30.71 ఎకరాలు, ఎఫ్ఎల్ఆర్ ప్రకారం 28.51 ఎకరాలు ఉంది. అయితే భూమిపై మాత్రం ఎఫ్ఎంబీ ప్రకారం మొత్తం విస్తీర్ణం ఉన్నది. గతంలో గ్రామానికి చెందిన 13 మంది వ్యక్తులపై పట్టాలు ఉండగా కాలక్రమేణా చేతులు ఆ భూమిలో ప్రస్తుతం 300 మంది స్థిరనివాసాలు ఏర్పరచుకొని ఉన్నారు. ఇదే సర్వే నెంబర్‌లో శ్రీ మదనవేణుగోపాలస్వామి, శ్రీవల్లి భుజంగేశ్వర, శ్రీ వరదరాజులు, శ్రీ ఆంజనేయస్వామి వార్ల ఆలయాలు 1.40 ఎకరాల్లో ఉన్నాయి. శ్రీ మదనవేణుగోపాలస్వామి వారి కల్యాణ మండపం దేవస్థానానికి ఎదురుగా శ్రీ వాసవీమాత ఆలయం వద్ద 4 సెంట్లలో నిర్మితమైంది. అయితే 200 సర్వే నెంబర్‌లో ఉన్న మొత్తం భూమి తదనంతరం గ్రామకంఠంగా రికార్డుల్లో నమోదైంది. ఆతర్వాత దేవదాయ శాఖ తన పరిధిలోకి తీసుకుంది. దీంతో హక్కుదారులకు సమస్య ఉత్పన్నమైంది. రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడంతో క్రయవిక్రయాలు ఆగిపోయాయి. గత ఎనిమిది సంవత్సరాలుగా ఆ సర్వేనెంబర్‌లో ఉన్న స్థలాన్ని అత్యవసరమైన అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. కొత్తగా గృహాలు నిర్మించుకోవాలనుకున్న వారు బ్యాంకుల వద్దకు రుణం కోసం వెళ్తే వారు ఎండోమెంట్ భూములైనందున తాము రుణం ఇవ్వలేమని కరాఖండిగా చెప్తున్నారు. పిల్లల వివాహాలు, చదువులు, ఇతర ఆర్థిక అవసరాలు ఉన్నా భూమిని అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది.



దేవస్థానానికి చెందిన కల్యాణ మండపం

3 నెలల క్రితమే దేవదాయశాఖ గ్రీన్‌సిగ్నల్.. పట్టించుకోని రెవెన్యూ అధికారులు

రెవెన్యూ అధికారులు 200 సర్వేనెంబర్‌లో ఉన్న మొత్తం విస్తీర్ణాన్ని రెండు సబ్ డివిజన్లుగా చేశారు. ఈ రెండు సబ్ డివిజన్లలోని భూమిని ఆన్‌లైన్ చేయాల్సిందిగా దేవదాయ శాఖ ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ నుంచి గత ఏడాది డిసెంబర్ 29న పామూరు తహసీల్దార్ కార్యాలయానికి ఆదేశాలు అందాయి. అదే రోజు పామూరుకు చెందిన రాచూరి మన్మధరావు కలెక్టర్‌ను కలిసి ఏసీ ఆదేశాలను అమలు చేయాల్సిందిగా కోరారు. కలెక్టర్ స్పందించి కనిగిరి ఆర్డీవోకు విషయాన్ని తెలిపి త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అయితే తహసీల్దార్ కార్యాలయంలో ఆ ఫైల్ అలాగే ఉంది. సర్వే నెంబర్ 200/1,2,3 నిషేధిత జాబితాలో ఉండగా, 200 సర్వే నెంబర్‌కు సంబంధించి అమ్మకాలు కొనుగోలు జరగక, రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ స్థాయిలో గండి పడుతోంది. పాలకులకు బాధితులు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే లేరని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరిస్తే మూడు వందలకు పైగా కుటుంబాలకు విముక్తి లభించి, తమ ఆస్తుల క్రయవిక్రయాలకు అవకాశం ఏర్పడుతుందని బాధిత ప్రజలు కోరుతున్నారు.

30న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 24: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన పౌరసత్వం సవరణ చట్టం(సీఏఏ)కు వ్యతిరేకంగా ఈనెల 30న ఒంగోలులో జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని వామపక్ష లౌకిక పార్టీలు, ముస్లిం ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఆదివారం స్థానిక ఇస్లాంపేటలోని ముస్లిం కమ్యూనిటీ హాలులో ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సయ్యద్‌సర్దార్, మాట్లాడుతూ ఈ ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు షేక్ కరీముల్లా, సయ్యద్‌ఇస్మాయిల్, పఠాన్ కరీముల్లా ఖాన్, షేక్ కపిల్‌బాషా, సయ్యద్ హుస్సేన్, షేక్ సలార్, అబ్దుల్‌రావుఫ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : బీఎన్

సంతనూతలపాడు, మార్చి 24 : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో పేర్నమిట్ట పరిధిలోని 41వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు నూకతోటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 10 కుటుంబాలు ఆదివారం విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా సంతనూతలపాడుకు చెందిన న్యాయవాది మంగలపూడి ఆదిత్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలుగ్రామాలకు చెందిన 20కుటుంబాలు వైసీపీనివీడి టీడీపీలో చేరారు. వారందరికి బీఎన్ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు.

పాఠశాలల విలీన ప్రక్రియ సరైనది కాదు

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

కనిగిరి, మార్చి 24: జాతీయ నూతన విద్యా విధానం అమలులో భాగంగా పాఠశాలల విలీన ప్రక్రియ విధానం సరైనది కాదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. కనిగిరిలో ఎస్టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యా వ్యవస్థకు నష్టం కల్గించే విలీన ప్రక్రియపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ఎస్టీయూ ప్రధాన భూమిక పోషించిందన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం ఆవిర్భవించిందే ఎస్టీయూ అన్నారు. ఎన్నో చారిత్రాత్మక ఉద్యమాలను ముందుండి నడిపిన సంఘమన్నారు. నేడు ఉపాధ్యాయులు పొందుతున్న సౌలభ్యాల సాధనలో ఎస్టీయూ చేసిన కృషి ఎంతో ఉందన్నారు. రీ గ్రూపింగ్ పేస్కేల్స్, ఇంక్రిమెంట్లు, డీఏ, హెచ్ఆర్ఏ, ఏఎస్, ఉద్యోగోన్నతుల సాధన ఎస్టీయూ పోరాటాల ఫలితమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరమణారెడ్డి, బీ వెంగళరెడ్డి మాట్లాడుతూ వీణా విజయరామరాజు, కత్తి నరసింహారెడ్డి లాంటి పోరాట యోధులు పనిచేసిన సంఘం ఎస్టీయూ అన్నారు. గత ప్రభుత్వాలలో చర్చలు, పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలకు వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచేలా వ్యవహరించటం అన్యాయమన్నారు. సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ విశేష సేవలందించిన ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం ఎంతైనా అవసరమన్నారు. నిబద్ధతతో పనిచేసే వారు ఎస్టీయూలో సభ్యులుగా చేరి సమస్యల సాధనలో పాలపంచుకోవాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ఎర్రయ్య, రాష్ట్రకార్యవర్గసభ్యులు శ్రీనివాసులు, జిల్లా ప్రధానకార్యదర్శి జీ నరసింహారెడ్డి, కనిగిరి అధ్యక్షుడు తుమ్మా వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి జీ ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం శింగరకొండ



శింగరకొండ వ్యూ

» నేడు ప్రధాన తిరునాళ్ల

అద్దంకి, మార్చి 24: శింగరకొండ క్షేత్రం భక్తుల కొంగు బంగారంగా ఖ్యాతికెక్కింది. ఒకప్పుడు ఇక్కడ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ఆ దేవాలయాలతో పాటు భక్తాంజనేయస్వామి దేవాలయం, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, అయ్యప్పస్వామి దేవాలయం, శ్రీకృష్ణుని దేవాలయం, 99 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయాలు, ఇంకా పలు చిన్న దేవాలయాలు ఉన్నాయి. కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి మెట్ల మార్గం ఉంది. మూడు దశాబ్దాల క్రితం కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం చేశారు.



బాలాలయంలో ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి,



ప్రత్యేక అలంకరణలో శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి

రెండు తెలుగు రాష్ట్రాలలో దక్షిణ ముఖంగా ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం శింగరకొండలో మాత్రమే ఉంది. 1916లో భవనాసి చెరువు నిర్మాణం పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలలో పనులు పూర్తి చేశారు. ఆ సమయంలో ఆంజనేయస్వామి దేవాలయం కొద్దిమేర అభివృద్ధి చేశారు. తొలుత మంగళ, శని వారాలలో మాత్రమే భక్తులు శింగరకొండకు వచ్చేవారు. 1960 నుచి దేవాలయం దేవదాయశాఖ పరిధిలోకి చేరింది. అనంతరం భక్తులు, దాతల సహకారంతో దేవాలయం అభివృద్ధి చెందింది. 1984లో ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. దక్షిణ రాజగోపురాన్ని దేవాలయం నిధులతో నిర్మించగా, మిగిలిన మూడు రాజగోపురాలను దాతల సహకారంతో నిర్మించారు. దేవస్థానం ముఖ మండపం పునర్నిర్మాణానికి టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. మరో రూ.3 కోట్లు దాతల నుంచి సేకరిస్తూ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో పక్కనే బాలాలయంలో ప్రత్యేకంగా మొద్దుతో స్వామి వారి విగ్రహం తయారు చేయించి ప్రతిష్ఠించారు. ప్రస్తుతం కూడా అక్కడే స్వామి వారి దర్శనం కొనసాగుతుంది. ప్రధాన ఆలయం పనులు పూర్తయ్యేందుకు మరి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

దాతల సహకారంతో మారిన రూపురేఖలు

శింగరకొండలో ఇటీవల కాలంలో దాతల సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరగటంతో రూపురేఖలు మారిపోయాయి. శింగరకొండలో టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం, దాతల సహకారంతో సుమారు రూ.7 కోట్లతో రాతి ముఖ మండపం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దాతల సహకారంతో పొంగలిశాల, భక్తుల విశ్రాంతిశాల, నిత్యాన్నదాన భవనం, షాపింగ్ కాంప్లెక్స్, పరిపాలన భవనం, కేశ ఖండన శాల, పోలవరపు యాగశాల, గోశాల నిర్మాణం చేశారు. దామచర్ల అతిథి గృహం ఆధునికీకరణ పనులు చేపట్టారు.

మూడు రోజులపాటు ఉత్సవాలు

ప్రతి ఏటా పాల్గుణ శుద్ధ త్రయోదశి నుండి పౌర్ణమి వరకు మూడు రోజుల పాటు తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతాయి. మూడోరోజు ప్రధాన తిరునాళ్ల జరుగుతుంది. ఈఏడాది మార్చి 23 నుంచి 25 వరకు 69వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతునున్నాయి. ప్రధాన తిరుణాళ్ల సోమవారం జరగనుంది.

తొలిసారి ఒకేఒక్క విద్యుత్ ప్రభ

తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభమై 69 సంవత్సరాలు కాగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఒకే ఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటు జరుగుతుంది. రాజకీయ పార్టీ ల నేతల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభల ఏర్పాటు జరుగుతుంటుంది. ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీల జెండాలు ఏర్పాటు కు అనుమతి లేకపోవటం, డ్యాన్స్‌లకు పోలీస్ అధికారులు అనుమతులు ఇవ్వకపోవటంతో విద్యుత్ ప్రభల ఏర్పాటుకు వెనకడుగు పడింది.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి వారికి విశేష అభిషేకం నిర్వహిస్తున్న పూజారులు

అద్దంకి మున్సిపాలిటీ లోని వైసీపీ కౌన్సిలర్ ల ఆధ్వర్యంలో మా త్రమే ఒకే ఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులు ఒకింత నిరుత్సాహం కు గురవుతున్నారు. అదే సమయంలో ప్రధాన ఆలయం రాతి మండపం నిర్మాణ పనులు జరుగుతుండగా బాలాలయం లో ఆంజనేయస్వామి దర్శనం చేసుకోవాల్సి రావటం కూడా భక్తులలో నిరాసక్తతను మరింత పెంచింది. దీంతో గతంలో ఎన్నడూ లే ని పరిస్థితులు ఈ ఏడాది శింగరకొండ వార్షిక తిరునాళ్లకు ఏర్పడ్డాయని భక్తులు అభి ప్రాయపడుతున్నారు.

వైభవంగా అభిషేకాలు

అద్దంకి, మార్చి 24: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షికోత్సవ తిరునాళ్ల ఉత్సవాలు రెండోరోజు ఆదివారం వైభవంగా సాగాయి. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఉదయం సుప్రభాత సేవ, బిందె తీర్థం నిర్వహించారు. అనంతరం విశేష అభిషేకం నిర్వహించారు. రుత్వికులచే మహన్యాస పూర్వక ఏకాదశ మన్యుసూక్త వారాభిషేకం, సందరాకాండ పారాయణ, సూర్య నమస్కారాలు, సప్తశతి పారాయణ, పంచామృతాలు, దశ ద్రవ్యాలచే విశేష అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన భజన, శ్రీసాయి నాట్య కళాసమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన దేవనర్తకి పూర్తి నాటకం, కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామి వారికి ఉష్ట్ర వాహన సేవ నిర్వహించారు.

ప్రధాన తిరునాళ్ల సందర్భగా సోమవారం ఉదయం సుప్రభాత సేవ, బిందె తీర్థం, ప్రాతఃకాలార్చన నిర్వహించనున్నారు. ఉదయం 5.30 నుంచి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్విరామంగా స్వామి వారి దివ్య దర్శనం ఉంటుంది. సోమవారం ఉదయం 10 గంటలకు భజన, రాత్రి 7 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన, సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు రథోత్సవం కన్నుల పండుగగా సాగనుంది.

లక్ష్మీనరసింహస్వామి దేవాలయం లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. రెండు దేవాలయాల వద్ద విద్యుత్ దీపాల వెలుగులతో దేదీప్యమానంగా మారింది. సోమవారం కొండపైకి దాతల సహకారంతో ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా అద్దంకి డిపో నుంచి 30 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. ఒంగోలు, పొదిలి, వినుకొండ, నర్సరావుపేట డిపోల నుంచి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. సుమారు ఆరువందల మంది పోలీస్‌లతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నామ్ రోడ్డులో ట్రాఫిక్‌ను మేదరమెట్ల, సంతమాగులూరు అడ్డ రోడ్డుల వద్ద నుంచి చిలకలూరిపేట, నర్సరావుపేట ల మీదుగా మరల్చనున్నారు.



పూనూరులో మట్టల పండుగలో ఊరేగింపుగా చిన్నారులు

ఘనంగా మట్టల ఆదివారం

» చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

అద్దంకిటౌన్, మార్చి 24: మట్టల ఆదివారం సందర్భంగా అద్దంకి మండలంలోని గ్రామాలు, పట్టణంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని పసుమర్తిపాలెం డాక్టర్ క్లైమోమోరియల్ సెంటనరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి, కట్టకింద పాలెం, మండలంలోని ధేనువకొండ పునరావాస కాలనీ బలరామకృష్ణపురం, ఇతర గ్రామాల్లోని చర్చిల వద్ద ముందుగా సండేస్కూల్ చిన్నారులు మట్టలు పట్టుకుని క్రీస్తు పాటలు పాడుతూ, వ్యాకోపదేశం చేస్తూ పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పసుమర్తిపాలెం తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి సంఘకాపరి డాక్టర్ యేసుబాబు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడేకి ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ పాలపర్తి ప్రభాకర్, సండే స్కూల్ టీచర్‌లు కె.రీతూ, వై.సరోజిని, పి.ప్రభావతి, వి.బుజ్జమ్మ, ఎం.సరళ, సంఘపెద్దలు , తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలోని లూథరన్ చర్చిలో ఆదివారం మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట సంఘ కాపరి బొంతు రాజేష్ ఆధ్వర్యంలో చిన్నారులు మట్టలతో వీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సండే స్కూలు చిన్నారులు కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమంలో బొంతు రాజేష్, సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

చీరాలటౌన్: చీరాల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పలు క్రైస్తవ దేవాలయాల్లో ఘనంగా వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా క్రైస్తవులు, చిన్నారులు ఈత మట్టలకు పూలను అలంకరించి ర్యాలీలు నిర్వహించారు. క్రైస్తవులు ఆయా మందిరాల్లో అధిక సంఖ్యలో హాజరు ప్రార్థనలు చేశారు.

బొల్లాపల్లిలో అక్రమ తవ్వకాలు

» యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు » పట్టించుకోని అధికారులు



బొల్లాపల్లి కొండ పోరంబోకు ప్రదేశంలో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్‌కు నింపుతున్న గ్రావెల్

మార్టూరు, మార్చి 24: మండలంలోని బొల్లాపల్లి గ్రావెల్ కొండ పోరంబోకు వద్ద గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బొల్లాపల్లి టోల్ ప్లాజాకు సమీపంలోని జగనన్న కాలనీకి దగ్గరలో గ్రావెల్ కొండ నుంచి గ్రావెల్‌ను తవ్వి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గత మూడు రోజుల నుంచి నిరాటంకంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. బొల్లాపల్లి గ్రామానికి చెందిన వైసీపీ మద్దతుదారులైన ఇద్దరు వ్యక్తులు గ్రావెల్ తవ్వకాలలో సూత్రధారులుగా ఉన్నట్లు తెలిసింది. వారిలో ఒక వ్యక్తి గ్రావెల్ తవ్విన ప్రదేశాన్ని ఆక్రమించుకొని స్వాధీనం చేసుకోవాలనే ముందస్తు ఆలోచనలో ఉండగా, మరో వ్యక్తి సొంతంగా ఉన్న ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్‌ను అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది.

జాతీయ రహదారికి తూర్పు వైపున బొబ్బేపల్లి, ద్రోణాదుల గ్రామాలకు చెందిన ఎర్ర మట్టి తవ్వకాలు నిలిచిపోయాయి. కోలలపూడి గ్రామంలో మాత్రం అధికారికంగా అనుమతులు ఉన్నాయని ఒక వ్యక్తి తవ్వకాలు చేస్తున్నారు. వలపర్లలో గ్రావెల్ కొండ నుంచి గ్రావెల్‌ను తీసుకెళ్లాలంటే జాతీయ రహదారిని దాటి వెళ్లాలి. దీంతో జాతీయ రహదారికి తూర్పు వైపున ఉన్న బొల్లాపల్లి గ్రావెల్ కొండ నుంచి తరలించే గ్రావెల్‌కు డిమాండ్ ఉండటంతో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమ తరలింపుపై కన్నేశారు. దాంతో గ్రామానికి సమీపంలో ఉన్న గ్రావెల్ కొండ పోరంబోకు ప్రదేశం నుంచి గ్రావెల్ అక్రమ తవ్వకం చేపట్టారు. అరు యూనిట్లు గ్రావెల్‌ను నింపే డంపరు వాహనం నుంచి రెండు వేల రూపాయలను వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇంకా టిప్పర్లు, ట్రాక్టర్లుకు గ్రావెల్‌ను లోడింగ్ చేసి డబ్బులను వసూలు చేస్తున్నారు. పగలు సమయాలలో సమీపంలోని మామిడి తోటల్లో ఎక్స్‌కవేటర్‌ను దాచిపెట్టి అర్ధరాత్రి సమయంలో సడన్‌గా బయటకుతీసి గ్రావెల్‌ను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

గతంలోనూ ఈప్రదేశంలో కొంతమంది వ్యక్తులు అడపాదడపా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి సొమ్ములను సంపాదించిన సంఘటనలు ఉన్నాయి. ఈ కొండలో అక్కడక్కడ సడన్‌గా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. మైనింగ్ అధికారులు సమాచారం అందుకొని వచ్చేలోపే మామిడితోటల్లోకి వెళ్లిన ఎక్స్‌కవేటర్‌లు కనిపించకుండా పోతుంటాయి. అధికారులు పూర్తిగా నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకుంటేనే అక్రమ తవ్వకాలు ఆగుతాయని బొల్లాపల్లి గ్రామస్థులు భావిస్తున్నారు.

వైసీపీ కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మార్చి 24: అధికారం కోసం జగన్ కుయుక్తులు, కుట్రలు, దౌర్జన్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం పర్చూరు, కుంకలమర్రు గ్రామాలకు చెందిన వంద కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఏలూరి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా ఏకమై తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలవాలన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రానికి స్వర్ణయుగం వస్తుందని చెప్పారు. భూ హక్కు చట్టంపేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కొనేందుకు జగన్ రెడ్డి కుట్రపన్నారన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం, కొత్త మాధవరంలో బీసీ చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన మూడు ఎకరాల భూమి వైసీపీకి చెందిన నాయకులు లాక్కోవటంతో మొత్తం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులు ఏవిధంగా అన్యాక్రాంతం అవుతున్నాయో చెప్పటానికి ఇది ఒక ఉదాహరణ అని అన్నారు. జగన్ రెడ్డి తెచ్చిన కొత్త చట్టం భూకబ్జాదారులకు వరంగా మారిందన్నారు.

పర్చూరుకు చెందిన వైసీపీ నాయకుడు ఆకుల మధుబాబు ఆధ్వర్యంలో పలు కుంటుంబాలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీ సీనియర్ నాయకుడు ఇమిడిశెట్టి పెద్దబ్బాయి, శీలం శ్రీనివాసరావు, ఇందిరా కాలనీ, అంబేద్కర్ కాలనీకి చెందినవారు ఉన్నారు.

కారంచేడు మండలం కుంకలమర్రుకు చెందిన వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పందరబోయిన ప్రసాద్, నక్కల వాసు, బండారు కిరణ్, బత్తుల అఖిల్, మురిపిడి గోపి, చల్లా రాఘవరావు, పులగం రామ సుబ్బారావు మణికంఠ, కమ్మిల సురేష్, షేక్ మస్తాన్‌వలి, పులి జగదీష్, మురిపి వెంకటేష్, ఉప్పు బసవయ్య, బోయిన బుజ్జి, కొమ్మనబోయిన సాయి, నర్రా గోపీనాథ్, గంజి అర్జులు ఉన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగారు బాబు, కడియం మణికంఠ, కడియం రాంబాబు, రావల సూర్యన్నారాయణ, ఏమవరపు నాగశంకర్రావు, కరిచేటి రాజేష్, గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు ప్రభుత్వ వైద్యశాలలో హైడ్రామా!

» చికిత్స పొందుతున్న వ్యక్తిని స్టేషన్‌కు తరలించేందుకు బల్లికురవ పోలీసుల అత్యుత్సాహం



మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితుడు పిన్నేటి నాగరాజు (తెల్ల చొక్కాతో ఉన్న వ్యక్తి)

మార్టూరు, మార్చి 24: మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిన్నేటి నాగరాజు అనే వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు బల్లికురవ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బాధితుడు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు కావడంతో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు బల్లికురవ పోలీసులు హైడ్రామాకు తెరతీశారని సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే, మీడియా ప్రతినిధులు ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరడంతో పోలీసులు తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఈ సంఘటన ఆదివారం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది.

బల్లికురవ మండలం వేమవరం కూడలిలో శనివారం మద్యం తాగుతున్న క్రమంలో పిన్నిటి నాగరాజు, కొండవర్థు గోపిరాజు గొడవపడ్డారు. ఈక్రమంలో పిన్నేటి నాగరాజు తలకు గాయం కావడంతో చికిత్స నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం రాత్రి చేరారు. వైద్యులు అతని తలకు కుట్లు వేసి వైద్యం చేశారు. ఈ గొడవకు సంబంధించి ఒకరిపై మరొకరు చేసిన ఫిర్యాదులు బల్లికురవ స్టేషన్‌కు చేరాయి. ఈనేపథ్యంలో అధికార పార్టీ నాయకుల ప్రభావమో, ఇతరత్రా కారణాలో గాని బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు పోలీసులను పంపించి నాగరాజును స్టేషన్‌కు తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యులు నాగరాజును ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే, నాగరాజుకు ఇంకా ఇబ్బందిగా ఉందని, పూర్తిగా కోలుకోలేదని కుటుంబ సభ్యులు పోలీసులను, వైద్యులను విన్నవించుకున్నారు. ఈక్రమంలో నాగరాజును స్టేషన్‌కు తీసుకెళ్లడానికి పోలీసులు ప్రయత్నాలు చేసే సమయంలో మీడియా రంగప్రవేశం చేయడంతో పోలీసులు వెనక్కితగ్గారు. కొన్ని పరీక్షలను చేయించుకోవాలని నాగరాజు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఉన్నారు.

ఇదిలాఉండగా కొన్నిరోజుల క్రితం బల్లికురవలో మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన వృద్ధుడిపై ఎస్ఐ చేయి చేసుకున్నాడు. ఈ సంఘటనపై డీఎస్పీ స్థాయిలో విచారణ జరుగుతున్నది. ఈసమయంలో ఈ సంఘటన చోటుచేసుకోవడంతో ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అతని చర్యలు వివాదాస్పదంగా ఉన్నాయని మండలంలో చర్చ నీయాంశమైంది.

కూటమి అభ్యర్థి గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలి

» ఎంఎం కొండయ్య



కూటమి అభ్యర్థి కొండయ్యను సత్కరిస్తున్న బాలానందం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు సజ్జా వెంకటేశ్వరరావు

చీరాల, మార్చి 24: టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని చీరాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం దేవాంగ సామాజికవర్గంలో కీలక భూమిక పోషిస్తున్న బాలానందం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు, టీడీపీ నేత సజ్జా వెంకటేశ్వరరావును కొండయ్య ముఖ్యనాయకులతో కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భావసారూప్యంతో కలిసొచ్చే అందరిని కలుపునకు పోదామన్నారు. ఈసందర్భంగా వెంకటేశ్వరావు మర్యాదపూర్వకంగా కొండయ్యను సత్కరించారు. అనంతరం మండల పరిధిలోని హస్తినాపురంలో బాలభక్త కమిటీ ఆహ్వానం మేరకు శ్రీగణపతి స్వామివారి ముఖమండప ప్రారంభోత్సవ ప్రత్యేక పూజల్లో కొండయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ యాజమాన్య ప్రతినిధులు, సిబ్బంది కొండయ్యను కలసి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో నిలిచినందుకు అభినందనలు తెలిపారు. సాయంత్రం పేరాల కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరిగిన ప్రత్యే పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తదనంతరం తోటవారిపాలెం దేవస్థాన ప్రాంగణంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.

చేనేత కుటుంబం ఆత్మహత్య బాధాకరం

చీరాల, మార్చి 24: సీఎం జగన్‌రెడ్డి పాలనలో బడుగుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయి. తాజాగా కడపలో చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకోవటం అందుకు నిదర్శనమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు, ఆయన భార్య పద్మావతి, కుమార్తె వినయ ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారికి శ్రద్ధాంజలి ఘటించారు. జగన్ ప్రభుత్వ నియంత పోకడలను ఎండగట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన కలిగిఉండాలి

అద్దంకిటౌన్, మార్చి 24: క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగిఉండాలని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం అద్దంకి సీహెచ్‌సీ సిబ్బంది, టీబీ యూనిట్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌ప్రజాకర్, బి.రాజశేఖర్, శ్రీనివాస్, సత్తార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, హెల్ప్ టీబి ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని డీపీసీ పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్‌కుమార్, హెల్ప్ టీబి ప్రతినిధులు వి.కరుణ, టి.శ్రావణి, పార్వతి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

చీరాల: క్షయ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మహిళా మండలి ప్రతినిధులు, ఆశా వర్కర్లు అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఏరియా వైద్యశాల నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి బాధ్యులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

చీరాల, మార్చి 24: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎ మ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నా రు. స్థానిక రామకృష్ణాపురంలోని హైమా హాస్పటల్లో యూరాలజీ విభాగా న్ని ఆదివారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ గుంటుపల్లి (హైమా) సుబ్బారావు, డాక్టర్ గోరంట్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని హస్తినాపురంలో శ్రీగణపతి స్వామి వారి ముఖద్వార మండపం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ పాల్గొన్నారు. తీర్థప్ర సాదాలు స్వీకరించారు.

చికిత్స పొందుతూ ఏఎన్‌ఎం మృతి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మార్చి 24: చికిత్స పొందుతూ సచివాలయ ఏఎన్‌ఎం శనివారం రాత్రి మృతి చెందింది. మండల పరిధిలోని ఈపూరుపాలెం సావరపాలెంకు చెందిన బత్తుల రాజ్యలక్ష్మి(47) గవినివారిపాలెం సచివాలయం 2లో విధులు నిర్వహిస్తుంది. ఆమెకు భర్త, ఇద్దరు సంతానం. వారం క్రితం పట్టణంలో ఓ ప్రయివేట్ వైద్యశాల ప్రతినిధులు కోవిడ్ సమయంలో విశేష సేవలు అందించిన ఆరోగ్య సిబ్బందికి ఐఎంఏ హాలులో సన్మానించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న రాజ్యలక్ష్మి ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరిలోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. పరీక్షలు చేసి తలలో రక్తం గడ్డ కట్టినట్లుగా గుర్తించి చికిత్స అందిస్తున్నారు. అప్పటినుంచి అపస్మారక స్థితిలో ఉన్న ఆమె శనివారం రాత్రి మృతిచెందింది. ఆదివారం జరిగిన అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ఆరోగ్య సిబ్బంది హాజరై నివాళులర్పించారు.

డాక్టర్ పోలవరపు సేవలు మరువలేనివి

చీరాలటౌన్, మార్చి 24: డాక్టర్ పోలవరపు వెంకటేశ్వర ప్రసాద్ చీరాల పరిధిలోని అనేక మంది నిరుపేదలకు అందించిన సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో చీరాల రోటరీ క్లబ్, కళాంజలి సంస్థలు సంయుక్తంగా ప్రముఖ వైద్యులు డా.పోలవరపు సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు, కార్యదర్శి కృష్ణమూర్తి, శ్రీమన్నారాయణ, గౌతమ్, రాధాకృష్ణ, బత్తుల బ్రహ్మారెడ్డి, రమణ, నాగవీరభద్రాచారి, వెంకటరావు, సురేష్, జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో పోలీసుల కవాతు

చీరాలటౌన్, మార్చి 24: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు చీరాల నియోజకవర్గ పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. ఆదివారం రాత్రి వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో పారా మిలటరీ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. మార్కెట్, బస్టాండ్, ఫైర్ గేటు, కొట్ల బజార్, స్వర్ణ గేట్, దండుబాట, హరిప్రసాద్ నగర్ ప్రాంతాలలో కవాతు జరిగింది. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణం కలిగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, పారా మిలటరీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలు మృతి

ఇంకొల్లు, మార్చి 24: పొలంలో పిచ్చి మొక్కలు పీకుతుండగా హార్వెస్టర్ తగిలి వృద్ధురాలు మృతిచెందింది. ఈఘటన ఆదివారం భీమవరం గ్రామ పొలాల్లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయచూరు జిల్లా గుడిహాలకు చెందిన లక్ష్మమ్మ పొలం పనులు చేసుకొని జీవనం సాగించేందుకు ఇక్కడికి వచ్చింది. పొలంలో శనగనూర్పిడి చేస్తున్న సమయంలో పిచ్చి మొక్కలు పీకుతున్న లక్ష్మమ్మకు హార్వెస్టర్ తగిలి తీవ్రగాయాలై మృతి చెందింది. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. శవపంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవి తెలిపారు.

బైకిస్టుకు పాము కాటు

బల్లికురవ, మార్చి 24: మండలంలోని సోమవరప్పాడుకు చెందిన కొండవర్థు పిచ్చయ్య పాముకాటుకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. ఆదివారం సోమవరప్పాడు గ్రామం నుంచి ఆయన బైకుపై మల్లాయపాలెంకు వస్తున్నాడు. మార్గమధ్యంలోకి వచ్చేసరికి అప్పటికే బైకు ఇంజన్‌పైన ఉన్న పాము బయటకు వచ్చి పిచ్చయ్య కాలిపై కాటువేసి రోడ్డు పక్కన ఉన్న గుట్టలలోకి వెళ్లింది. వెంటనే మల్లాయపాలెంలో బంధువుల సహకారంతో వైద్యశాలకు తరలివెళ్లారు.


మహిళపై దాడి

బల్లికురవ. మార్చి 24: మండలంలోని కొప్పెరపాలెంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ వివాహితపై అదే గ్రామానికి వల్లెపు నాగేశ్వరరావు దాడిచేయడంతో గాయపడ్డారు. తాను ఇంట్లో ఒంటరిగా ఉండటంతో నాగేశ్వరరావు అనే వ్యక్తి వచ్చి అత్యాచారయత్నానికి పాల్పడి కత్తితో దాడి చేశాడని పేర్కొంది. గాయపడిన ఆమెను బంధువులు 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈమేరకు వైద్యశాలలో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకిటౌన్, మార్చి 24: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినికి ఆదివారం రక్తదానం చేశారు. వెంపరాలకు చెందిన విద్యార్థిని రక్తహీనతతో బాధపడుతుండడంతో డాక్టర్ రక్తం అవసరమని చెప్పారు. దీంతో మాధవస్వామి గుడి అర్చకులు భాగవతుల వెంకటాచార్యులు కుమారుడు సూర్యమాల కొండమాచార్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, సందిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు అత్తులూరి మృతి



హనుమంతరావు(ఫైల్)

అద్దంకి, మార్చి 24: అద్దంకి మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు అత్తులూరి హనుమంతరావు(55) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం గుంటూరు వైద్యశాలలో మృతి చెందాడు. హనుమంతరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పలువురు ఆర్యవైశ్యులు హనుమంతరావు మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవాలి

మేదరమెట్ల , మార్చి 24: చిన్న పిల్లలకు కంప్యూటర్‌లపై అవగాహన అవసరం అని ఉద్దేశంతో కిరణ్‌జ్యోతి రిచ్చర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. మండలంలోని దైవాలరావూరులో గత 20 సంవత్సరాలుగా విద్యార్థులు, వృద్ధులు, చిన్నారులు, కళాకారులకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ ఆదివారం చిన్నారులకు కంప్యూటర్లు, వాటి పనితీరు గురించి అవగాహన కల్పించారు. కంప్యూటర్ పట్ల అవగాహన ఉంటే చిన్నారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందనే ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కందెపు రాజశేఖర్ అన్నారు. చిన్నారులకు ఆళ్ళ పుష్పాలత, జననీ, జహ్నవి, బాలాజి, బద్రీ, తదితరులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఏలూరి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 24: యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో ఇటీవల విగ్రహ ప్రతిష్ఠ జరిగిన ఆంజనేయస్వామిని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కనపర్తి నాగేశ్వరరావు, నల్లపనేని రంగయ్య చౌదరి, గుదే తారక రామారావు, రావిపాటి సీతయ్య, తదితరులు ఉన్నారు.

ఉత్తర కాలువకు నీటి విడుదల పెంపు



అనంతసాగరం: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి ప్రాజెక్టులో 11.080 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50 నుంచి 300 క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచారు. డెల్టాకు 1500, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రంజాన్ వేళలు	ఇఫ్తార్ (సోమవారం) : 6.22	సహరి (మంగళవారం) : 4.50

ఉష్ణోగ్రతలు		
నెల్లూరు	35.5	25.1
కావలి	35.0	25.0
కందుకూరు	34.0	26.0
ఆత్మకూరు	38.0	25.0
ఉదయగిరి	34.0	24.0



బిట్రగుంట వీధుల్లో సాగుతున్న ప్రసన్నుడి రథోత్సవం,(అంతర్‌చిత్రంలో) స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం.. ప్రసన్నుడి కల్యాణం

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- వైభవంగా శ్రీవారి రథోత్సవం
- గోవింద నామస్మరణతో మోరుమోగిన బిటకూలక్షేత్రం

బిట్రగుంట, మార్చి 24: బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసన్నుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారి కల్యాణాన్ని అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, సహస్ర నామార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. అలంకార ప్రియుడైన శ్రీనివాసుడు తన దేవేరులతో కల్యాణ మండపానికి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల మధ్య తరలివచ్చారు. కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరపున కావలి ఆర్డీవో శీనానాయక్ దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కాగా తూర్పుగోదావరి జిల్లా మండపేట నుంచి తెచ్చిన శంఖు, చక్రనామాల కొబ్బరి బోండాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో రాధాకృష్ణ, పాలక మండలి చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి ఉభయకర్తలను ఆహ్వానించారు. అంతకుముందు విశ్వనాథరావుపేట తాళ్లూరు పంచాయతీల మధ్య అటవీ ప్రాంతంలోని స్వామివారి నిజపాదాల నుంచి తలంబ్రాలను మేళతాళాలతో ఊరేగింపుగా శ్రీవారి కల్యాణ వేదిక వద్దకు చేర్చారు.

వైభవంగా రథోత్సవం

కల్యాణం అనంతరం స్వామి,అమ్మవార్లు రథోత్సవానికి తరలివచ్చారు. బిట్రగుంట పంచాయతీలోని రెండు గ్రామాల వీధుల్లో రథోత్సవం వైభవంగా సాగింది. కావలి డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. రాత్రికి అలకలతోపు, అశ్వవాహనసేవ, ధ్వజఅవరోహణ, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఏసీ శ్రీనివాసులు, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి చైతన్య, పీఎస్‌ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు పీ.సుగుణ తదితరలు పాల్గొని, స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు.

వైభవంగా హనుమంత సేవ



హనుమంత వాహనంపై ఊరేగుతున్న రంగనాథుడు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24: నెల్లూరు నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి వైభవంగా హనుమంత వాహనసేవ జరిగింది. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం నిత్యపూజలు, పూలంగిసేవలు జరిగాయి. వెన్నత్తాళి తిరుచ్చి ఉత్సవంలో స్వామివారికి కనుల పండువగా అలంకరణ జరిగింది. సాయంత్రం మూలవర్లకు విశేష పూలాలంకారం చేశారు. రాత్రి స్వామివారికి ఏకాంత, ఊంజల్‌సేవ జరిగాయి. అనంతరం విశేష పుష్పాలంకారం, మంగళవాయిద్యాలు, విద్యుద్దీపాలంకరణలు, బాణసంచా వేడుకలతో రంగనాథుడు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవం ఆలయం నుంచి సరస్వతీనగర్‌లోని మాగుంట సుబ్బరామిరెడ్డి స్వగృహం వరకు సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ ఉత్సవానికి ఉభయకర్తలుగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట విజయారెడ్డి కుటుంబం వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, సహాయ కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు. కాగా సోమవారం ఉదయం 9గంటలకు మోహినీ ఉత్సవం, రాత్రి బంగారు గరుడసేవ నిర్వహించనున్నారు.

మంట కలిసిన మార్గదర్శకాలు !

- మూడేళ్లు దాటినా జిల్లాలోనే పలువురు అధికారులు
- సొంతూరు నిబంధన వారికి వర్తించదా ?
- డీఆర్డీఏ పీడీ, డీపీవో, డీఏవో, జడ్పీ డిప్యూటీ సీఈవోలపై ఫిర్యాదులు
- డీఆర్డీఏ పీడీ, డీఏవో బదిలీ కాకుండా నోడల్ పోస్టుల మార్పు
- ఎన్నికల సమావేశాలకు యథావిధిగా హాజరు
- కృష్ణాలో అధికారుల సరెండర్‌తో చర్చనీయాంశం

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు జిల్లాలో అభాసుపాలవుతున్నాయి. అధికారుల బదిలీలకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఎన్నికల సమయం నాటికి మూడేళ్ల జిల్లాలో పనిచేసిన అధికారులను కచ్చితంగా బదిలీ చేయాలని సూచించింది. అలానే సొంత జిల్లాలో పనిచేస్తున్న జిల్లా స్థాయి అధికారులను కూడా అక్కడి నుంచి బదిలీ చేయాలని ఆదేశించింది. కొన్ని జిల్లా స్థాయి పోస్టులు ఎన్నికలతో సంబంధం లేకపోయినా వారి కింది స్థాయి సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నప్పుడు సదరు అధికారి వారిని ప్రభావితం చేసే ప్రమాదం ఉందని భావించిన ఎన్నికల సంఘం అటువంటి అధికారులను కూడా బదిలీల జాబితాలో చేర్చింది. ఈ మార్గదర్శకాల ప్రకారం చాలా మందిని జిల్లా నుంచి బదిలీ చేశారు. కానీ పలువురు కీలక పోస్టుల్లో ఉన్న అధికారులకు మాత్రం కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు వర్తిస్తున్నట్లు కనిపించడం లేదు. మూడేళ్లు దాటిన వారు, సొంత జిల్లా వాసులైన జిల్లా స్థాయి అధికారులు ఇంకా జిల్లాలోనే కొనసాగుతున్నారు. పేరుకు మాత్రం వీరికి ఎన్నికల విధులు లేకపోయినా ఎన్నికల సమావేశాల్లో మాత్రం పాల్గొంటున్నారు. జిల్లాలోనే ఉంటూ పరోక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సదరు అధికారులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదులు వెళ్లాయి. డీఆర్డీఏ పీడీ, జిల్లా ఆడిట్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ డిప్యూటీ సీఈవోలు ఈ జాబితాలో ఉన్నారు. వీరు ఏ విధంగా ఎన్నికల నిబంధనల కిందకు రారో జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేయాల్సి ఉంది.

ఇంకా సొంత జిల్లాలోనే..!

ఈ జాబితాలోనే జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సుస్మితారెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో చిరంజీవిలు కూడా ఉన్నారు. సుస్మితారెడ్డిది నెల్లూరు సొంత జిల్లా. ఆమె ఎంపీడీవోగా, సెట్నల్ సీఈవోగా, డీపీవోగా మూడేళ్లకు పైగా జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. కానీ ఎన్నికల నిబంధనల ప్రకారం బదిలీ కాలేదు. డీపీవో పోస్టు ఎన్నికలతో సంబంధం లేదంటూనే ప్రస్తుత డీపీవో కలెక్టర్ నిర్వహించే ఎన్నికల సమావేశాల్లో పాల్గొంటున్నారు. డీపీవో కింద పనిచేసే సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారు. జడ్పీ డిప్యూటీ సీఈవో చిరంజీవిది కూడా నెల్లూరు సొంత జిల్లా. ఇటీవల వరకు ఆయన ఇన్‌చార్జి సీఈవోగా కూడా వ్యవహరించారు. డిప్యూటీ సీఈవో పోస్టు ఎన్నికలకు సంబంధం లేదని చెబుతున్నా, ఆయన జిల్లా ఎన్నికల అధికారి నిర్వహించే ఎన్నికల సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఇలా ఎన్నికలకు సంబంధం లేకపోయినా అధికారులు ఎలా ఎన్నికల విధుల్లో జోక్యం చేసుకుంటున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. అది కూడా జిల్లా ఎన్నికల అధికారి సమక్షం లోనే జరుగుతుండడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

కృష్ణాలో సరెండర్

కృష్ణా జిల్లాలో జడ్పీ సీఈవోతో పాటు పలువురు అధికారులు మూడేళ్లకు పైగా పనిచేస్తుండగా, వారి పోస్టులను ఎన్నికల విధుల్లో నుంచి తప్పించారు. దీంతో వారు ఇంకా ఆ జిల్లాలోనే కొనసాగుతూ ఎన్నికల సిబ్బందిపై ప్రభావం చూపుతున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందడంతో రెండు రోజుల క్రితం అక్కడి కలెక్టర్ ఆ అధికారులను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆ వ్యవ హారం తర్వాత అదే మాదిరిగా జిల్లాలో కూడా అధికారులు ఉండడంతో ప్రస్తుతం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరి జిల్లాలోని అధికారులపై ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.



ఈనెల 21న కలెక్టర్ నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న సాంబశివారెడ్డి, తిరుపతయ్య, చిరంజీవి



ఈనెల 18న కమాండ్ కంట్రోల్ సెంటర్లో కలెక్టర్ నిర్వహించిన ఎన్నికల సమావేశంలో పాల్గొన్న సుస్మితారెడ్డి

పోస్టులు తప్పించి.. ఎన్నికల విధుల్లో !

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్(డీఆర్డీఏ పీడీ) సాంబశివారెడ్డి 2020లో జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు జిల్లాలో మూడేళ్ల సర్వీస్ పూర్తయింది.గత ఎన్నికల్లో డీఆర్‌డీఏ పోస్టు అన్నది స్వీప్(ఎన్నికల ప్రచార కార్యక్రమాలు) నోడల్ అధికారిగా ఉండేది. ప్రస్తుతం అదే పోస్టును కొనసాగించి ఉంటే డీఆర్‌డీఏ పీడీ ఎన్నికల నిబంధనల ప్రకారం బదిలీ కావాల్సి ఉంది. కానీ ఈ దఫా ఆయన బదిలీ కాకుండా ఉండేందుకు స్వీప్ నోడల్ అధికారి పోస్టును నుడా వీసీ బాపిరెడ్డికి అప్పగించారు. అయినా సాంబశివారెడ్డి ఎన్నికలకు సంబంధించి స్వీప్ కార్యక్రమం కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిర్వహించే ఎన్నికల సమావేశాలకు కూడా ఆయన హాజరవుతున్నారు. జిల్లా ఆడిట్ అధికారి(డీఏవో) తిరుపతయ్య కూడా మూడేళ్లకు పైగా జిల్లాలో పనిచేస్తున్నారు. గతంలో డ్వామా పీడీ కూడా పనిచేశారు. గడిచిన ఎన్నికల్లో డీఏవో పోస్టు జిల్లా ఎన్నికల ఖర్చుల కోఆర్డినేటర్‌గా ఉండేది. ఇప్పుడు కూడా అదే కొనసాగించి ఉంటే తిరుపతయ్య తప్పనిసరిగా బదిలీ కావాలి. కానీ ఆయన్ను బదిలీ చేయకుండా ఉండేందుకు జిల్లా ఎన్నికల ఖర్చుల కోఆర్డినేటర్ పోస్టును నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ పోస్టుకు బదిలీ చేశారు. దీంతో తిరుపతయ్య ఎన్నికల మార్గదర్శకాల్లోకి రారని చెప్పుకుంటున్నారు. కానీ పేరుకు అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఉన్నా ఎన్నికల ఖర్చుల కోఆర్డినేటర్ వ్యవహారాలన్నీ తిరుపతయ్యనే చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కలెక్టర్ నిర్వహించే ఎన్నికల సమావేశాల్లోనూ తిరుపతయ్య పాల్గొంటుండడం గమనార్హం. ఇవన్నీ పక్కన పెట్టినా తిరుపతయ్య సొంతూరు నెల్లూరు జిల్లా. ఈ ప్రకారం చూసినా ఆయనను బదిలీ చేయాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

27న చంద్రబాబు రోడ్‌షో

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరుకు రానున్నారు. ఆరోజు నెల్లూరు నగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ముందుగా హెలికాప్టర్‌లో పోలీసు పరేడ్ మైదానం చేరుకొని, అక్కడి నుంచి కేవీఆర్ జంక్షన్- గాంధీ బొమ్మ- ట్రంకురోడ్డు మీదుగా నర్తకీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ మేరకు ప్రాథమిక షెడ్యూల్ ఖరారైంది. ఇందుకు సంబంధించి జిల్లా టీడీపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

7 రోజులు.. రూ.75.74 కోట్లు

2023-24 ఆర్థిక సంవత్సరం మరో 7 రోజుల్లో ముగిస్తుంది. ఈ లోపు రూ.75.74 కోట్ల పన్నులు వసూళ్లు చేయాలి. ఇదీ ప్రస్తుతం కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగం ముందున్న లక్ష్యం. కానీ ఇది సాధ్యమేనా!? ఈ ఏడాది రూ.130.02 కోట్ల పన్ను వసూళ్లు లక్ష్యం కాగ ఇప్పటికి రూ.54.28 కోట్లను మాత్రమే రెవెన్యూ అధికారులు ఖజానాకు జమచేశారు. రానున్న 7 రోజుల్లో రూ.75.74 కోట్లు రాబట్టగలరా!? అన్నది ప్రశ్న. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భవనాల నుంచి రూపాయి కూడా వసూళ్లు కాకపోతుండగా, ఖాళీ స్థలాల నుంచి పన్నును రాబట్టడంలో కార్పొరేషన్ అధికారులు నత్తతో పోటీపడుతున్నారు.



- నెల్లూరులో పన్ను వసూళ్లకు లక్ష్యం
- రూ.130 కోట్లకు రూ. 54 కోట్లే వసూలు
- నెలాఖరుతో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- ఎన్నికల విధుల సాకుతో చేతులెత్తేస్తున్న ఆర్‌ఐలు

130.02 కోట్లు పన్ను వసూళ్ల లక్ష్యం పెట్టుకున్న రెవెన్యూ విభాగం అందులో కేవలం రూ.54.28 కోట్లు మాత్రమే వసూళ్ల చేశారు.

నెల్లూరు (సిటీ), మార్చి 24 : నగర పాలక సంస్థ లెక్కల ప్రకారం 1,33,116 ప్రైవేట్ భవనాలు ఉండగా వీటి నుంచి ఈ ఏడాది రూ.97.86 కోట్లు ఆస్తి పన్ను వసూళ్ల చేయాల్సి ఉంది. కానీ రూ.45.70 కోట్లు మాత్ర మే వసూళ్ల అయింది. ఇక ఖాళీ స్థలాలు 6,567 ఉండగా, రూ.17.76 కోట్లు లాభం ఆర్జించాలని లక్ష్యం పెట్టుకోగా, కేవలం రూ.6.73 కోట్లు మాత్రమే వసూలు అయ్యింది. ఇక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 400 భవనాల నుంచి రూ.12.37 కోట్లు వసూళ్ల చేయాల్సి ఉండగా కేవలం రూ.1.83 కోట్లు మాత్రమే ఖజానాకు చేరాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాల యాలు 36 ఉన్నట్లు లెక్కకట్టిన ఎస్‌ఎంసీ అధికారులు వాటి ద్వారా రూ.2.21 కోట్లు రావాల్సి ఉండగా, రూ.2 లక్షలు మాత్రమే వసూళ్ల అయింది. ఈ లెక్కన అన్నీ విభా గాల నుంచి 1,40,119 అసెస్‌మెంట్ల ద్వారా రూ.

కలిసొచ్చిన ఎన్నికల క్రతువు

నెల్లూరులోని 54 డివిజన్లకు సుమారుగా 12 మంది ఆర్‌ఐలు, ముగ్గురు ఆర్వోలు, ఒక డీసీని పన్ను వసూళ్ల కోసమే కేటాయించారు. ఆర్థిక సంవత్సరం గడువు ముగిస్తున్న కొద్దీ కమిషనర్ వికాస్ పన్ను వసూళ్లపై పట్టుబట్టడంతో ఊపిరి పీల్చుకోలేని అధికారులకు సార్వత్రిక ఎన్నికల క్రతువు సాకుగా దొరికింది. ఆర్‌ఐలు అంతా పోలింగ్ బూతులు, బీఎల్వోలపై సూపర్‌వైజర్లుగా, ఆర్వోలు ఎన్నికల ప్రత్యక్ష ప్రక్రియలో ఉండటంలో పన్ను వసూళ్లకు బ్రేకులు పడుతున్నాయి. కాగ నెల్లూరులోని 166 సచివాలయాల సిబ్బంది ద్వారా పన్ను వసూళ్లకు పురామాయిస్తే ఆశించిన ఫలితాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

వారంలో సాధ్యమేనా!?

పన్ను వసూళ్లకు భారీ లక్ష్యంతో రంగంలోకి దిగిన కార్పొరేషన్ అధికారులు ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్యం చేరుకుంటారా!? అన్నది సర్వత్రా ఆసక్తిగా మారింది. ఖజానాలో రూపాయి లేని ఈ సమయంలో ఆదాయం వైపు ఏ మాత్రం పరుగులు తీస్తారన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.

గీత దాటితే.. వేటు తప్పదు !

- పార్టీల ప్రచారంలో వలంటీర్లు, డీలర్లు, ఉపాధి సిబ్బంది, వీఏవోలు
- ఇప్పటికే కొందరి తొలగింపు
- అయినా ఆగని రాజకీయ జోక్యం


నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏరుదాటి తెప్ప తగలేసినట్లు... రాజకీయ నేతలను ఉద్దేశించి విస్తృతంగా ప్రచారంలో ఉన్న సామెత ఇది. అంతా తెలిసినా, ఇప్పుడు నెత్తినపెట్టుకున్న నాయకులు ఎన్నికల తరువాత ఎక్కడ పెడతారో స్పష్టంగా తెలిసినా కొంతమంది అమాయకంగా వ్యవహరిస్తున్నారు. విపరీతమైన స్వామి భక్తితో ఉన్న చిన్నపాటి ఉపాధి అవకాశాన్ని కూడా శాశ్వతంగా చేజార్చుకొంటున్నారు. ఒకరి పల్లకి మోసే మోజులో భార్య బిడ్డల భవిష్యత్తును పణంగా పెడుతున్నారు. ఎన్నికల సందర్భంగా అలాంటి సంఘటనలే చోటు చేసుకొంటున్నాయి. రాజకీయ నాయకుల మీద వెర్రి అభిమానంతో ఎన్నికల కమిషన్ వేటుకు గురవుతున్నారు. తమను నమ్ముకున్న కుటుంబ సభ్యులను వీధినపడేస్తున్నారు.

అయినా లెక్కచేయని వైనం

ఎన్నికల కమిషన్ ఎంత గట్టిగా ఆదేశించినా కొంత మంది హద్దు మీరుతూనే ఉన్నారు. అధికార పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటూ అడ్డంగా దొరికిపోయి ఉపాధి అవకాశాలను పోగొట్టుకొంటున్నారు. జిల్లాలో ఇలా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న 11 మంది వలంటీర్లను శాశ్వ తంగా విధుల నుంచి తొలగించారు. వీరితో పాటు ఉపాధి హామీ ఫీల్డు అసిసెంట్లు, వీఏవోలు, రేషన్ షాపు డీలర్లను కూడా తొలగించారు. అయినా ఇంకా అక్కడక్కడా రాజకీయ కార్యకలాపాల్లో వారు పాల్గొం టూనే ఉన్నారు. తమకు ఇదివరకే ఏదో మేలు చేశారనో, భవిష్యత్తులో చేస్తారనో..! ఆశతో ఉన్న ఉపాధి అవకాశాన్ని పోగొట్టుకొంటున్నారు. కుటుంబ సభ్యులను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడంతో పాటు మానసి కంగా కూడా వేదనకు గురిచేస్తున్నారు.

తెలుసుకో తమ్ముడూ...!

అవసరం పూర్తయిన తరువాత ఎదుటి మనిషి తీరులో మార్పు రావడం సహజం. రాజకీయ నాయకుల్లో ఈ స్వభావం మరి ఎక్కువ. ఎదుటి వారి కోసమో, నచ్చిన వ్యక్తి, పార్టీ కోసమో చేతనైన సాయం చేయడం మంచిదే. కాని అది హద్దుల్లో ఉండాలి. మీకు నచ్చిన పార్టీకి ఓటు వేసుకునే హక్కు మీకుంది. అదే మీకు నచ్చిన పార్టీకి ఓటే వేయండి అని ప్రచారం చేసే హక్కు మాత్రం ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు లేదు. ఆ తేడాను తెలుసుకొని జాగ్రత్తగా మలుచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోజు ఆవేశంతో పట్టుకున్న జెండా, ఉద్యోగం పోతే అండగా నిలబడుతుందన్న గ్యారెంటీ లేదు. కాని ఉద్యోగం కోల్పోతే మాత్రం ఆర్థికంగా, సామాజికంగా మీరు మీ కుటుంబం పలుచన వుతారని, సంక్షోభంలో కూరుకుపోతారన్న సత్యాన్ని ఎన్నికల కమిషన్ ఆంక్షల చట్రంలో ఉన్న చిరు ద్యోగులు గుర్తించాల్సిన అవసరం ఉంది. నచ్చిన నాయకుడి కోసం నమ్ముకున్న కుటుంబానికి అన్యాయం చేయకూడన్న వాస్తవాన్ని గుర్తించి నడుచుకోవాలి.



నిబంధన బేఖాతర్

ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొనకూడదనే నిబంధన ఎప్పటి నుంచో ఉంది. అయితే ఇటీవల కొత్తగా ఏర్పడిన వలంటీర్ల వ్యవస్థను ఎన్నికల సంఘం ఈ జాబితాలో చేర్చింది. వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు వెనుకే రాజకీయ ప్రయోజనం ఉందని, సొంత పార్టీ కార్యకర్తలుగా వీరిని వాడుకోవటానికి వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని వీరికి జీతంగా ఇస్తోందనే ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. అసలు రాజకీయ కోణంలో వలంటీర్లు టార్గెట్ అయినంతగా మరేశాఖ ఉద్యోగులు కాలేదు. ఎన్నికల సంఘం సైతం ఈ ఆరోపణలతో ఏకీభవించిన క్రమంలో వలంటర్లు ఎన్నికల ప్రచారాల్లో కాని, ఎన్నికల విధుల్లో కాని పాల్గొన డానికి వీలు లేదంటూ ఆదేశించింది. వీరితోపాటు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఏవోలు, రేషన్ షాపు డీలర్లను కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన కూడదని ఆదేశించింది. ఈ నాలుగు కేటగిరీలవాళ్లు క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధం ఉన్నవారే. ప్రజలను ప్రభావితం చేయగలిన అవకాశం ఉన్నవారే. ఈ కారణంగా ఎన్నికల కమిషన్ వీరిని గట్టిగా ఆక్షేపించింది. ఆదేశాలను కాదని హద్దు మీరితే శాశ్వతంగా తొలగించమని ఉత్తర్వులు ఇచ్చింది.

ఎట్టకేలకు ఇసుక రీచ్‌లకు బ్రేక్

- హైకోర్టు ఆదేశాలతో కదలిన యంత్రాంగం
- ఇప్పటికే ఇతర ప్రాంతాలకు ఇసుక డంపింగ్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) మార్చి 24: జిల్లాలోని ఇసుక రీచ్‌ల్లో అనుమతి లేకుండానే సాగిస్తున్న తవ్వకాలను అధికారులు ఎట్టకేలకు నిలిపేశారు. ఐదేళ్లగా జేపీ, ఇటీవల ప్రతిమ సంస్థలు ఇష్టానుసారంగా జిల్లాలోని ఎనిమిది రీచ్‌లు,రెండు డీ సిలిటేషన్ పాయింట్లు, పలు డంపింగ్ యార్డ్‌ల్లోనూ ఇసుక అమ్మకాలు సాగించాయి. ప్రతిపక్షాలతోపాటు మీడియా కూడా ఎన్నోసార్లు అక్రమాలను ఎత్తిచూపినా పట్టించుకోని అధికారులు ఎట్టకేలకు హైకోర్టు ఆదేశాలతో కదిలారు. జిల్లాలోని అన్ని ఇసుక రీచ్‌ల్లో అమ్మకాలకు ఆదివారం నుంచి బ్రేక్ వేశారు. పర్యావరణ అనుమతి లేకపోవడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారని పలువురు హైకోర్టులో పిటీషన్లు వేశారు. స్పందించిన హైకోర్టు పూర్తిస్థాయి నివేదికలు ఇవ్వాలని ఆదేశించింది. దీంతో కలెక్టర్, మైనింగ్‌శాఖ అధికారులు పలు ఇసుక రీచ్‌లను పరిశీలించి నివేదికలు అందించారు. ఎన్నికల కోడ్ రావడంతో జిల్లా అధికార యంత్రాంగం వాస్తవ పరిస్థితులను హైకోర్టుకు నివేదించారు. దీంతో వెంటనే రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలను హైకోర్టు నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. కాగా హైకోర్టు ఆదేశాలతో అధికారులు రీచ్‌లను పరిశీలిస్తున్నారు.దీంతో వెంటనే నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి పరిస్థితులు తలెత్తుతాయోనని రీచ్‌ల నుంచి ఇప్పటికే భారీగా ఇతర ప్రాంతాలకు ఇసుకను డంప్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అక్రమార్కులు డంప్ చేసిన ఇసుకను కూడా అక్రమంగా తరలిస్తున్నారు.



పల్లెపాడు రీచ్‌లో భారీగా ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

అరవపాలెంలో పలువురు టీడీపీలో చేరిక

సంగం, మార్చి 24: జండాదిబ్బ పంచాయతీలోని అరవపాలెంకు చెందిన అత్తిపాటి రామచంద్రయ్య ఆధ్వర్యంలో కరకంబాకం ఆది, హజరత్తయ్య, మస్తాన్, తాండ్ర రాధయ్య, నెల్లూరు ప్రసాద్, చంద్రశేఖర్, అత్తిపాటి పెంచలయ్య, మల్లి, హజరత్తయ్య, విటపురెడ్డి బాలాజీ, తాండ్ర నవీన్‌లు ఆదివారం టీడీపీలో ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో పార్టీలో చేరారు. నెల్లూరులోని ఆనం రామనారాయణరెడ్డి స్వగృహంలో టీడీపీ కండువా వేసి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో ఆనం ప్రసాద్ రెడ్డి, రఘురామయ్య ఉన్నారు.

కుల్లూరులో వైద్య శిబిరం

కలువాయి, మార్చి 24: కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ప్రముఖ న్యూరాలజిస్ట్ బిందుమీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మూర్ఛ, పక్షవాతం, కీళ్ల నొప్పుల రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు బిందుమీనన్‌తో పాటు గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది

అనంతసాగరం, మార్చి 24: మండలకేంద్రంలో ఆదివారం వైద్యసిబ్బంది క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. టీబీ వ్యాధి లక్షణాలు, నిర్మూలన పద్ధతులను ప్రజలకు వివరించారు. అనంతసాగరం పీహెచ్‌సీలో టీబీ, నాట్ పరీక్షలు అందుబాటులోకి వచ్చినట్లు వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి తెలిపారు.

బీసీ నాయకుల సమావేశం



మన్నేటి వెంకటరెడ్డిని సన్మానిస్తున్న ఫోరం సభ్యులు

ఉదయగిరి రూరల్, మార్చి 24: గంగిరెడ్డిపల్లిలోని స్వగృహంలో ఏఎంసీ చైర్మన్ మాజీ మన్నేటి వెంకటరెడ్డి మండల బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లను అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాగే ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నేటి వెంకటరెడ్డిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపాలు, సభ్యులు కదిరి రంగరావు, మేకపాటి మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

ఉదయగిరి, మార్చి 24: పేద విద్యార్థులు ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు గడువు పెంచినట్లు ఉదయగిరి ఎంఈవో-2 తోట శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 31లోపు సమీప సచివాయాలు, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బూత్ కన్వీనర్లకు శిక్షణ

మర్రిపాడు, మార్చి 24: బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంతో ఇంటింటికి ఆరు గ్యారెంటీలను తీసుకెళ్లాలని 43బూత్ కన్వీనర్లకు ఆదివారం టీడీపీ మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్ధన్‌నాయుడు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శాఖ మూరి నారాయణ, మాజీ మండలాధ్యక్షుడు సుబ్బారెడ్డి, తలచీరు సుబ్బరాయుడు, లక్ష్మీనరసయ్య, యలగాల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

పెట్రోలు బంకుల తనిఖీ

చేజర్ల, మార్చి 24: ఆదురుపల్లిలోని ఇండేన్, ఎచ్‌పీసీఎల్ పెట్రోలు బంకులను ఆదివారం తహసీల్దారు కే.గోపికృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్చి 16 నుంచి జరిగిన విక్రయాలను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసే వారి వివరాలను తహసిల్దారు కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీల ర్యాలీ సమయాల్లో బైక్‌లతో పాటుఇతర వాహనాలకు పెట్రోలు, డీజిల్ పట్టించటం వంటివి జరుగుతాయని, వీటిని అభ్యర్థి ఎన్నిలకు ఖర్చులకు జమచేసి వాటి వివరాలను కూడా తెలియజేయాలన్నారు. అనంతరం బంకుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, మార్చి 24: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన పొదిలి తిరుపాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు వారి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆదివారం టీడీపీ నాయకులు బాధితకుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలను అందజేశారు. టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, ఓబులరెడ్డి, నల్లిపోగు రాజా, నరసింహ, కాంతారావు, మట్ల మురళి పాల్గొన్నారు.

చేతిపంపులు.. నిరుపయోగం



సీతారామపురం బస్టాండ్ కూడలిలో నిరుపయోగంగా చేతి పంపు

సీతారామపురం: మండలంలోని 14పంచాయతీల్లో 550 చేతిపంపులున్నాయి. వాటిలో అతి తక్కువ చేతిపంపులు మాత్రమే పని చేస్తున్నాయి. కొన్ని తుప్పు పట్టి ఉన్నాయి. అన్ని గ్రామాలకు తాగునీటి పథకాలతో నీటి సరఫరా జరుగుతోంది. ఇటీవల విద్యుత్ కోతలతో వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయలు కలుగుతున్నాయి. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో తరచూ విద్యుత్ సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చేతిపంపులే ప్రత్యామ్నాయం అయ్యాయి. ఇవి సరిగా పనిచేయకపోవడంతో ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. గ్రామీణప్రాంతాల్లో 50శాతం మేరకు చేతిపం పులుతుప్పు పట్టి, మొండెం లేకుండా రోడ్లపై దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. లక్షల ప్రజాధనం వెచ్చించి వీటిని ఏర్పాటు చేస్తే మరమ్మతులకు నోచుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు



సంగం: ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారుల బృందం

సంగం, మార్చి 24: పెన్నా నది ఇసుక రీచ్ నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సెబ్, రెవెన్యూ, మైనింగ్ అధికారుల బృందం హెచ్చరించారు. ఆదివారం వారు సంగం ఇసుక రీచ్‌ను పరిశీలించారు. అధికారుల వస్తున్నారని సమాచారం అందుకున్న రీచ్ నిర్వాహకులు యంత్రాలను గట్టు మీద ఉన్న ముళ్ల పొదలచాటుకు తరలించారు. రీచ్‌లో వాహనాలు లేకపోవడంతో అధికారుల బృందం వెనుతిరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఇసుక తరలింపుకు అనుమతి లేదన్నారు. వారివెంట మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, విజిలెన్స్ ఏడీ బాలాజీనాయిక్, సెబ్ సీఐ యశోధర, తహసీల్దారు రమాదేవి తదితరులు ఉన్నారు.

అనంతసాగరం: సోమశిల సమీపంలోని పడమటికంబంపాడు ఇసుకరీచ్‌ను ఆదివారం మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఇసుక అక్రమ రవా ణాకు సంబంధించిన వివరాలు సేకరించారు. నిబంధనలకు విరుద్ధంగా రవాణా జరిగేతే చర్యలు తప్పవన్నారు.

నాయకులతో టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడి సమావేశం

సీతారామపురం, మార్చి 24: స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో నాయకుడు చింతల శ్రీనువాసులు ఆధ్వర్యంలో ఆదివారం కార్యకర్తలు, నాయకులతో సమావేశం అయ్యారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు మాట్లాడారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు 8మండలాలకు లీగల్ సెల్ కమిటీని ఏర్పాటు చేశామని, ఎలాంటి ఇబ్బంది వచ్చినా పరిష్కరించేందుకు పార్టీ లీగల్ సెల్ కమిటీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, మండల క్లస్టర్ ఇంచార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, షేక్‌బాబు, చెన్నకేశవులు, గాజులపల్లి చంద్రారెడ్డి, పిడుగు రమేష్, రఘు, ఇబ్రాయిల్ ,తిరుపతయ్యమండల ట్రస్ట్ కోఆర్డినేటర్ సుమన్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



అనంతసాగరం: వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

అనంతసాగరం: స్థానిక సెంటనరీ తెలుగు బాపిస్టు చర్చిలో ఆదివారం మట్టల వేడుక నిర్వహించారు. సండే స్కూల్ చిన్నారులు, సంఘం పెద్దలు, సభ్యులు ఈత మట్టలను అలంకరించి ప్రత్యేక ర్యాలీ చేపట్టారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ రాజ్‌కుమార్, వడ్లపల్లి వెంకటేశ్ పాల్గొన్నారు.



ఉదయగిరిలో..

ఉదయగిరి: గండిపాళెం, వెంగళరావునగర్, వీరారెడ్డిపల్లి, ఉదయగిరి, గన్నేపల్లి, సర్వరాబాదు, కృష్ణంపల్లి, బోడబండ, దాసరిపల్లి గ్రామాల్లో క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారాని నిర్వహిం చారు. మట్టలను చేతబట్టి ప్రదర్శనగా చర్చిలకు ప్రార్థనలు చేశారు. కార్యక్ర మంలో ఫాస్టర్ సుధీర్‌కుమార్, సంఘ పెద్దలు ప్రసాదరావు, జాషువా, బెస్లింగ్టన్, రాబర్ట్ ప్రభాకర్, ఏసుదాసు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ఆర్టీసీ రోడ్డు, బస్టాండు

వింజమూరు, మార్చి 24: పట్టణంలోని ఆర్టీసీ రోడ్డు..ఆర్టీసీ బస్టాండు మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ రోడ్డులో బ్రాందీ షాపు, సినిమా హాలు, ఆర్టీసీ బస్టాండు ఉన్నందున ప్రయాణికులు సినీప్రేక్షకులు తాకిడి ఎక్కువగా ఉంటుంది. బ్రాందీ షాపు పక్కన బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసుకుని ఉదయం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. అత్యధిక రేట్లు అమ్ముకుంటూ మందుబాబులకు ఎనీటైం మందు అందజేస్తున్నారు. మందుబాబులు రోడ్డుమీదే మద్యం సేవిస్తూ అక్కడే మూత్రవిసర్జన చేస్తూ రోడ్డును అసౌకర్యంగా, అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రాత్రి కాదు, ఉదయం వెళ్లేందుకు మహిళలు, చిన్నపిల్లలు జంకుతున్నారు. నిత్యం జనసంచారం ఉన్న ఈ రోడ్డు మీద మద్యం షాపును తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రతిభా అవార్డులు



ఉదయగిరి రూరల్ : ప్రశంసాపత్రం అందుకుంటున్న దుత్తలూరు వైద్యులు అయూబ్ అప్సర్



కలువాయి : అవార్డుతో చలమయ్య



అవార్డు అందుకుంటున్న ఉదయగిరి వైద్య సిబ్బంది

కలువాయి: తోపుగుంట సబ్‌సెంటర్ హెల్త్ అసిస్టెంట్ చలమయ్య ఆదివారం జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారితో జిల్లా స్థాయి ప్రతిభా అవార్డు తీసుకున్నారు.

ఉదయగిరి రూరల్: గండిపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెల్త్ అసిస్టెంట్ మన్సూర్ అలీ, ఏఎన్ఎం స్వాతి, ఆశ కార్యకర్త అంకమ జిల్లా క్షయ వ్యాధి నియంత్రణాధి కారి ఖాదర్‌వలి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా నెల్లూరు డీఎంహెచ్‌వో కార్యాల యంలో జరిగింది.

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అయూబ్‌అప్సర్, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీలు ఉత్తమ సేవలు అందించినందుకు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. జిల్లా క్షయవ్యాధి నియంత్రణాధికారి ఖాదర్‌వలి చేతలు మీదుగా వారు ప్రశంసాపత్రం అందుకున్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న శివలీల

ఆత్మకూరు, మార్చి 24: ప్రతి మనిషి మాంసాహారాన్ని వీడి శాకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతుడు అవుతాడని సీనియర్ పిరమిడ్ మాస్టర్లు శివలీల, డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక షిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో నిర్వహించిన ధ్యాన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మనిషిలో ప్రశాంతత పెరిగేకొద్దీ శక్తిసామర్థ్యాలు పెరిగి.. విజయాలు సాధిస్తాడని చెప్పారు. ధ్యానసాధకులు సజ్జనసాంగత్యంతో పాటు ఆత్మవిజ్ఞాన పుస్తకాలు ఎక్కువగా చదవాలన్నారు. బుద్ధభగవానుడి అష్టాంగమార్గం మనశ్శాంతికి, ముక్తికి మంచిమార్గమని వివరించారు. కార్యక్రమంలో చంద్రా విజయమ్మ, మూరంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, పలువురు ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో మేకపాటి పర్యటన

ఉదయగిరి రూరల్, మార్చి 24: వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం పట్టణంలోని నాగులబావివీధి, సుద్దబావివీధి, రజకవీధి, వాల్మీకివీధుల్లో గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఓబులరెడ్డి, ఎంపీపీ మూలె పద్మజా వినయ్‌రెడ్డి, జెడ్పీటీసీ మోడి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

సీతారామపురం : పోకలవారిపల్లిలో కాకి జాన్‌చిన్నయ్య సంతోషమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘటిక సిద్దేశ్వరం కూడలి వద్ద ఆదివారం టీడీపీ నాయకులు చింతల శ్రీనువాసులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జాషువా, వీ వెంకటేశ్వర్లు, షేక్ బాబు, చెన్నకేశవులు, గాజులపల్లి చంద్రారెడ్డి, రఘు, ఇబ్రాయిల్, పీ రమణయ్య, మాజీ ఎంపీపీ అబ్రహం పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పల్లెలే నయం!

- శివారు ప్రాంతాల్లో తిష్టవేసిన సమస్యలు
- పన్నుల భారం తప్ప కానరాని అభివృద్ధి



అధ్వానంగా బుడమగుంట ప్రాంతంలోని రోడ్డు

కావలిటౌన్, మార్చి 24: కావలి పట్టణ శివారు ప్రాంతాలైన బుడమగుంట, మద్దూరుపాడు, ముసునూరు ప్రాంతాలను 2014లో పట్టణ పరిధిలో విలీనం చేశారు. అయినా ఎక్కడ చూసినా మట్టి రోడ్లు, మరుగు నిల్వలు, పేడ దిబ్బలు తప్ప అభివృద్ధి జరిగిన దాఖలాలే లేవు. పేరుకే పట్టణం.. పన్నుల భారం తప్ప అభివృద్ధి జరగక ఎక్కడికక్కడ సమస్యలు తిష్టవేసి కనీస వసతులు కరువై ప్రజలు అల్లాడుతున్నారు. అయినా పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో పల్లెలే నయంగా ఉన్నాయి. పన్ను పోట్లు, ఆస్తుల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడం తప్ప ఒరిగిందేమీ లేదని ఆప్రాంతాల ప్రజలు వాపాతున్నారు.

- బుడమగుంట, మద్దూరుపాడు, ముసునూరు ప్రాంతాల్లో ప్రధానం గా రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రు. నాలుగు చినుకులు పడితే మట్టి రోడ్లు రొచ్చుగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. డ్రైన్‌ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిల్వ చేరి దుర్గంధభరిత వాతావరణం నెలకొనడంతో పందులు, దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. దోమల వల్ల సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతూ ప్రజలు అనారోగాల బారిన పడుతున్నారు. ఆ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు లేకపోవడంతో పట్టణంలోని ఏరియా వైద్యశాలను ఆశ్రయిస్తూ అధిక వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. తాగేందుకు శుద్ధి నీరులేక అందుబాటులో ఉండే బావుల నీరు, మున్సిపాలిటీవారు వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే కలుషిత నీరే తాగాల్సిన దుస్థితి.

పట్టణ అభివృద్ధికి పాలకులు అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో శివారు ప్రాంతాలకు ప్రాధాన్యత కల్పించకపోవడం, వాటి ఊసేలేకపోవడం చూస్తుంటే బుడమగుంట, ముసునూరు, మద్దూరుపాడు ప్రాంతాలు పట్టణంలో విలీనమయ్యాయా లేక పల్లెటూర్లుగానే ఉన్నాయా అర్థం కావడం లేదు. మాస్టర్ ప్లాన్‌లో శివారు ప్రాంతాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించి ఆప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

- పట్టణ పరిధిలో ఎంతోకొంత అభివృద్ధి జరుగుతున్నప్పటికీ శివారు ప్రాంతాల అభివృద్ధి పట్ల పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పాత పట్టణ పరిధిలోని ప్రాంతాల్లో వేసిన సీసీ రోడ్లపైనే రోడ్లు వేసుకుంటున్నారని, రోడ్లు లేక మట్టి రోడ్లతో ఇబ్బందులు పడే శివారు ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నది స్థానికుల ఆరోపణ. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా ట్యాంకర్ల ద్వారా కలుషిత నీరు సరఫరా చేస్తూ దొంగ లెక్కలు చూపిస్తూ నేతలు, అధికారులు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

మాస్టర్ ప్లాన్‌లో శివారు ప్రాంతాలేవి?

అండగా ఉంటాం.. టీడీపీని గెలిపించండి

- టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



టీడీపీ, జనసేన, బీజేపీల సమావేశంలో వేమిరెడ్డి, ఇంటూరి

కందుకూరు, మార్చి 24 : రాబోయే రోజుల్లో కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, మీ అందరికి అండగా ఉంటామని, ప్రతి ఒక్కరు తెలుగుదేశం విజయం కోసం కృషి చేయాలని నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. కందుకూరులో ఆదివారం రాత్రి జరిగిన తెలుగుదేశం, జనసేన, బీజేపీల నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమావేశం వేమిరెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు పెద్దబజారులోని సీతారామ కల్యాణ మండపంలో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలోనూ ఆయన పాల్గొన్నారు. కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతు రానున్న రోజుల్లో ఎంపీగా కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా అండదండలు అందిస్తానని, ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావుని, ఎంపీగా నన్ను గెలిపించేందుకు మూడు పార్టీల కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి తనవంతు తోడ్పాటుని అందిస్తానన్నారు. కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతు రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో మాఫియా ప్రభుత్వం నడుస్తుందని, సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు తాయిలాలు ఇచ్చి నిలువు దోపిడీ చేశారని విమర్శించారు. చివరికి డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్‌లో కూడా వైసీపీ నేతలు మునిగిపోయి యువత భవిష్యత్తుని సర్వనాశనం చేశారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని కందుకూరులో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు చల్లా శ్రీనివాసరావు, జనిగర్ల నాగరాజు, నార్ని రోశయ్య, ముచ్చు శ్రీను, మాదాల లక్ష్మీ నరసింహం, ఎస్‌వీ రమణయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు దూండీ రాకేష్, బీజేపీ నాయకులు ఘట్టమేని హరిబాబు, ఉన్నం భాస్కరరావు, మన్నెపల్లి వరప్రసాదరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



వేమిరెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతూ...

వేమిరెడ్డికి ఘన స్వాగతం : వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సింగరాయకొండ సమీపంలో జాతీయ రహదారిపై కందుకూరు అడ్డరోడ్డు వద్ద ఇంటూరి నాగేశ్వరరావుతోపాటు డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, ఇతర పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి భారీ వాహన కాన్వాయ్‌గా కందుకూరుకి తీసుకొచ్చారు. తొలుత మాజీ ఎమ్మెల్యే దివి శివరాం నివాసంకు చేరుకున్న వేమిరెడ్డి, ఇంటూరిలు ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన సూరం చిరంజీవి రెడ్డి, పులిచర్ల సుబ్బారెడ్డిలతోపాటు గుడ్లూరు, లింగసముద్రం మండలాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు, నాయకులు వేమిరెడ్డి సమక్షంలో ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

టీడీపీలోకి వాల్మీకి సంఘం నాయకులు

కందుకూరు, మార్చి 24: కందుకూరు పట్టణంలోని పలు వార్డులకు చెందిన వాల్మీకి సామాజికవర్గం నాయకు లు ఆదివారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీకి జై కొట్టారు. నల్లబోతుల మురళి, జల్లి రంగస్వామి, పాలేటి హైమావతిల ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వాల్మీకి సంఘ నేతలకు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే గుడ్లూరు మండలం స్వర్ణాజిపురంకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కందుకూరులోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని తెలుగుదేశం పార్టీలో చేరారు. కాగా నాగేశ్వరరావుకు టికెట్ దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంకమ్మ ఆలయంలో టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ క్రిస్టియన్‌సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి అన్నదానం చేశారు. నాయకులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, ముచ్చు వేణు, గుడ్లూరు మండలానికి చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

బిట్రగుంట, మార్చి 24: దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన నరరూప రాక్షసులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బోగోలులో అంబేద్కర్ విగ్రహ కూడలిలో దళిత, బీసీ నేతలతో కలసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పాచిగుంట దళితవాడకు చెందిన సుధాకర్ గ్రావెల్ మాఫియాపై తిరగబడడంతో. మాకే అడ్డం పడుతావా అంటూ గ్రావెల్ మాఫియా డాన్ నాగరాజు ఉదయాన్నే సుధాకర్ ఇంటికి వెళ్లి అందరు చూస్తుండగా తీసుకెళ్లి అతికిరాతకంగా ముక్కలు చేసి సాయంత్రానికి కుటుంబ సభ్యులకు అందచేయడం దారుణమన్నారు. జగనన్న పాలనలో దళితులను కిరాతకంగా హత్యలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరి తేజ, సాదుప్రసాద్, దుగ్గిరాల తిరవళ్లూరు, ఎల్.వెంకటకిశోర్, తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటి గూటికి పాటిబండ్ల



పాటిబండ్లకు కండువా కప్పుతున్న పసుపులేటి

కావలిరూరల్, మార్చి 24: కావలిరూరల్ మండలం కొత్తపల్లికి చెందిన పాటిబండ్ల క్రిష్ణయ్య ఆదివారం కావలి నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్న పసుపులేటి సుధాకర్‌ను కలిసి ఆయనకు మద్దతు తెలిపారు. దీంతో ఆయన కండువా వేసి ఆహ్వానించారు. గతంలో టీడీపీలో ఉండిన క్రిష్ణయ్య కొంత కాలంగా ఆపార్టీకి దూరంగా ఉంటూ వైసీపీతో సఖ్యతగా మెలుగుతుండారు. ఇప్పుడు స్వతంత్ర అభ్యర్థి సుధాకర చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి ఆయన వెంట నడుస్తున్నట్లు చెప్పారు.

పేద వృద్ధులను ఆదరించాలి



నిత్యావసరాలు అందజేస్తున్న వైద్యులు

కావలి, మార్చి 24: ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోతున్న తరుణంలో వృద్ధులకు ఆదరణ తగ్గిందని, పేద వృద్ధులను ప్రతి ఒక్కరు ఆదరించాలని సీనియర్ డాక్టర్లు శాంతకుమారి, క్రిష్ణమూర్తిలు పేర్కొన్నారు. డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న ఆ సేవా సమితి కార్యాలయంలో 70 మంది పేద వృద్ధులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ డీఆర్ సమాజానికి చేసిన సేవలు అమూల్యమని, ఆయన మార్గంలో విద్యాసంస్థలు నిర్వహిస్తూ పేదలకు సేవలు అందిస్తున్న ఆయన కుమారులు వినయకుమార్‌రెడ్డి, విద్యాధర్‌రెడ్డిలు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ వినయ్‌కుమార్‌రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డి పతనమే లక్ష్యంగా పనిచేయాలి : కావ్య



టీడీపీలో చేరిన కాపు నేతలతో కావ్య, మాలేపాటి

కావలి, మార్చి 24: కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని రాజకీయంగా పతనం చేయడమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని మానసహాల్ సెంటర్‌లోని 3వ క్లస్టర్ కార్యాల యంలో జరిగిన సమావేశంలో అభ్యర్థి కావ్య క్రిష్ణారెడి, మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు సమక్షంలో 34వ వార్డుకు చెందిన ఊసా వెంకట్రావు, 28, 30 వార్డులకు చెందిన నాగిశెట్టి మాలకొండయ్య నాయుడు తదితర కాపు నేతలు తమ అనుచరులతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 35వ వార్డుకు చెందిన కొమరా రమణయ్య, చిట్టిపల్లి మనోహర్, కుంచాల ప్రేమకుమర్, షేక్ నాగూరువలి ఆధ్వర్యంలో పలువురు మస్లింలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, నేతలు పోతుగంటి అలేఖ్య, కొండూరు పోలిశెట్టి, పోట్లూరు శ్రీనివాసులు, మన్నవ రవిచంద్ర, సూరిశెట్టి రామక్రిష్ణ, జనసేన నాయకులు పొబ్బా సాయివిఠల్, రుషికేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల పరిచయ వేదిక

టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డితో కావలి పట్టణ ఆర్యవైశ్యుల పరిచయ వేదిక కార్యక్రమం ఆదివారం స్థానిక బృందవనం హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామక్రిష్ణ, బీజేపీ సీనియర్ నాయకుడు కందుకూరి వెంకటసత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య పాల్గొన్నారు

స్థిరాస్తులను లాగేసుకునే కుట్ర

ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌తో ప్రజల స్థిరాస్తులను లాగేసుకునేందుకు జగన్‌రెడ్డి కుట్ర పన్నారని కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, జనసేన నియోజకవర్గ లధికారప్రతినిధి రుషికేష్ తదితరులు పాల్గొన్నారు.

వంద మంది టీడీపీలో చేరిక

జలదంకి, మార్చి 24: మండలంలో బ్రాహ్మణక్రాకకు చెందిన మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణగోపాలరెడ్డి అనుచరులు బీసీ నాయకుడు వల్లెపు వేడుకొండలు, ఎస్సీ నాయకుడు గోచిపాతల మాలకొండయ్య, కావలి మధుబాబుల ఆధ్వర్యంలో 100 మందికిపైగా ఆదివారం నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడి ప్రభాకరరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నెల్లూరులోని వేమిరెడ్డి కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి వేమిరెడ్డి, వంటేరులు పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు.

వైసీపీ వార్డు మెంబరు...

బిట్రగుంట : బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ వైసీపీ 1వ వార్డు మెంబరు కాకాని రమేష్ ఆదివారం మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, పైడి హర్ష, దాసరి శ్రీనువాసులు ఆధ్వర్యంలో కావలి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎల్.సుధీర్‌బాబు, రావినూతలరాము, తదితరులు ఉన్నారు.